PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 180 | విజయవాడ, శనివారం 1 ఫిబ్రవరి 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 1 February 2025 | Rs

కలెక్టర్ల సదస్సు వాయిదా ?

- ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం

2



ఫైనల్లో యువ భారత్

- సెమీస్‌లో ఇంగ్లండ్‌పై ఘన విజయం
- ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్

(లోపలి పేజీల్లో...)


గడ్డు కాలమే..!

- మందకోడిగా ఆర్థిక వ్యవస్థ
- నాలుగేళ్ల కనిష్టానికి జిడిపి
- 6.4 శాతం లోపే ఉంటుందని అంచనా
- ఎకనామిక్ సర్వేలో మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ మందకోడిగా ఉందని ఆర్థిక సర్వేలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం పార్లమెంట్‌లో ఎకనామిక్ సర్వే 2024-25ను ఆమె ప్రవేశపెట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కీలకమైన ఈ నివేదికలో వృద్ధి రేటు మందకొడిగా ఉందని పేర్కొనడం విశేషం. ప్రైవేటు వినిమయంలో కూడా పెరుగుదల కనిపించడం లేదని, స్థిరంగా ఉంటోందని తెలిపారు. దీంతో ప్రజల కొనుగోలు శక్తి కూడా ఏమాత్రం పెరగడం లేదన్న విషయం అర్థమవుతోంది. తయారీ రంగం క్షీణించడం కూడా దీనికో నిదర్శనం. ఆర్థిక సర్వేలో పేర్కొన్న వివరాల ప్రకారం గతేడాది తయారీ రంగంలో పురోగతి లేకపోగా అంతకుముందు సంవత్సరంలో పోలిస్తే మందగించింది. దీనికి తోడు కార్పొరేట్ పెట్టుబడులు తగ్గాయి. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి రేటు 6.4 శాతానికి పరిమితం కానుందని నివేదికలో పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో ఇదే అత్యల్పం. 2023-24లో 8.2 శాతం, 2022-23లో 7.2 శాతం, 2021-22లో 8.7 శాతం చొప్పున వృద్ధి చోటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. వచ్చే 2025-26లో జిడిపి 6.3-6.8 శాతంగా ఉండొచ్చని అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో వృద్ధి రేటు ఏకంగా 5.4 శాతానికి క్షీణించి.. దాదాపు రెండేళ్ల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇది ఆర్‌బిఐ అంచనా వేసిన 7 శాతం కంటే తక్కువ.

అభివృద్ధి చెందుతున్నామంటూనే...

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ నిలువనుందని మోడీ సర్కార్ పదేపదే ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం వచ్చే



రెండు దశాబ్దాల పాటు భారత్ స్థిరంగా 8 శాతం వద్ధి రేటును నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే తెలిపింది. తాజా జిడిపి అంచనాలతో ఆలక్ష్యం అందుకోవడం ప్రశ్నార్థకంగా మారింది.

ఆహార ధాన్యాల ధరలు తగ్గడం కష్టమే

ఆర్థిక సర్వేలో పేర్కొన్న అంచనాల ప్రకారం ఆహార ధాన్యాల ధరలు తగ్గుముఖం పట్టడం దాదాపు అసాధ్యమే! రబీ పంట దిగుబడి బాగుంటే 2026 ప్రథమార్ధంలో ఆహార ధరలు తగ్గే అవకాశం ఉందని నివేదికలో తెలిపారు. దీనర్థం ఈ ఏడాదంతో అధిక ధరలు కొనసాగుతాయనే! ఈ మాట చెబుతూనే ప్రస్తుత జనవరి-మార్చి త్రైమాసికంలో అహార ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉందని పేర్కొనడం విశేషం.

స్టాక్ మార్కెట్లు మరింత పతనం

'పారిశ్రామిక రంగం కూడా కరోనాకు ముందున్న స్థాయిలో రాణిస్తోంది. సేవల రంగం బలంగా ఉంది. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తోంది. రిటైల్ ద్రవ్యోల్బణం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 5.4 శాతం నుంచి 2024-25 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో 4.9 శాతానికి తగ్గింది. బ్యాంకింగ్, బీమా రంగం స్థిరంగా ఉంది. బ్యాంకింగ్‌లో 2024 సెప్టెంబర్ నాటికి స్థూల నిరర్ధక ఆస్తులు 2.6 శాతానికి తగ్గాయి. 2023-24లో బీమా ప్రీమియంలు 7.7 శాతం పెరిగి రూ.11.2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వాహన, గృహ, వ్యక్తిగత రుణాల విభాగంలో మందగమనం చోటు చేసుకుంది. భౌగోళిక, రాజకీయ అస్థిరతల వల్ల డాలర్ బలపడడంతో రూపాయి మారక విలువ పడిపోయింది. 2025లో స్టాక్ మార్కెట్‌లు కొంత పడిపోయే అవకాశం ఉంది. గ్లోబల్ ఐపిఒ లిస్టింగ్స్‌లో భారత్ వాటా 2023లో 17 శాతం నుంచి 2024 నాటికి 30 శాతానికి చేరింది. 2024 నవంబర్ వరకు మొత్తం మూలధన వ్యయంలో రక్షణ, రైల్వేలు, రోడ్డు రవాణా వాటా 75 శాతంగా ఉంది." అని ఎకనామిక్ సర్వే తెలిపింది.

సవాళ్లకు నీళ్లొదిలిన కేంద్రం

- ట్రంప్ టారిఫ్‌ల ఊసే లేదు
- లెక్కలేని రూపాయి పతనం..
- ఎఐపై విస్మరణ
- మరోవైపు పని గంటల పెంపు
- ఎకనామిక్ సర్వే వెల్లడి 7

సర్వం సిద్ధం

నెల్లూరులో నేటి నుంచి సిపిఎం 27వ రాష్ట్రమహాసభ

- ప్రారంభించనున్న ఎంఎ బేబి
- నగరానికి చేరుకున్న అగ్రనేతలు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ప్రజా ఉద్యమ కేంద్రం నెల్లూరులో సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ శనివారం నాడిక్కడ ప్రారంభం కానుంది. మూడ్రోజులపాటు జరిగే మహాసభ సభకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఎటూ చూసినా మహాసభ సందడి కనిపిస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. ప్రతినిధులు, ముఖ్యఅతిథులు నగరానికి చేరుకుంటున్నారు. రాష్ట్రంలోని ఐదు ఉద్యమ కేంద్రాల నుంచి ప్రారంభమైన పతాక జాతాలు శుక్రవారం రాత్రి నగరానికి చేరుకున్నాయి. అతిథులకు ఆతిథ్యం ఇవ్వడానికి ఆహ్వానం సంఘం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. మహాసభను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి ప్రారంభించనున్నారు. 3వ తేదీ నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరగనుంది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య వంటి మహనీయులు జన్మించిన గడ్డలో నిర్వహిస్తోన్న ఈ మహాసభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. 'ఇంటికో మనిషి... ఊరుకో బండి... నెల్లూరు తరలిరండి" అనే నినాదంతో ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతానికి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మూడ్రోజులు ప్రతినిధుల సభ నిర్వహించే మాగుంట లేవుట్‌లోని అనిల్ గార్డెన్ వద్ద ఏర్పాట్లను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పి.మధు పరిశీలించారు. ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులూ జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. భోజనం, వసతి, రవాణా, వైద్యం అన్ని విషయాలనూ దగ్గరుండి చూస్తున్నారు.



ఎరుపుమయమైన నెల్లూరు నగరంలోని హరనాథపురం

ప్రత్యేక ఆకర్షణగా వేదిక

ప్రతినిధుల సభ వేదికను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. భారీ ఎల్ఇడి స్క్రీన్లు ఆకర్షణగా ఉన్నాయి. పుచ్చపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య నిలువెత్తు ప్లెక్సీలతోపాటు, సీతారాం ఏచూరి చిత్రం స్క్రీన్‌పై ఉండేలా ఏర్పాటు చేశారు. మరోవైపు ఇఎంఎస్ నంబూద్రిపాద్, బుద్దదేవ్ భట్టాచార్య, ఫొటోలు పెట్టారు. ప్రతినిధుల సభ వద్ద కేరళ తరహా ప్రచారం నిర్వహిస్తున్నారు. స్వాగత ద్వారాల వద్ద అటు,, ఇటు జాతీయ, రాష్ట్ర నాయకుల చిత్రపటాలు ఏర్పాటు చేశారు.

12 చోట్ల వసతి ఏర్పాట్లు

రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు నగరానికి చేరుకుంటున్నారు వారికి 12 చోట్ల వసతి ఏర్పాట్లు చేశారు. రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్లో వలంటీర్లను ఏర్పాటు చేశారు. మహాసభలో ప్రతినిధులకు సేవలందించడానికి సుమారు రెండు వందల మంది వలంటీర్లను సిద్ధం చేశారు.

నెల్లూరు చేరుకున్న ఐదు జాతాలు

రాష్ట్రంలోని ఐదు కేంద్రాల నుంచి ప్రారంభమైన పతాక జాతాలు శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నాయి. వాటికి ఆహ్వాన సంఘం స్వాగతం పలికింది. 30 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా సిపిఎం నేతలు , కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. నెల్లూరు చేరుకున్న సిపిఎం రాష్ట్ర నాయకత్వం, ప్రతినిధులకు ఆహ్వాన సంఘం ఘన స్వాగతం పలికింది.

(మరిన్ని వార్తలు 3లో...)

అనిశ్చితి ఉన్నా ఆర్థిక సుస్థిరత

- ఉభయ సభలనుద్దేశించి చేసిన ప్రసంగంలో రాష్ట్రపతి
- మధ్య తరగతిని ఉద్ధరించామని ఉద్ఘాటన
- జమిలి, వక్ఫ్ బిల్లుకు వత్తాసు
- నేడు కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అనిశ్చితి ఉన్నా ఆర్థిక సుస్థిరత సాధించామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 'విధాన పరమైన పక్షవాత' స్థితి నుండి ఆర్థిక వ్యవస్థను బయటకు తీసుకురావడానికి ప్రభుత్వం దృఢ సంకల్పంతో కృషి చేసిందని ముక్తాయించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా ఆనవాయితీ ప్రకారం పార్లమెంటు సెంట్రల్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉభయ సభల సంయుక్త సమావేశాన్నుద్దేశించి అమె ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని కేంద్ర మంత్రివర్గం రూపొందిందిస్తుంది. దానినే రాష్ట్రపతి పొల్లు పోకుండా చదివి



పార్లమెంటు సెంట్రల్ హాలులోఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వినిపిస్తారు. ద్రౌవపది ముర్ము కూడా అదే పనిచేశారు. కోవిడ్, యుద్ధాలు, ఘర్షణలు ఇలా పలు రకాలైన అనిశ్చిత పరిస్థితులను అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం గుర్తించదగిన సుస్థిరతను ప్రదర్శిస్తూ తన బలాన్ని నిరూపించుకుందని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సుస్థిరతకు మూలస్తంభంగా నిలిచిన భారత్ యావత్ ప్రపంచానికి ఒక ఉదాహరణగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రధానంగా మధ్య తరగతి వర్గాల గురించి పదే పదే ప్రస్తావించారు. . మధ్య తరగతి ప్రజలు ఎంత పెద్ద కలలు కంటే దేశం అంత ఎత్తుకు ఎదుగుతుందని వ్యాఖ్యానించారు.

జమిలి ఎన్నికలు (ఒకే దేశం, ఒకే ఎన్నిక), వక్ఫ్ సవరణ బిల్లును సాహసోపేత నిర్ణయాలుగా ఆమె అభివర్ణించారు. ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒక దేశం, ఒక ఎన్నికకు తమ ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. 'బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ఏకరువు పెట్టారు. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించామన్నారు. ఒక దేశం, ఒక ఎన్నిక గురించి పాత పాటే పాడారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని చెప్పారు. .

చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నామని,భారతీయులు అంతరిక్షంలో అడుగుపెట్టే రోజు దగ్గర్లోనే ఉందన్నారు.. విద్యా రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. దేశాన్ని గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్ హౌస్‌గా మారుస్తామని పేర్కొన్నారు. ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించామని, నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రారంభించామని చెప్పారు. ఈ-గవర్నెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నామని, పౌర విమానయాన రంగం అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

పోలవరం గురించి ప్రస్తావన

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని, పోలవరం నిర్మాణానికి రూ.12 వేల కోట్లు కేటాయించామని ముర్ము గుర్తుచేశారు. సైబర్ సెక్యూరిటీలో సమర్థత పెంచుతున్నామని, దేశ ఆర్థిక, సామాజిక, జాతీయ భద్రతకు పనిచేస్తున్నామని తెలిపారు. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్ ఫేక్ పెనుముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు, వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని, ఆదివాసీ ప్రాంతాల్లో 30 వైద్య కళాశాలలు ప్రారంభించామని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

కొత్త దనం లేని ప్రసంగం!

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం మిగతా 7లో



పొలిట్‌బ్యూరో సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జూన్‌లోపు మరో 3 పథకాలు


- తల్లికి వందనం, రైతులకు సుఖీభవ, మత్స్యకారులకు రూ.20 వేలు
- నియోజకవర్గ స్థాయిలోనూ గ్రీవెన్స్
- రాష్ట్ర కార్యాలయంలో శనివారం మాత్రమే నిర్వహణ
- కడపలో మహానాడు
- టిడిపి పొలిట్‌బ్యూరో నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో మరో మూడింటిని జూన్‌లోగా అమలు చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో నిర్ణయం తీసుకుంది. తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సహాయం, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని అందించాలని తీర్మానించింది. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు అధ్యక్షతన ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం టిడిపి కార్యాలయంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సమావేశ నిర్ణయాలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌తో కలిసి మంత్రి కె అచ్చెన్నాయుడు విలేకరులకు వివరించారు. పాఠశాలలు తెరిచే నాటికి తల్లుల మిగతా 7లో

యువతను కదిలిస్తాం..

- పోరాట స్ఫూర్తిని రగిలిస్తాం
- రాష్ట్రానికి దిక్సూచిగా మహాసభ
- మేం ప్రజా పక్షం... ప్రజల కోసమే పనిచేస్తున్నాం
- సుందరయ్య స్ఫూర్తి అందరిలో ఉంది
- ప్రజాశక్తి' ఇంటర్వ్యూలో వి శ్రీనివాసరావు



'నూతన ఆర్థిక విధానాలు, విద్యా విధానాల ప్రభావం యువతపై పడుతోంది. పెరగుతున్న నిరుద్యోగం, ఉపాధి రహిత పరిస్థితుల్లో వారు పెడ దవోవ పట్టకుండా చూడాలి. యువతలో పోరాట స్ఫూర్తిని రగిలిస్తాం. వారిని కదిలించి అభ్యుదయం వైపు నడిపిస్తాం. ' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం 27వ రాష్ట్ర మహా సభ సందర్భంగా ప్రజాశక్తి ప్రతినిధి పి.బాలకృష్ణకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో 'దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య సొంత గడ్డ సింహపురి. ఉద్యమ వేగుచుక్క జక్కా వెంకయ్య ప్రజాపోరాటం నడిపిన ప్రాంతమిది. ఆ ఉద్యమ శిఖరాలు లేకపోయినా ప్రతి నాయకుడు, కార్యకర్తల్లో వారు నింపిన ఉద్యమ స్ఫూర్తి అలాగే ఉంది.' అని అన్నారు. మహాసభకు ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోందని చెప్పారు.'ఈ మహాసభ రాష్ట్ర ప్రజల జీవన విధానం మార్చడానికి, పోరాట స్ఫూర్తిని రగలించడానికి వేదిక కానుంది' అని అన్నారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా :

ప్ర: నెల్లూరు కమ్యూనిస్టు ఉద్యమానికి గొప్ప చరిత్ర ఉంది. జక్కా వెంకయ్య లేకుండా జరుగుతున్న పెద్ద కార్యక్రమం ఇది. మహాసభ ఎలా జరుగనుంది.

జ : నెల్లూరు ఉద్యమంలో పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్యల త్యాగాల పోరాట చరిత్ర అందరికీ తెలిసిందే. వారు మా నాయకులు. సిపిఎంను బలమైన శక్తిగా మార్చడానికి వారితో పాటు అనేకమంది త్యాగాలు చేశారు. వారు ఇప్పుడు లేకపోవచ్చు. కానీ, కార్యకర్తల్లో వారు నింపిన స్ఫూర్తి అలాగే ఉంది. ఇప్పుడు అది మరింత బలంగా పనిచేస్తోంది. నెల్లూరు ప్రజలు ఎప్పుడు సిపిఎంకు అండగా ఉంటారు. ఈ మహాసభ ఘనం జరుగుతుంది.

ప్ర: మీరు ఏదో ఒక పార్టీ వైపు ఉంటారని టిడిపి, వైసిపిలు ప్రచారం చేస్తుంటాయి. మీరు ఎవరి పక్షం?

జ : మేం ప్రజాపక్షం. అధికార పార్టీల విధానాలను ఎప్పటికప్పుడు ఎండుగడుతున్నాం. ఈ రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేస్తున్నది ఒక్క సిపిఎం మాత్రమే. దీనికోసం మాకు ఎవరి సర్టిఫికెట్లూ అవసరం లేదు. ఆ రోజు వైసిపి, నేడు టిడిపి విధానాలను మా పార్టీ మాత్రమే వ్యతిరేకిస్తోంది. ఒక్కసారి పోలీస్ స్టేషన్‌ల్లో కేసులు పరిశీలిస్తే ఈ విషయం అర్థం అవుతుంది. బిజెపికి అంటకాగుతోన్న ఆ రెండు పార్టీలూ మాపై బురద చల్లుతున్నాయి. అప్పుడూ, ఇప్పుడూ పోరాటాలు చేసింది కమ్యూనిస్టులు మాత్రమే.

ప్ర: నెల్లూరులో జరుగుతోన్న మహాసభ ప్రత్యేకత ఏమిటి? ఏం చర్చించబోతున్నారు?

జ: గత మహాసభ గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిర్వహించాం. అప్పటి వరకు అమరావతి రాజధాని భ్రమలో పెట్టారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి కాదని చెప్పారు. మా సభలో అమరావతిలోనే రాజధాని ఉండాలని తీర్మానించాం. రైతుల పోరాటానికి మా పార్టీ మద్దతు ఇచ్చింది. నేడు అధికారంలోకి వచ్చిన టిడిపి... బిజెపిని భుజానికి ఎత్తుకొని ప్రజలను మోసం చేస్తోంది. కార్మికుల, కర్షకుల, ఉద్యోగుల, ప్రజ జీవన విధానాన్ని దెబ్బతీస్తోంది. ఇలాంటి సమయంలో నెల్లూరులో జరుగుతోన్న మహాసభ పట్ల అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుండి 500 మంది ప్రతినిధులు వస్తున్నారు. వీరు మూడు రోజుల పాటు చర్చిస్తారు. భవిష్యత్తు ఉద్యమాలకు రూపకల్పన చేస్తారు. 1978లో పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో నెల్లూరులో రాష్ట్ర మహాసభ జరిగింది. 47 సంవత్సరాల తర్వాత నెల్లూరు మళ్లీ ఆతిథ్యమిస్తోంది.

ప్ర: కమ్యూనిజం ఉనికి కోల్పోతోంది. ఎక్కడుంది అనే వారికి ఏం చెబుతారు?

జ: సోవియట్ యూనియన్ పతనం అనంతరం కమ్యూనిస్టుల పని అయిపోయిందని సంబరపడ్డారు. అది ఒక మేనియాగా మారింది. కమ్యూనిస్టు ఉద్యమంలో హెచ్చుతగ్గులు ఎప్పుడూ సహజమే. 1968-73లో బెంగాల్‌లో కమ్యూనిజం అడుగంటిపోయిందంటూ తీవ్రమైన భీభత్సం చేశారు. వెయ్యి మందిని చంపేశారు. 1978లో ఎన్నికలు పెడితే ఊహించని విజయం కమ్యూనిస్టులు సొంతం చేసుకున్నారు. కేరళలో 300 మందిని చంపారు. ఎమర్జెన్సీ తర్వాత సిపిఎం విశిష్టత ప్రజలకు అర్థమైంది. కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారు. సిపిఎం దేశంలో బలమైన రాజకీయ పార్టీగా అవతరించింది. రాబోయే కాలంలో మంచి రోజులు వస్తాయి. 35 సంవత్సరాల క్రితం సోవియట్ పతనం తర్వాత అమెరికా కమ్యూనిస్టులను భూస్థాపితం చేశామంది. ఇప్పుడు అదే అమెరికా కమ్యూనిస్టులే ప్రధాన శత్రువు అని చెబుతోంది. ప్రపంచ వ్యాప్తంగా సోషలిజం గురించి నేడు చర్చ సాగుతోంది. ఇది మంచి పరిణామం .

ప్ర: ఒకప్పుడు యువత రాజకీయాల్లో కీలకంగా ఉండేవారు. ప్రస్తుత పరిస్థితి ఏమిటి?

జ: కమ్యూనిస్టు పార్టీలో 20 శాతం యువత ఉంది. ఇటీవల కేరళ, బెంగాల్‌లో, మన రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సిపిఎం పాదయాత్రల్లో యువత ముందునడిచింది. నూతన ఆర్థిక విధానాలు, విద్యా విధానంలో వచ్చిన మార్పుల ప్రభావం యువతపై ఉంది. విద్యార్థులలో సామాజిక స్పృహ కొరవడుతోంది. వ్యక్తిగత అంశాలకు కొంతకాలం యువత అలవాటు పడిన మాట వాస్తవమే. ఇటీవల కాలంలో పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. యువత ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తోంది. తప్పకుండా యువత రాజకీయాల్లో రావాల్సి ఉంది. వస్తారనే నమ్మకం ఉంది.

ప్ర : చంద్రబాబు నాయుడు విజన్ 2047 గురించి పెద్ద చర్చ సాగుతోంది. దీనిపై మీరేమంటారు?

జ : విజన్ 2047 కొత్తదేమీ కాదు. విజన్ 2020 పేరుతో 1998లోనే ప్రపంచ బ్యాంక్ మిగతా 3లో



సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు జిఓ

- ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మునిసిపల్ కార్మికుల 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాల అమలుకు జీఓలు జారీ చేయాలని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఅండ్ డిఎంఎ పి.సంపత్ కుమార్‌ను వడ్డేశ్వరంలోని డైరక్టరేట్‌లో ఫెడరేషన్ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మునిసిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు జీఓఎంఎస్ నెంబరు 36 తేదీ 01.03.2024 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్ట్ -1970 ప్రకారం శాశ్వత స్వభావం కలిగి ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న మునిసిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. వాహనాల మరమ్మతుల భారాన్ని కార్మికులపై నెట్టవేసే ధోరణి మారాలని, డిపార్టుమెంట్ ద్వారా వాహనాల మరమ్మతుల చేయించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు అదనపు పనులు కేటాయించిన సమయాల్లో తప్పనిసరిగా టిఎ, డిఎలు చెల్లించాలన్నారు. సిటీ బస్ సర్వీసులు ఉన్న ప్రతి పట్టణంలో పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ కార్మికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి బి.ముత్యాలరావు, కోశాధికారి ఎస్ జ్యోతిబసుల నేతృత్వంలోని ప్రతినిధుల బృందం వినతి పత్రం అందజేశారు.

సిఐడి మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్ పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఐడి మాజీ చీఫ్ ఎన్ సంజయ్ (1996 బ్యాచ్) సస్పెన్షన్‌ను ప్రభుత్వం పొడిగించింది. ఈ సస్పెన్షన్‌ను 31.05.2025 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏది ముందైతే దానిని పరిగణనలోకి తీసుకోవాలని రివ్యూ కమిటీ పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయనపై పలు అభియోగాలు రావడంతో 2024 డిసెంబరు 3న ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆల్ ఇండియా సర్వీసెస్ (ఐపిఎస్) ఆల్ ఇండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ ఉల్లంఘన-1968, ఆల్ ఇండియా సర్వీసెస్ (క్రమశిక్షణ అప్పీల్) రూల్స్ 1969 సస్పెన్షన్ రూల్ 3(1) కింద సంజయ్‌ను ఇప్పటికే ప్రభుత్వం సస్పెన్షన్‌లో ఉంచింది. సస్పెన్షన్‌పై ఐపిఎస్‌ల కేసుల సమీక్ష కోసం ప్రభుత్వం రివ్యూ కమిటీని నియమించింది. కమిటీ సూచనల మేరకు తాజాగా ఆయన సస్పెన్షన్‌ను పొడిగించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

బ్యాంక్ రుణాల్లో వర్గీకరణ అవసరం: చింతా మోహన్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

బ్యాంక్ రుణాల్లో వర్గీకరణ అవసరమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ చెప్పారు. గుంటూరులోని ఒక హోటల్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగాల కోసం ఎస్‌సి వర్గీకరణ కాకుండా దళితులు, బిసిలు, ఆదివాసీలు వ్యాపారాల్లో రాణించేందుకు బ్యాంకులు సహకరించడం లేదన్నారు. అగ్ర కులాలకు చెందిన వారికి రుణాలు ఇస్తున్నారని, చెల్లించక పోయినా మాఫీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు జడ్జీల పోస్టుల్లో వర్గీకరణ కావాలన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వర్గీకరణ, సామాజిక న్యాయం జరగాలని కోరారు. 33 మంది సుప్రీంకోర్టు జడ్జీలుంటే, ఒకే సామాజిక తరగతి వారు 20 మంది సుప్రీంకోర్టు జడ్జీలుగా ఉన్నారన్నారు. అమరావతి కోర్టులో ఎంత మంది ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి జడ్జీలున్నారని ప్రశ్నించారు. సిఆర్‌డిఎ కాంట్రాక్ట్ పనుల్లో ఎంతమందికి ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు ఇచ్చారు? ఇక్కడ వర్గీకరణ కావాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు దళిత విభజనే కారణం అన్నారు. దళిత విభజన జోలికిపోతే చంద్రబాబు నష్టపోతారని, లోకేష్ కంటున్న కలలు కలలుగానే మిగులుతాయని పేర్కొన్నారు.

చట్టసభల్లోనూ బిసిల రిజర్వేషన్‌కు కృషి

బిసిల సమావేశంలో సిఎం చంద్రబాబు
వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు, పట్టువస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పెనుగొండ, ఆచంట

బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడంతో రాజకీయంగా పైకి తీసుకొచ్చిన ఘనత టిడిపిదేనని, కేంద్రంతో పోరాడి బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు తీసుకొచ్చేలా భవిష్యత్తులో పోరాడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో మండల కేంద్రమైన పెనుగొండలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సిఎం చంద్రబాబు అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన బిసిలైన శెట్టిబలిజ, గౌడ, ఇతర ఉపకులాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. వారి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అంటేనే బిసిల పార్టీ అని, వార్కి పదవులు ఇచ్చిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో బిసిలకు మరిన్ని పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 2047 విజన్‌తో ముందుకు వెళ్తున్నామని, రానున్న కాలంలో గీత కులాలకు స్వర్ణ భవిష్యత్తు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా గురుపీఠం నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేశారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనలో ఆర్య వైశ్యులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. సిఎం వెంట మంత్రులు నిమ్మల రామానాయుడు, టిజి భరత్, పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు ఉన్నారు.


వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సిఎం చంద్రబాబు

కలెక్టర్ల సదస్సు వాయిదా ?

- ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల నేపథ్యంలో ఈ నెలలో జరగాల్సిఉన్న కలెక్టర్ల సదస్సు వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ ఉండటంతో వివిధ పథకాలపై పూర్తిస్థాయిలో చర్చించి, ఆదేశాలు జారీ చేయడం సాధ్యం కాదన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. అటువంటి ఆదేశాలు జారీ చేస్తే అది ఎన్నికల కోడ్ ఉల్లంఘనగా భావించే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో కలెక్టర్ల సదస్సును వాయిదా వేసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ సమాచారాన్ని కలెక్టర్లకు కూడా చెప్పినట్లు ప్రణాళిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. అయితే ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి అనుమతి కోరాలన్న ఆలోచన కూడా ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ మార్చి ఎనిమిదో తేదీ వరకు ఉంటుంది. ఈ మధ్య కాలంలోనే శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. అందుకే కలెక్టర్ల సదస్సు ఏప్రిల్ తరువాతే నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎక్కువకాలం శాసనసభ సమావేశాలు

శాసనసభ సమావేశాల నిర్వహణను ఈసారి ఎక్కువ కాలం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు యోచిస్తున్నారు. ఫిబ్రవరి మూడు లేదా నాలుగో వారంలో సమావేశాలు ప్రారంభించి కనీసం 20 నుంచి 25 పని దినాల్లో చర్చలు ఉండేలా చూడాలని భావిస్తున్నారు. ప్రధానంగా ఈసారి సభలో ప్రతిపక్ష సభ్యులు అతి తక్కువగా ఉండడం, వారు కూడా శాసనసభకు వచ్చే అవకాశాలు లేకపోవడంతో మొత్తం సమావేశాలు టిడిపి కూటమి సభ్యులతోనే నిర్వహించనున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగే తొలి బడ్జెట్ సమావేశాలు కావడంతో ప్రతి ఒక్క సభ్యునికీ సభలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. తద్వారా వారివారి నియోజకవర్గాల్లో ఎలా మసలుకోవాలి, అభివృద్ధి కార్యక్రమాలను ఎలా ప్రజల్లోకి తీసుకువెళ్లలన్నదానిపైనా వారిలో అవగాహన పెంచినట్లు అవుతుందని సీనియర్ మంత్రి ఒకరు పేర్కొన్నారు.

బడ్జెట్‌లో 'వెలిగొండ'కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

- అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

వెలిగొండ ప్రాజెక్టు పనుల కోసం, ముంపు గ్రామాల్లోని నిర్వాసితులను మెరుగైన ప్యాకేజీతో ఆదుకునేందుకు వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రకాశం జిల్లా మార్కాపురంలోని పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ కమిటీ కో-ఆర్డినేటర్ డికెఎం రఫీ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి సోమయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సయ్యద్ జావీద్ అన్వర్ తదితరులు మాట్లాడారు. పశ్చిమ ప్రకాశం గత ఏడు దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతూనే ఉందని తెలిపారు. పెద్దఎత్తున జరిగిన పోరాటాల ఫలితంగా నాటి పాలకులు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. 28 సంవత్సరాలు దాటినా నేటికీ ప్రాజెక్టు పూర్తికాకపోవడం దారుణమని తెలిపారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు మాత్రమే వెలిగొండ ప్రాజెక్టును టిడిపి, వైసిపిలు ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేసి, కృష్ణా జలాలు పారిస్తే 4 లక్షల 38 వేల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీటి అవసరాలు తీరుతాయని తెలిపారు. ముంపు గ్రామాల బాధితులకు నేటికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. నిర్వాసితులకు వెంటనే మెరుగైన ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపిజె రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎ రజాక్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి షేక్ ఖాశిం తదితరులు పాల్గొని మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సోమయ్య

బిజెపితో ప్రజాస్వామ్యం ఖూనీ

- మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్త రాజకీయ ప్రచార ఉద్యమం
- విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం
- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా



మీడియాతో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతోన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, దీనికోసం వామపక్ష, లౌకిక పార్టీలతో కలిసి పని చేస్తామని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. విశాఖలో రెండు రోజులపాటు జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాల అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి ప్రజావ్యతిరేక పాలనపై భగత్‌సింగ్ వర్ధంతి అయిన మార్చి 23 నుంచి అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రచార ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా జాతాలు, ప్రదర్శనలు, సభలు, సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. దేశంలో ప్రజల మధ్య ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలంటే కేంద్రంలో బిజెపిని అధికారం నుంచి గద్దె దించాలన్నారు. దేశంలో ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, విదేశీ అప్పు 700 బిలియన్ డాలర్లకు చేరుకుందని, రూపాయి విలువ భారీగా పడిపోతోందని తెలిపారు. నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. బిజెపి చెప్తున్న వికసిత భారత్ ఎక్కడా కనిపించడం లేదని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ల సేవలో మునిగితేలుతోందని, కార్పొరేట్ల రుణాలను మాఫీ చేస్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. బిజెపి పాలనలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి పెనుముప్పు పొంచి ఉందని, దేశ ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణకు సిపిఐ పూర్తిగా వ్యతిరేకమని, కార్యవర్గ సమావేశాల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసినట్టు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదన్నారు. సొంత గనులు ఇస్తామని చెప్పలేదని, స్టీల్‌ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించలేదని తెలిపారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్రపతి ప్రసంగంలో కుంభమేళా ప్రమాదాలపై ప్రస్తావన లేదన్నారు. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రథసప్తమి వేడుకలు

- టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



ప్రజాశక్తి -తిరుమల

తిరుపతిలో జనవరి 8న జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకొని రథసప్తమికి ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమలలో శుక్రవారం టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. అనంతరం ఆయన, ఇఒ శ్యామలరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. రథసప్తమి రోజు స్వామివారి ఏడు వాహనాలపై ఊరేగిస్తారని తెలిపారు. రెండు నుంచి మూడు లక్షల మంది యాత్రికులు ఆరోజు తిరుమలకు వస్తారనే అంచనా ఉందన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని రథసప్తమి నాడు అన్ని ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు లేఖలపై విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నామని ప్రకటించారు. ఫిబ్రవరి 3 నుండి 5వ తేదీ వరకు తిరుపతిలో ఎస్ఎస్‌డి టోకెన్ల జారీ నిలిపివేస్తున్నామన్నారు. యాత్రికుల మధ్య తోపులాటకు తావులేకుండా ఆక్టోపస్, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎపిఎస్‌పి, అగ్నిమాపక దళాలు పనిచేస్తాయని తెలిపారు. వాహన సేవలను తిలకించేందుకు గ్యాలరీల్లో వేచి ఉండే యాత్రికులకు నిర్విరామంగా అన్నపానీయాలు పంపిణీ చేస్తామన్నారు. పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణలతో తిరుమల ముస్తాబు అవుతోందన్నారు. ఎనిమిది లక్షల లడ్డూలు నిల్వ చేసి ఉంచామన్నారు. ఫిబ్రవరి 26 వరకూ ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న మహాకుంభమేళాలో టిటిడి తరపున శ్రీవారి నమూనా ఆలయంలో యాత్రికులకు విశేష సేవలు అందిస్తున్న టిటిడి అర్చకులు, అధికారులు, సిబ్బందికి బిఆర్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, ఎమ్మెస్ రాజు, భాను ప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మి, ఆనంద్ సాయి, శాంతారామ్, నన్నపనేని సదాశివరావు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ మణికంఠ చందోలు, సిఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ కోటి విరాళం

టిటిడి ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్ట్‌కు చెన్నయ్‌కి చెందిన సంసార్ క్యాపిటల్ కంపెనీ ఎండి అండ్ సిఇఒ వెంకటేష్ కన్నపన్ రూ. కోటి విరాళాన్ని శుక్రవారం ఇచ్చారు. ఈ మేరకు డొనేషన్ డిడిని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి దాత అందజేశారు.

'వర్రా'పై కేసు కేసు నమోదు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ (కడప జిల్లా)

వైసిపి సోషియల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిపై మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీత పెట్టిన కేసు తెలంగాణ నుంచి కడప జిల్లా పులివెందులకు బదిలీ అయిందని పట్టణ సిఐ నరసింహులు తెలిపారు. కడప జిల్లా పట్టణ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతేడాది జనవరి 29న సునీత ఇడుపులపాయకు వచ్చిన సందర్భంగా ఆమెపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులను రవీంద్రారెడ్డి పెట్టారని తెలిపారు. దీనిపై గత ఏడాది ఫిబ్రవరి 2న హైదరాబాద్ సైబర్ పోలీసుస్టేషన్‌లో సునీత ఫిర్యాదు చేశారని, వారు విచారించి ఈ కేసును పులివెందులకు బదిలీ చేశారని వివరించారు. శుక్రవారం కేసు నమోదు చేశామన్నారు. వివిధ కేసుల్లో ప్రస్తుతం వర్రా రవీంద్రారెడ్డి నిందితుడిగా కడప సెంట్రల్ జైల్‌లో రిమాండు ఖైదీగా ఉన్నారని తెలిపారు. వర్రా రవీంద్రారెడ్డి కేసులో పోలీసులు సివి రెడ్డి, మాజీ ఎపి డిజిటల్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డిలను కడప డిటిసిలో విచారించి వారి నుంచి కీలక సమాచారాన్ని సేకరించినట్లు పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. వారిద్దరూ ఇచ్చిన సమాచారాన్ని రికార్డు చేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో కీలక వ్యక్తులను విచారించి త్వరలో ఈ కేసు విచారణ పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కేసును వేగవంతం చేసేందుకు బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందంలో అడిషనల్ ఎస్‌పి ప్రకాష్ బాబు, పులివెందుల డిఎస్‌పి మురళి, జమ్మలమడుగు సిఐ లింగప్ప, పొద్దుటూరు వన్ టౌన్ సిఐ రామకృష్ణారెడ్డి, పోరుమామిళ్ల సిఐ శ్రీనివాసులు, కడప తాలూకా సిఐ వెంకటేశ్వర్లు ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు ఈ కేసులో 41 ఎ నోటీసులు 28 మందికి ఇచ్చామన్నారు. 78 మందికిగాను 48 మందిని విచారించామని, పది మందికి పిటి వారెంట్ ఇచ్చామని, ముగ్గురిని అరెస్టు చేశామని తెలిపారు. బృందం సహాయ సహకారంతో విచారణ పూర్తి చేసి ఈ కేసులో సంబంధం ఉన్న వ్యక్తులను అరెస్టు చేస్తామని వెల్లడించారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం : ఐఎన్‌టియుసి



ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రమాదం నుంచి కాపాడాలని ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి ఎం రాజశేఖర్ కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1450వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో పలు కార్మిక సంఘాల నేతలు కూర్చున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు కేంద్ర ఉక్కు మంత్రి కుమార్‌స్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ రాకను కార్మిక సంఘాలుగా స్వాగతించినట్లు తెలిపారు. మంత్రులు చెప్పిన మాట ప్రకారం కార్మికులు కష్టించి పని చేసి ఆగస్టులో మూడవ బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించుకుంటామని చెప్పారు. మంత్రులు చెప్పిన మాట ప్రకారం విశాఖ ఉక్కుకు అన్ని విధాలా సహకరించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని కోరారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, అయోధ్యరామ్, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

నిరాశ మిగిల్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి పర్యటన : సిపిఎం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, కేంద్ర ఉక్కుశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రీ విశాఖ ఉక్కు పర్యటన కార్మికులకు, విశాఖ ప్రజలకు నిరాశను మిగిల్చిందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకటరావు, యు.రాజులతో కలిసి పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ నిర్ణయం రద్దు అస్పష్టంగానే ఉందని, స్టీల్‌ప్లాంట్ నష్టాలకు ప్రభుత్వ లోపాలను అంగీకరిస్తూనే, ఇటీవల కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీతోనే స్టీల్‌ప్లాంట్ సమస్యను పరిష్కరించినట్లుగా మంత్రి ప్రకటన ఉందని చెప్పారు. ప్లాంట్‌ను లాభాల బాట పట్టించే బాధ్యత స్టీల్ యాజమాన్యం, కార్మికులపై పెట్టారన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా ప్లాంట్ ఎలా లాభాల బాట పడుతుందని ప్రశ్నించారు. గత నాలుగు నెలలుగా సగం జీతాలతో కష్టపడి ఉత్పత్తి చేస్తున్న విశాఖ ఉక్కు కార్మికులను మంత్రి అభినందిస్తూనే పూర్తిస్థాయి జీతాలు పొందేందుకు మరో 3 నెలలు వేచి చూడాలని ప్రకటించడం ఆందోళనకరమని అన్నారు. విశాఖ ఉక్కును విలీనం చేసుకునేందుకు సెయిల్ అంగీకరించడంలేదని కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి శ్రీనివాసవర్మ ప్రకటించడం ప్రజలను వంచించడమేనని విమర్శించారు. విశాఖ ఉక్కును పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపిస్తామని ప్రకటించి, రెండోవైపున ఉత్పత్తి కారకులైన ఆఫీసర్లు, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను పెద్దఎత్తున తొలగింపునకు పూనుకుంటోందని తెలిపారు. కార్మికులను భారీగా తగ్గించి పూర్తి ఉత్పత్తి ఎలా సాధించగలదని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణ పనులు మూడు నెలల్లో ప్రారంభించేందుకు, గనులు కేటాయింపునకు తహతహలాడుతున్నారన్నారు. విశాఖ ఉక్కుకు గనుల కోసం, సెయిల్‌లో విలీనం కోసం ఎందుకు కేంద్రాన్ని అడగటంలేదని నిలదీశారు. యువగళం పాదయాత్రలో విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయించాలని డిమాండ్ చేసిన నారా లోకేష్ మంత్రి అయ్యాక సొంతగనులు అంశం అర్థంలేదని ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు స్ట్రాటజిక్ సేల్ నిర్ణయం రద్దు, సెయిల్‌లో విలీనం, సొంత గనులు కేటాయిస్తూ ప్రకటన చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పన, కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించేలా రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు కేంద్రంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.


ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

- ఎస్‌జిటి పోస్టులను పెంచాలి : డివైఎఫ్ఐ
- డిఇఒ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకం చేసిన మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణమే జారీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయాన్ని నిరుద్యోగులు శుక్రవారం ముట్టడించారు. కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులతో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌పై స్పష్టత ఇవ్వాలన్నారు. ఏడేళ్ల నుంచి నిరుద్యోగులు డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అభ్యర్థులు ఇప్పటికే కోచింగ్, పుస్తకాలు, రూం అద్దెల పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అప్పులు పాలయ్యారన్నారు. విలువైన సమయాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎస్‌సి షెడ్యూల్‌పై గందరగోళం నెలకొందని దీనిపై విద్యా శాఖ మంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ మాట్లాడుతూ పోస్టుల విషయంలో అనంతపురం జిల్లాకు అన్యాయం జరిగితే సహించేదిలేదని, నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటమాడితే చూస్తూ ఊరుకునేదిలేదని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు నూరుల్లా, సురేంద్ర, చరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మొదటి సంతకం ఏమైందని ప్రశ్నించారు. 117 జిఒను రద్దు చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడాలని కోరారు. డిఎస్‌సి అభ్యర్థులు షేక్ ముజేబ్, రమేష్, లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయనందున ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం కేవలం నిరుద్యోగుల దయాదాక్షిణ్యాలతో వచ్చిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఇఒ ప్రసాద్ బాబుకు అందజేశారు

డాక్టర్ ప్రభావతికి స్వల్ప ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కేసులో డాక్టర్ నీలిమా ప్రభావతికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. రఘురామ కస్టడీ టార్చర్‌లో ఎటువంటి గాయాలు లేవని రిపోర్టు ఇచ్చిన డాక్టర్ ప్రభావతికి హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. డాక్టర్ నీలిమా ప్రభావతి ఉద్దేశపూర్వకంగానే రఘురామ కస్టడీ టార్చర్‌లో ఆయనపై ఎటువంటి గాయాలు లేవని రిపోర్టు ఇచ్చారని అన్నారు. అయితే ఆర్మీ హాస్పిటల్ వైద్యులు గాయాలున్నాయని రిపోర్టు ఇచ్చారని తెలిపారు. పిటిషనర్ డాక్టర్ ప్రభావతి తరపున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపించారు. ప్రభావతి ఉద్దేశపూర్వకంగా రిపోర్టు ఇవ్వలేదని, ఆమెతోపాటు మరో ఇద్దరు డాక్టర్లు కూడా ఉన్నారని తెలిపారు. ముగ్గురు డాక్టర్లు కలిసి రిపోర్టు వాస్తవానికి అనుగుణంగా ఇచ్చారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ప్రభావతికి అరెస్టు నుంచి రక్షణ ఇచ్చింది. అయితే ఆమె దర్యాప్తుకు సహకరించాలని పేర్కొంది. దర్యాప్తు నివేదికను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. అలాగే మరో రెండు వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని ఆదేశించింది. పిటిషన్ విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది.



ప్రతినిధుల మహాసభ స్వాగత ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సిపిఎం అగ్రనేతల ఫొటోలు



ప్రతినిధుల మహాసభ వేదిక వద్ద ఏర్పాటు చేసిన మార్క్సిస్టు యోధుల ఫొటోలు



పార్టీ జెండాలను సిద్ధం చేస్తున్న మహిళా కార్యకర్తలు

నెల్లూరు ఉద్యమ సారథులకు నెలవు..

పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య స్ఫూర్తి

రాష్ట్ర కార్యదర్శులుగా సేవలందించిన బివి రాఘవులు, పి మధు, వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు ఉద్యమాలకు పుట్టినిల్లు.. ఇక్కడ నుంచే పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు పార్టీకి, సిపిఎంకు సారథ్యం వహించారు. పదమూడు సంవత్సరాల చిరుప్రాయంలోనే స్వాతంత్రోద్యమ భావాలతో ముందుకు నడిచారు. విడవలూరు మండలం అలగానిపాడు గ్రామంలో భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడారు. అంచలంచెలుగా దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి నిర్మాతగా మారారు. సిపిఎం తొలి జాతీయ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. ఆయన, ఆయన కుటుంబం మొత్తం పేదలకు, కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి త్యాగాలు చేశారు. తమ్ముడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి, సమీప బంధువు డాక్టర్ జెట్టి శేషారెడ్డి, జక్కా వెంకయ్యలను కమ్యూనిస్టు ఉద్యమం వైపు తీసుకొచ్చారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు కష్టజీవుల ఆప్తమిత్రుడిగా సేవ చేశారు. మూడుసార్లు గన్నవరం ఎమ్మెల్యేగా, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రాజ్యసభ సభ్యులుగా సేవలందించారు. జక్కా వెంకయ్య కమ్యూనిస్టు పార్టీకి, సిపిఎంకు అంకితభావంతో పని చేశారు. నెల్లూరు జిల్లాలో సిపిఎం ఉద్యమ నిర్మాతగా చరిత్ర పుటల్లో నిలిచిపోయారు. ప్రజా వైద్యం ఎలా ఉంటుందో ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తులు డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి, డాక్టర్ జెట్టి శేషారెడ్డి తాము ఎంచుకున్న మార్గంలో ఉన్నత శిఖరాలను అందుకున్నారు. ఇప్పటికీ ఈ పేర్లు చెబితే నెల్లూరు నేల పులకిస్తుంది. కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులకు నరనరాన చైతన్యం వెల్లువిరుస్తోంది. అలాంటి సింహపురిలో సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ ఘనంగా నిర్వహిస్తున్నారు.



బివి రాఘవులు



పి మధు



వి శ్రీనివాసరావు

నెల్లూరు ప్రజా ఉద్యమాల నుంచి వచ్చిన ముగ్గురు నాయకులు రాష్ట్ర సిపిఎంకు నాయకత్వం వహించారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమ నాయకులుగా నెల్లూరులో రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు. పి.మధుది నెల్లూరు పక్కనే ఉన్న కనుపర్తిపాడు గ్రామం. 14 సంవత్సరాల వయస్సులోనే గ్రామంలోని భూస్వాముల పెత్తనంపై తిరగబడ్డారు. గ్రామంలో సిపిఎం అభివృద్ధికి అప్పుడే బీజాలు పడ్డాయి. నెల్లూరు నగరంలోని విఆర్ కళాశాలలో చదువుకున్నారు. కళాశాలలో ఎస్ఎఫ్ఐకి నాయకత్వం వహించారు. 1969లో తొలి విద్యార్థి సంఘం కార్యదర్శిగా, డివైఎఫ్ఐ, రైతు సంఘం తొలి రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పార్టీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాజ్యసభ సభ్యులుగా పని చేశారు. 2014 మార్చి 8న రాష్ట్ర విభజన అనంతరం ఎపికి తొలి రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పని చేశారు. 2021 వరకు కొనసాగారు.

బివి రాఘవులు ప్రకాశం జిల్లా పెదమోపాడు గ్రామంలో జన్మించారు. కందుకూరులో పాఠశాల విద్యను పూర్తి చేశారు. గుంటూరు, బాపట్లలో చదువుకున్నారు. కావలిలోని జవహర్ భారతీ డిగ్రీ కాలేజీలో చదువుకునే రోజుల్లోనే విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఎస్ఎఫ్ఐ, సిఐటియు, అనేక ప్రజా సంఘాల్లో పని చేశారు. 1997లో నల్గొండలో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2014 వరకు పనిచేశారు. ప్రస్తుతం సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులుగా కొనసాగుతున్నారు. బలమైన నాయకత్వ లక్షణాలను పునికిపుచ్చుకున్నారు. విద్యుత్ పోరాటం, ఇంటి స్థలాల పోరాటంతోపాటు అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

వి.శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా మద్దిపూడి మండలం తెల్లంపల్లిలో జన్మించారు. కావలి జవహర్ భారతిలో డిగ్రీ చదువుకున్నారు. నెల్లూరు నగరంలోని విఆర్ లా కాలేజీలో న్యాయవాద విద్యను పూర్తి చేశారు. ఎస్ఎఫ్ఐలో కీలక నేతగా పని చేశారు. జక్కా వెంకయ్య, వి.శ్రీహరి ప్రోత్సాహంతో ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. నెల్లూరు యువజన ఉద్యమంలోనూ, రైతు సంఘం, పార్టీ బాధ్యతల్లో పని చేశారు. 'ప్రజాశక్తి'లో సంపాదకులుగానూ సేవలందించారు. 2021లో గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై కొనసాగుతున్నారు. నెల్లూరు కమ్యూనిస్టు ఉద్యమాల నుంచి ఎందరో జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలుగా ఎదిగారు. 47 సంవత్సరాల తరువాత నెల్లూరులో జరుగుతోన్న సిపిఎం మహాసభ మరింత కాలం గుర్తుండి పోయేలా సాగనుంది.

అరుణ పతాక రెపరెపలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా నెల్లూరు నగరం ఎరుపెక్కింది. నగరంలోని ప్రధాన కూడళ్లలో సిపిఎం ఫ్లెక్సీలు, తోరణాలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, మాగుంట విగ్రహం, ఆర్‌టిసి, సుందరయ్య విగ్రహంతోసహా అన్ని ప్రధాన కూడళ్లు అరుణకాంతులతో ధగధగ మెరుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు, బుచ్చిరెడ్డిపాలెంతోపాటు అన్ని కేంద్రాల్లో సందడి కనిపిస్తోంది. బాలాజీ నగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయం విద్యుత్ దీపాలతో వెలిగిపోతోంది. ఈ ప్రాంతంలో గోడ రాతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్మికులు, కర్షకులు తమ ప్రాంతాల్లో ప్రత్యేకంగా మహాసభ తోరణాలు, జెండాలతో అలంకరించారు. కృష్ణపట్నం పోర్టు రోడ్డులోని చేపల మార్కెట్ కార్మికులు తమ ప్రాంతాన్ని పార్టీ పతాకాలతో అందంగా అలంకరించారు. స్థానిక హరనాథ్‌పురం సెంటర్‌లో ఏర్పాటు చేసిన తోరణాలు నగరవాసులను అబ్బురపరుస్తున్నాయి. ప్రత్యేక క్రేన్లు ఏర్పాటు చేసి ఎర్ర తోరణాలతో గొడుగులా తయారు చేశారు.

నేడు మహాసభ ప్రారంభం

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ శనివారం ఉదయం తొమ్మిది గంటలకు మాగుంట లేఅవుట్‌లోని అనిల్ గార్డెన్ (సీతారాం ఏచూరి) నగర్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి ప్రారంభించనున్నారు. నిపుణులైన కళాకారులుకష్టపడి నిర్మించిన వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మహాసభ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించనున్నారు. ప్రారంభ సభకు నగరంలోని ప్రముఖులను ఆహ్వానించారు. కేరళ నుంచి వచ్చిన ఎంఎ బేబికి చెన్నయ్ విమానాశ్రయం వెళ్లిన ఆహ్వాన సంఘం స్వాగతం పలికింది.



మహాసభ స్వాగత ద్వారం వద్ద ఏర్పాటు చేసిన జక్కా వెంకయ్య, పుచ్చలపల్లి సుందరయ్య నిలువెత్తు కటౌట్లు



మహాసభకు ముస్తాబైన ప్రధాన వేదిక



మోడీ, అమిత్‌షా వల్లే 'ఉక్కు'కు విఘాతం

- రాష్ట్ర విభజన హామీలను రాబట్టాల్సిన బాధ్యత టిడిపిదే
- ప్రచార జాతాల్లో సిపిఎం నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సిపిఎం 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకూ నెల్లూరులో జరగనున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన 'పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతా' 'విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ జాతా', 'పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతా', రాజధాని నిర్మాణం-రాష్ట్ర అభివృద్ధి జాతా, 'కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు' జాతాలు శుక్రవారం నెల్లూరుకు చేరుకున్నాయి. జాతాలకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని ఆపాలని కోరుతూ చేపట్టిన "విశాఖ ఉక్కు పరిరక్షణ ప్రచార జాతా"కు కావలిలో, విద్యుత్ ఛార్జీల భారాలను వ్యతిరేకించాలని, సెకి ఒప్పందాలను రద్దు చేయాలని, అదాని ముడుపులపై న్యాయ విచారణ జరపాలని, ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించాలని కోరుతూ నంద్యాలలో ప్రారంభమైన ప్రచార జీపు జాతా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన 'పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతా'కు కావలిలో నాయకులు స్వాగతం పలికారు. రాజధాని ప్రాంత రైతుల ప్లాట్లపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని, అసైన్ రైతులకు కూడా సమాన ప్యాకేజీ అమలు చేయాలని, రాజధాని ప్రాంత గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రాజధాని నిర్మాణం-రాష్ట్ర అభివృద్ధి జాతా నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించి, వారిని అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు ప్రాజెక్టును త్వరగా నిర్మించాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి మోడీ, అమిత్‌షాలు ఫీజుబులిటీ పేరుతో మోకాలడ్డుతున్నారని విమర్శించారు. ఫీజుబులిటీ లేదనడం సరికాదని, రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడం వల్లే జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా వల్లే ఉక్కుకు విఘాతం కలుగుతోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. విభజన హామీలను తుంగలో తొక్కేసారన్నారు. విభజన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత టిడిపి కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు పేరుతో సాగుతున్న ఉక్కు ఉద్యమానికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి కడప ఉక్కు, విశాఖ ఉక్కు ఎంత అవసరమో, రాజధాని కూడా అంతే అవసరమని తెలిపారు. రాజధాని ప్రాంత రైతుల ప్లాట్లపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని, అసైన్ రైతులకు కూడా సమాన ప్యాకేజీ అమలు చేయాలని, రాజధాని ప్రాంత గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో రాజధానికి ఎలాంటి సందిగ్ధత లేకుండా అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించాలని కోరారు.



విజయవాడ బుక్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు తదితరులు

పుస్తక ప్రదర్శనకు స్పందన

ప్రజాశక్తి- నెల్లూరు

సిపిఎం రాష్ట్ర మహాసభ నేపథ్యంలో నెల్లూరులోని విఆర్‌సిలో జనవరి 28 నుంచి జరుగుతోన్న సింహపురి పుస్తక ప్రదర్శనకు శుక్రవారం విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో తరలొచ్చారు. విజయవాడ బుక్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పుస్తక ప్రదర్శనకు మంచి స్పందన లభిస్తోంది. ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే ఈ పుస్తక ప్రదర్శనను పుస్తక ప్రియులందరూ ఉపయోగించుకోవాలని విజయవాడ బుక్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య కోరారు. ఆరుద్ర సాహిత్య వేదికపై కామ్రేడ్ జక్కా వెంకయ్య 'ఉద్యమాపథంలో నేను' పుస్తకాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అమరవీరులు పోరాట యోధుల పుస్తకాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పార్టీ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ పేదలు, కార్మికులు, కర్షకుల పక్షానే పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు..

ఆకట్టుకున్న జెవివి ప్రదర్శనలు, మేజిక్ షో

ప్రజల్లో సైన్స్ దృక్పథం పెంచడానికి జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు, మేజిక్ షో ఆకట్టుకున్నాయి. బురిడీ బాబాల గురించి వివరించారు. జెవివి సభ్యులు గాజు పెంకులపై నడిచి చూపించారు. ఇందులోని సైన్స్ కోణాన్ని విశదీకరించారు. ఒక మహిళ తన చంటి బిడ్డతో గాజు పెంకులపై నడిచి అకట్టుకున్నారు. బాబాలు చేసే ఎన్నో మోసపూరిత గారడీల వెనుక కేవలం సైన్స్ మాత్రమే ఉంటుందని జెవివి సభ్యులు విపులంగా విరించారు. ప్రజలు అలాంటి గారడీలు నమ్మి మోసపోవద్దని కోరారు. అనంతరం మేజిక్ షో నిర్వహించారు. ఇందులో కూల్ డ్రింక్స్, ఫైర్, తాడు ట్రిక్స్ ప్రదర్శించడంతోపాటు విజ్ఞానదాయక పాటలు పాడి ప్రజల్లో సైన్స్ చైతన్యాన్ని కలిగించారు.



చెన్నై విమానాశ్రయంలో సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీకి స్వాగతం పలుకుతున్న షార్ రిటైర్డ్ ఉద్యోగి పద్మనాభయ్య

యువతను కదిలిస్తాం..

మొదటి పేజి తరువాయి

మద్దతుతో దానిని తీసుకొచ్చారు. నీతి ఆయోగ్, వికసిత్ భారత్ మార్గదర్శకంలో ఇప్పుడు స్వర్ణాంధ్ర విజన్ 2047 తీసుకొచ్చారు. ఆ డాక్యుమెంట్‌కు, దీనికి పెద్ద తేడా కనిపించడం లేదు. ఆ రోజు 'అందరికీ ఉద్యోగాలు, సంపద సృష్టిస్తామని. అందరికీ పంచుతామని, పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పారు. ఇప్పుడూ అదే చెబుతున్నారు. అమెరికాలోనూ ఉద్యోగాలకు గ్యారంటీ లేదు. రాష్ట్రంలో పరిశ్రమల పేరుతో భ్రమలు కల్పిస్తున్నారు. ఒక్కటన్నా వచ్చిందా? చంద్రబాబు దావోస్ పర్యటన వల్ల ఏ ఫలితం వచ్చింది చెప్పండి. కాగితాల్లో లెక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి.

ప్ర : రాష్ట్రంలో బిజెపిని నియంత్రించడానికి సిపిఎం చేస్తోన్న కృషి ఏమిటి?

జ : రాష్ట్రంలో బిజెపికి ప్రజల మద్దతు లేదు. ఒక్క శాతం ఓట్లు కూడా ఇక్కడ రాలేదు. టిడిపి, జనసేనలను ఉపయోగించుకొని బిజెపి బలపడడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఏం చెప్పదలచుకున్నాయో వాటినే పవన్ కల్యాణ్‌తో మాట్లాడిస్తున్నాయి. పవన్ చెప్పినట్లు బిజెపికి రోడ్డు మ్యాప్ ఉంది. ఇందులో రహస్యం ఏమీ లేదు. టిడిపిని ఇంటికి సాగనంపి, బిజెపిని అధికారంలోకి తీసుకురావడమే రోడ్డు మ్యాప్ లక్ష్యం. టిడిపి ఇలానే ప్రతి విషయానికీ రాజీపడితే పవన్, బిజెపి నుంచి ముప్పు తప్పదు.

తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల ఉదాహరణ మనకు కనిపిస్తోంది. ఎక్కడైతే బిజెపిని ఎదిరించి , రాజకీయంగా నిలబడిన ప్రాంతీయ పార్టీలు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. బిజెపి మతోన్మాద విధానాలను తిప్పికొట్టడంలో సిపిఎం ఎప్పుడు ముందుంటుంది. ఇందులో ఏ మాత్రమూ రాజీ పడం.

ప్ర : నెల్లూరులో జరుగుతోన్న రాష్ట్ర 27వ మహాసభ ఏలాంటి నిర్ణయం తీసుకోనుంది?

జ : నెల్లూరు కమ్యూనిస్టు ఉద్యమానికి ఘనమైన చరిత్ర ఉంది. పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య. వి. శ్రీహరి లాంటి ఎందరో నేతలు ఉద్యమాలు నిర్మించిన గడ్డ ఇది. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో మతోన్మాదులు పొంచి ఉన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వ విధానాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రజా ఉద్యమాల బలోపేతానికి బలమైన నిర్ణయం సభలో తీసుకుంటాము. రాష్ట్రానికి ఒక దిశను ఈ మహాసభ చూపుతుందనడంలో సందేహం లేదు.


సంపాదకీయం

రక్షణ కవచానికి తూట్లు

విశాఖ వేదికగా జరిగిన పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్టం ఆటంకంగా ఉందని, గిరిజన చట్టాలను సడలించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పడం ఆదివాసులకు హాని తలపెట్టడమే! గిరిజన చట్టాలు సక్రమంగా అమలు జరగకపోవడం వల్ల ఇప్పటికే ఏజెన్సీలో గిరిజనేతరుల ఆక్రమణల జోరు ఎక్కువైంది. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతంలోని గణనీయమైన భాగం 5వ షెడ్యూలు కిందకు వస్తుంది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌ను ఉల్లంఘించే అధికారం ప్రభుత్వానికి కూడా లేదు. ప్రఖ్యాత సమతా కేసులో భారత సర్వోన్నత న్యాయస్థానం ఏనాడో ఈ విషయం తేల్చి చెప్పింది. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో షెడ్యూల్డ్ ప్రాంతంలో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయి. బినామీ పేర్లతో గిరిజన భూముల్లో హోటళ్లు, రిసార్టులు పెట్టి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారు. ఇప్పుడు 1/70ని సవరిస్తే గిరిజనులకు ఉన్న భూమి దక్కకుండా పోవడం ఖాయం. అడవుల్లో లభించే సహజ వనరులను బడా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎప్పటి నుండో పలు పథకాలు వేస్తోంది. అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించింది. అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు మోడీ సర్కారు ప్రయత్నాలకు వంత పాడడమే! భూ బదలాయింపు నియంత్రణ (ఎల్‌టిఆర్) చట్టం 1960 దశకంలో పెద్దఎత్తున సాగిన ఆదివాసీ పోరాటాల ద్వారా సంపాదించుకున్నదే తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలతో వచ్చింది కాదు. ఈ చట్టం మూలంగానే గిరిజనులకు ఎంతోకొంత భూమిపై అధికారం వచ్చింది. అలాగే యుపిఎ-1 ప్రభుత్వంపై వామపక్ష పార్టీలు ఒత్తిడి తెచ్చి అటవీ హక్కుల చట్టాన్ని తీసుకువచ్చాయి. అటవీ భూమిపై గిరిజనులకు హక్కులను ఈ చట్టం మరింత బలోపేతం చేయగా మోడీ ప్రభుత్వం దానినీ నిర్వీర్యపరచి గిరిజనుల నుండి భూములను బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తోంది. పంప్డ్ స్టోరేజీ హైడల్ ప్రాజెక్టుల పేరుతో వేలాది ఎకరాలను ఏజెన్సీ ప్రాంతంలో అదానీ కంపెనీల పరం చేయడాన్ని ఆదివాసీలు ప్రతిఘటిస్తున్నారు. ఇప్పటికే గిరిజన సలహా మండలి, పెసా చట్టం, జిఓ నెంబరు మూడు వగైరా రక్షణలన్నీ ఒక్కొక్కటీ ఎగిరిపోతున్నాయి. ఆదివాసీల ప్రయోజనాలను కాలరాస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సేవలో మునిగి తేలుతున్నాయి.

స్పీకర్ అన్నట్టు హోటళ్లు, లాడ్జీలు, రిసార్టులు కడితే ఏజెన్సీ అభివృద్ధి చెందదు. గిరిజనుల అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే వారు ఆర్థికంగా అభివృద్ధి అయ్యేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికీ డోలీ మోతలు తప్పని ఆ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు సమకూరిస్తే అభివృద్ధి చెందుతుంది. వాటన్నిటికీ ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలే తప్ప, గిరిజన ప్రాంత భూముల్లోకి అభివృద్ధి పేరిట కార్పొరేట్ శక్తులకు, వ్యాపారవేత్తలకు అవకాశం ఇవ్వరాదు. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న ఎల్‌టిఆర్ చట్టానికి సవరణలు చేస్తే ఆదివాసీ సహజ వనరులను, ఖనిజాలను, అడవులను సంపన్నులు స్వాధీనం చేసుకుని వ్యాపారం సాగిస్తారు. ఆదివాసీ జీవనోపాధి, సంస్కృతి ధ్వంసమవుతాయి. బాక్సైట్ తవ్వకాలకు అడ్డుగా ఉందని 1/70 చట్టానికి సవరణలు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి టిడిపి ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేసి...ఇక్కడి గిరిజన సలహా మండలిలో తీర్మానం చేయించింది. రాష్ట్ర శాసనసభకు చట్ట సవరణ అధికారం లేనందున ఆనాటి రాష్ట్రపతి ఆమోదం సంపాదించడానికి సకల యత్నాలూ చేసింది. అయితే వివిధ ఆదివాసీ సంఘాలు, సిపిఎం ఇతర వామపక్షాలు సాగించిన బలమైన బాక్సైట్ వ్యతిరేక ఉద్యమంతో అవి సాగలేదు. ఇప్పుడు మరలా టిడిపి కూటమి ప్రభుత్వం విజన్ 2047 వంటి విధానాలతో అలాంటి ప్రయత్నాలు మొదలుపెట్టిందని ప్రజలు భావిస్తున్నారు. ముఖ్యంగా చట్ట సవరణ మూలంగా తీవ్రంగా నష్టపోయే ఆదివాసీ ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసీలు 1/70ని సవరిస్తే మరింత వెనుకబడిపోతారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఇలాంటి ఆలోచనలు విరమించుకొని గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

మహనీయుల మాట




విప్లవ పథంలో పయనించే
వీరయోధులు,
ప్రతి పరాజయం నుంచీ కొత్త శక్తిని
కూడగట్టుకుంటారు.
చరిత్ర ప్రవాహంలో ఎంతగా
ఈదులాడితే,
మనోధైర్యం అంతగా పెరుగుతుంది.

- కార్ల్ మార్క్స్

Karl Marx

విశ్లేషణ

వృద్ధి రేటుతో ఒరిగేదెంత?



> **రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడమే కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం అని, ఆ తరువాతే సంక్షేమ పథకాలు అమలు అని తెగేసి చెబుతున్నారు. ఈ ధోరణి కేంద్ర ప్రభుత్వం యొక్క నయా ఉదారవాద స్వభావాన్ని తెలియజేస్తున్నది. ఈ విధానాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలుకు పూనుకున్నది. ప్రభుత్వ ఖర్చు తగ్గించుకొని, ప్రభుత్వ ఆదాయం పెంచుకోవాలనేది నయా ఉదారవాద విధానం యొక్క ముఖ్యమైన లక్షణం. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఏదో ఒక వంక చూపి అమలు వాయిదా వేస్తున్నది. ఒకవేళ అమలుకు పూనుకున్నా అనేక షరతులు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను చాల పరిమితం చేస్తారు. ఇప్పుడు సామాజిక పెన్షన్ పథకంలో అనర్హులు ఉన్నారనే ప్రచారం చేసి లబ్ధిదారులను కుదించటానికి పూనుకున్న విషయం తెలిసిందే.**



డా॥ బి.గంగారావు

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటింది. హడావుడి, ఆర్భాటాలు, రంగుల విజన్‌లతో మురిపిస్తున్నది. దావోస్ పెట్టుబడులు, పెట్టుబడుల సదస్సులతో రాష్ట్రంలో ఏవో అద్భుతాలు జరుగుతున్నట్లు మీడియా హోరెత్తిస్తున్నది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో సూపర్ సిక్స్, యువగళం పేర అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చారు. ముఖ్యంగా తల్లికి వందనం పేర ప్రతి విద్యార్థికి నెలకు రూ.15 వేలు, మహిళా శక్తి పేర ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి వంటి అనేకం అమలు చేస్తామన్నారు. మరో రెండు నెలల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియబోతున్నది. కానీ ఈ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలు అత్యధికం అమలు చేయలేదు. కేవలం సామాజిక పింఛన్ రూ.4 వేలకు పెంపు, ఒకే ఒక గ్యాస్ సిలిండర్ ఇవ్వడం వరకే పరిమితమైంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, గత వైసిపి ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి అప్పులమయం చేసిందని, వస్తున్న ఆదాయంలో ఎక్కువ భాగం అప్పులపై వడ్డీలకే చెల్లించాల్సి వస్తోందని అందువల్ల ప్రజలకిచ్చిన సంక్షేమ పథకాల వాగ్దానాలు వెంటనే అమలు చేయలేక పోతున్నామని ప్రచారంలో పెట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడమే కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం అని, ఆ తరువాతే సంక్షేమ పథకాలు అమలు అని తెగేసి చెబుతున్నారు. ఈ ధోరణి కేంద్ర ప్రభుత్వం యొక్క నయా ఉదారవాద స్వభావాన్ని తెలియజేస్తున్నది. ఈ విధానాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలుకు పూనుకున్నది. ప్రభుత్వ ఖర్చు తగ్గించుకొని, ప్రభుత్వ ఆదాయం పెంచుకోవాలనేది నయా ఉదారవాద విధానం యొక్క ముఖ్యమైన లక్షణం. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఏదో ఒక వంక చూపి అమలు వాయిదా వేస్తున్నది. ఒకవేళ అమలుకు పూనుకున్నా అనేక షరతులు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను చాల పరిమితం చేస్తారు. ఇప్పుడు సామాజిక పెన్షన్ పథకంలో అనర్హులు ఉన్నారనే ప్రచారం చేసి లబ్ధిదారులను కుదించటానికి పూనుకున్న విషయం తెలిసిందే.

పారిశ్రామికవేత్తలకు, వ్యాపార, వాణిజ్యవేత్తలకు మాత్రం ఎన్నడూ లేని విధంగా రూ.వేల కోట్లు పన్ను రాయితీలు ఇస్తున్నది. భూములు, గనులు, సముద్ర తీరం, అటవీ ప్రాంతం తదితర వాటిని ఈ శక్తులకు అభివృద్ధి పేర ధారాదత్తం చేస్తున్నది. ఈ చర్యల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి తీవ్ర గండి పడుతున్నది. ఉదాహరణకు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమలకు, ఇతర వాణిజ్య సంస్థలకు పదేళ్ల రాష్ట్ర జీఎస్టీ మినహాయిస్తున్నారు. భూములు ఉచితంగా బదలాయిస్తున్నారు. విద్యుత్, నీటి సరఫరా రాయితీలతో పాటు ఉత్పత్తి ప్రోత్సాహకాల పేర ప్రతి కార్మికుడికి నెలకు రూ. 7500 ప్రావిడెంట్ ఫండ్ రాయితీ పేర (యజమాని చెల్లించాల్సిన వాటా) చెల్లింపు, ఆ పరిశ్రమకు అవసరమైన ప్రధాన రోడ్లు, రైల్ వంటి మౌలిక సదుపాయాల కల్పన రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేయడం వంటి అనేక రాయితీలు కల్పిస్తున్నారు.

ఈ చర్యల వల్ల రాష్ట్ర వృద్ధి రేటు బాగా పెరిగి రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుతుందని, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంటున్నది. తద్వారా రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం పెరుగుతుందని, దీనిద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టొచ్చని వాదిస్తున్నది. కానీ రాష్ట్ర విభజన తరువాత గడిచిన దశాబ్దంలో ఈ పరిణామాలు చోటు చేసుకోవడం లేదనేది వాస్తవం. రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఈ పదేళ్ళలో మూడు రెట్లు అయ్యింది. రాష్ట్ర స్థూల వృద్ధి రేటు సగటున 9 శాతం కొనసాగింది. కాని రాష్ట్ర ఖజానాకు ఈ సంపద పెరుగుదల వల్ల పన్నుల ఆదాయంలో గణనీయమైన పెరుగుదల రావాలి కాని రాలేదు. ఉదాహరణకు రాష్ట్ర జిడిపి 2024-15లో రూ.5.24 లక్షల కోట్లు వుండగా 2023-24కి రూ.14.39 లక్షల కోట్లకు పెరిగింది. దాదాపు మూడు రెట్లు రాష్ట్ర స్థూల ఆదాయం పెరిగింది. ఇదే మోతాదులో కనీసం రాష్ట్రానికి పన్నుల రూపంలో ఆదాయం పెరగాలి. ఇది జరగలేదు. 2014 నుండి 2024 కాలంలో రాష్ట్ర సొంత పన్నుల నుండి (రాష్ట్ర జీఎస్టీ, అమ్మకపు పన్ను, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డ్యూటీ వంటివి) వచ్చిన ఆదాయం కేవలం రూ.42,618 కోట్లు నుండి రూ.78,026 కోట్లకు మాత్రమే పెరిగింది. మొత్తం రాష్ట్ర సొంత పన్నుల నుండి, కేంద్ర పన్నుల నుండి రాష్ట్రానికి వాటా రూపంలో వస్తున్న ఆదాయం మొత్తం కలిపి చూస్తే రాష్ట్ర జిడిపిలో 9 శాతం లోపే పరిమితం అవుతున్నది.

> **ప్రభుత్వం ప్రస్తుత విధానాన్ని విడనాడి సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయం, నీటి పారుదల, విద్య, వైద్యం వంటి సామాజిక రంగాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ విస్తరణ, ప్రభుత్వ ఉద్యోగ కల్పన, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, ప్రజలకు తక్షణం ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పన వంటి వాటిపై ఖర్చులు పెంచాలి. పెట్టుబడిదారులకు ఇస్తున్న పన్ను రాయితీలు రద్దు చేయాలి. శ్రామికుల వేతనాలు పెంచాలి. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ అదుపు, జోక్యం, వ్యయం పెంచాలి.**

రాష్ట్ర బడ్జెట్ వ్యయం కూడా రాష్ట్ర జిడిపి పెరుగుదలలో పడిపోతున్నది. 2018-19లో రాష్ట్ర బడ్జెట్ వ్యయం రాష్ట్ర జిడిపిలో 17.2 శాతం ఉంటే 2022-23 నాటికి 15.96 శాతానికి పడిపోయింది. అలాగే ముఖ్యమైన మూలధన వ్యయం కూడా రాష్ట్ర జిడిపిలో 2018-19లో 2.2 శాతం ఉంటే 20 22-23కి 0.13 శాతానికి తగ్గిపోయింది. మరొక వైపు కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా మోడీ పరిపాలనా కాలంలో బాగా తగ్గిపోతున్నది. కేంద్రం ఇచ్చే గ్రాంట్లలో కూడా కోత పెడుతున్నది. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాల వాటా ఏకపక్షంగా పెంచేస్తున్నది. రాష్ట్ర విభజన హామీలు అనేకం అమలు చేయటం లేదు. ఈ నిరంకుశ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపటం లేదు. రాష్ట్రాలకు అప్పులు సేకరించుకొనే అవకాశాలపై కూడా కేంద్రం ఆంక్షలు విధిస్తూ కోతలు పెడుతున్నది. దీనిపై కూడా స్పందించడంలేదు. గత వైసిపి ప్రభుత్వం సైతం ఇదే వైఖరి అవలంబించింది. అలాగే షరతులతో అప్పులు తీసుకొని ప్రజలపై భారాలు వేయటంతో పాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, ప్రజలకు నష్టకరమైన ప్రమాదకర విధానాల అమలుకు పూనుకున్నది. ఈ ప్రభుత్వం కూడా ఇదే వైఖరిని అమలు చేస్తూ రాష్ట్ర హక్కులను కేంద్రానికి తాకట్టు పెడుతూ అప్పుల కోసం కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నది. వైసిపి అమలు చేసిన కేంద్ర ప్రభుత్వ ఆదేశిత సంస్కరణలు చాలా వేగంగా అమలుకు పూనుకుంటున్నది. ఇటీవల నీతి ఆయోగ్ దేశంలోని అతి పెద్ద 18 రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై ఆర్థిక ఆరోగ్య సూచీ-2025 పేర ఒక నివేదికను విడుదల చేసింది. గత పదేళ్ళలో 2022-23 నాటికి ఉన్న ఆర్థిక పరిస్థితులు ఆధారంగా విడుదల చేసిన ఆర్థిక ఆరోగ్య సూచీలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగున 17వ స్థానంలో ఉందనీ నివేదిక తెలిపింది. అయితే రాష్ట్రాల్లో ఈ స్థితికిగల కారణాలను నీతి ఆయోగ్ రాష్ట్రాలను బాధ్యులను చేసి నయా ఉదారవాద విధానాలను వేగంగా అమలు చేయాలని పరిష్కారంగా చూపించింది. దీనిని కూడా చంద్రబాబు ఒక ప్రచార అస్త్రంగా వాడుకుంటూ తన విధానాలను సమర్థించుకుంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని గట్టెక్కించాలనే పేర ప్రజలపై భారాలకు వొడిగడుతున్నది. సుమారు రూ.40 వేల కోట్లపైబడి ప్రజల సంక్షేమంపై నిధులు ఖర్చు పెట్టకుండా దెబ్బతీసింది. లక్షల మంది వాలంటీర్లను తొలగించింది. ట్రూ అప్ చార్జీల పేర రూ.18 వేల కోట్లు విద్యుత్ చార్జీల భారం మోపారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగింపు కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని సమీక్షించి ప్రజలకు మేలు చేస్తామని ఎన్నికల్లో చెప్పి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదు. ఇప్పుడు రాష్ట్ర జీఎస్టీపై అదనంగా ఒక శాతం సర్ చార్జీ విధించాలని కేంద్రాన్ని కోరుతున్నది. ఇలాంటి పన్నుల భారాలు రాబోయే కాలంలో అనేక రూపాల్లో వస్తాయి. చెత్తపై యూజర్ చార్జీలు రద్దు చేసినా పీ4 (ప్రభుత్వ, ప్రైవేట్, పీపుల్ పార్టిసిపేషన్) పేర ప్రభుత్వ పౌర సేవలు, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం వంటి సామాజిక సేవలు ప్రైవేట్ శక్తులకు బదిలీ చేయటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ బాధ్యతల నుండి పూర్తిగా వైదొలగబోతున్నది. అలాగే ప్రభుత్వం తప్పనిసరిగా రాష్ట్ర బడ్జెట్‌లో వేతనాలు, రిటైర్ అయిన వారికి పెన్షన్, వడ్డీ చెల్లింపులు, పరిపాలనా ఖర్చులు (కమిటెడ్ ఎక్స్‌పెండిచర్)కు తగు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో 64.6 శాతం నిధులు వీటికి ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేతనాలు, పెన్షన్ల మీద పెట్టే ఖర్చు తగ్గించుకునే విధానాన్ని అమలు చేస్తున్నది. గత దశాబ్దంలో వేతనాలు, పెన్షన్లపై ఖర్చు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో 39.30 శాతం నుండి 37.90 శాతానికి తగ్గిపోయింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో వున్న ఖాళీలు రద్దు చేసి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ద్వారా, కొన్ని సేవలు ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేయటం ద్వారా ఈ ఖర్చును ఇంకా తగ్గించు కోవటానికి ప్రయత్నం చేస్తున్నది. ఈ విధానంలో భాగంగానే ఉపాధ్యాయ నియామకాలను జాప్యం చేస్తున్నది.

ఇప్పుడు ప్రభుత్వం ప్రజల సంక్షేమంపై వ్యయాన్ని కుదిస్తూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం, సంపన్నుల అవసరాల కోసం నిధులు ఖర్చు పెడుతున్నది. అదేమంటే 2047 నాటికి రాష్ట్ర జిడిపిని 2.4 ట్రిలియన్ డాలర్లకు పెంచాలని తద్వారా రాష్ట్ర ప్రజలు అత్యంత సంపన్నులవుతారని ప్రచారం చేస్తున్నది. ప్రజలకు తక్షణ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత కాకుండా విమానాశ్రయాలు, భారీ స్టేడియంలు, బుల్లెట్ ట్రైన్ల వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తీసుకొస్తున్న అప్పులు కూడా వీటి కోసం ఖర్చు చేస్తున్నారు. చివరికి విద్య, వైద్యం వంటి సామాజిక సదుపాయాలకు కూడా ఖర్చు తగ్గించేస్తున్నారు. వ్యవసాయంపై కూడా ఖర్చు పెంచటానికి నిరాకరిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాల వల్ల ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ శ్రామికుల ఆదాయాలు బాగా తగ్గిపోతున్నాయి. ఇప్పుడు ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి దారుణంగా దెబ్బతిన్నది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత చిక్కుల్లో పడుతున్నది.

ప్రభుత్వం ప్రస్తుత విధానాన్ని విడనాడి సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయం, నీటి పారుదల, విద్య, వైద్యం వంటి సామాజిక రంగాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ విస్తరణ, ప్రభుత్వ ఉద్యోగ కల్పన, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, ప్రజలకు తక్షణం ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పన వంటి వాటిపై ఖర్చులు పెంచాలి. పెట్టుబడిదారులకు ఇస్తున్న పన్ను రాయితీలు రద్దు చేయాలి. శ్రామికుల వేతనాలు పెంచాలి. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ అదుపు, జోక్యం, వ్యయం పెంచాలి. దీనివల్ల ప్రజలకు ఆదాయం పెరిగి కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఈ ప్రక్రియ జరిగితేనే రాష్ట్రం ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక సరుకులకు, సేవలకు డిమాండ్ పెరిగి పన్నుల ద్వారా రాష్ట్రానికి అదనంగా రెండు నుండి మూడు రెట్లు సొంత బడ్జెట్ ఆదాయం పెరుగుతుంది. అంతేగాక అదనపు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. కొంత మేరకైనా ఆర్థిక అసమానతలు తగ్గుముఖం పడతాయి. ఈ దృష్టితో రాష్ట్ర ప్రభుత్వం క్రియాశీల విత్త విధానం అమలు చేపడితేనే రాష్ట్రం ప్రస్తుత ఆర్థిక సమస్యలనుండి బయట పడగలదు.

(వ్యాసకర్త సెల్ : 9490098792)

వ్యాఖ్య

వ్యవసాయ చట్టాలతో కార్పొరేట్ల అక్రమ చొరబాటు



> **రైతాంగ ఉద్యమం ముందుకు తెచ్చిన ఏ ఒక్క కోర్కెనూ కేంద్రం తీవ్రంగా తీసుకోలేదని ఈ ముసాయిదా స్పష్టం చేస్తుంది. గరిష్ట మద్దతు ధర (ఎం.ఎస్.పి)ను చట్టబద్ధం చేయడం, వ్యవసాయంపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం, రైతాంగానికి అనుకూలమైన పరపతి సదుపాయాలు కలిగించడం వంటి కోర్కెలను అసలు పట్టించుకోలేదని తెలుస్తుంది. రాజ్యాంగం 246వ అధికరణం ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర ప్రభుత్వ జాబితా లోనిదని కంటితుడుపుగా ఒప్పుకుంటూనే ఆ ముసాయిదా ప్రధాన శైలి మాత్రం సమాఖ్య విధానంపై రాష్ట్రాల అధికారాలపై దాడి చేసేదిగా వుంది. రాష్ట్రాల ప్రాయోజితమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను నిర్మూలించడం, ఎ.పి.ఎం.సి ల పాత్రను రద్దు చేయడం, చిన్న మధ్యతరహా రైతాంగాన్ని ప్రైవేటు వ్యాపార కూటములకు విపరీతంగా లోబడిపోక తప్పని పరిస్థితి కల్పించడానికి దారితీసేదిగా వుంది.**

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన పత్రం (ఎన్.పి.ఎఫ్.ఎ.ఎమ్) పేరిట కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఆరెస్సెస్, బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వ కుత్సిత ఉద్దేశాలను బహిర్గతం చేస్తున్నది. రైతుల ప్రయోజనాలను బలిపెట్టి కార్పొరేట్ లాభాలను అత్యధిక స్థాయికి చేర్చడం కోసం పన్నిన పన్నాగమిది.

రైతాంగ ఉద్యమం ముందుకు తెచ్చిన ఏ ఒక్క కోర్కెనూ కేంద్రం తీవ్రంగా తీసుకోలేదని ఈ ముసాయిదా స్పష్టం చేస్తుంది. గరిష్ట మద్దతు ధర (ఎం.ఎస్.పి)ను చట్టబద్ధం చేయడం, వ్యవసాయంపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం, రైతాంగానికి అనుకూలమైన పరపతి సదుపాయాలు కలిగించడం వంటి కోర్కెలను అసలు పట్టించుకోలేదని తెలుస్తుంది. రాజ్యాంగం 246వ అధికరణం ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర ప్రభుత్వ జాబితా లోనిదని కంటితుడుపుగా ఒప్పుకుంటూనే ఆ ముసాయిదా ప్రధాన శైలి మాత్రం సమాఖ్య విధానంపై రాష్ట్రాల అధికారాలపై దాడి చేసేదిగా వుంది. రాష్ట్రాల ప్రాయోజితమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను నిర్మూలించడం, ఎ.పి.ఎం.సి ల పాత్రను రద్దు చేయడం, చిన్న మధ్యతరహా రైతాంగాన్ని ప్రైవేటు వ్యాపార కూటములకు విపరీతంగా లోబడిపోక తప్పని పరిస్థితి కల్పించడానికి దారితీసేదిగా వుంది.

ప్రధానంగా ప్రైవేటు కోసమే!

ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్ల ఏర్పాటు, ముఖద్వారంలోనే కార్పొరేట్ వ్యాపారులు, ఎగుమతిదారులు కొనుక్కునే అవకాశం కల్పించడం వంటి అంశాలు ఈ ముసాయిదా ప్రధానంగా సూచిస్తున్నది. సంప్రదాయక వ్యవసాయ మార్కెట్ యార్డుల స్థానంలో కార్పొరేట్ అధీనంలోని గోదాములు, సిలోలు తీసుకురావడం, రాష్ట్ర వ్యాపిత మార్కెట్ ఫీజును వాణిజ్య ఫీజును ప్రవేశ పెట్టడం వంటివి ఈ ముసాయిదాలో ప్రధానంగా సూచించిన సంస్కరణల్లో వున్నాయి. బడా కార్పొరేట్లు ఎ.పి.ఎం.సి మార్కెట్ యార్డులను తోసిపుచ్చి తామే నేరుగా రైతుల ఉంచి కొనుగోలు చేయాలని ఆ ముసాయిదా ప్రతిపాదిస్తున్నది. రిలయన్స్, అదానీలతో సహా బడా కార్పొరేట్ కంపెనీలకు విస్తారమైన గోదాము వ్యవస్థ వుంది. హర్యానాలోని సిర్సా, పంజాబ్‌లోని లుధియానాలలో ప్రైవేటు రైల్వే నెట్‌వర్క్ కూడా వుంది.

ఎం.ఎస్.పి ఎందుకు గిట్టదు?

ఎం.ఎస్.పి అనే దానికి కార్పొరేట్ లాబీ, అలాగే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు పచ్చి వ్యతిరేకతతో వున్నారు. ఎందుకంటే వ్యవసాయోత్పత్తులను కారుచౌకగా కొనేయడమే ఎప్పుడూ వారి వ్యూహంగా వుంటున్నది. దానికి కొంత నాణ్యత జోడించి బ్రాండు వేసి మార్కెట్‌లో అమ్ముకోవడమే వారి లక్ష్యం. ఈ క్రమంలో విపరీతమైన లాభాలు గుట్టలు పోగు పోసుకోవాలని చూస్తారు. ఈ విధంగా బడా వ్యాపార వర్గాలు రైతులనూ అలాగే వినియోగదారులను కూడా దోచుకుంటున్నాయి. మార్కెట్ సామర్థ్యం పేరుతో కేంద్రం వ్యవసాయోత్పత్తులను కార్పొరేట్ లూటీకి అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేస్తున్నది. కార్పొరేట్ పరిశ్రమలు, వాణిజ్యవేత్తలు ప్రాథమిక ఉత్పత్తిదారులైన రైతుల నుంచి తాము కబళించిన అదనపు లాభంలో కొంత శాతాన్నయినా వారు అందించిన ముడి సరుకుకు గిట్టుబాటు ధరగా కలపాలని ముసాయిదాలో ఎలాంటి నియంత్రణ నిబంధన పెట్టలేదు. ఈ విధంగా బిజెపి నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకు లొంగిపోతున్నది. రైతాంగ ఆత్మహత్యలు, రుణభారం కొనసాగడానికి కారణమవుతున్నది. రైతాంగం దివాళా తీసే పరిస్థితిని సృష్టిస్తున్నది.

ఎ.పి.ఎం.సి చట్టాన్ని రద్దు చేయడంతో బీహార్‌లో మండీలు పోయాక ఎలాంటి శోచనీయ పరిస్థితులు ఏర్పడ్డాయో ఈ నివేదిక డాక్యుమెంటుగా నివేదించడం చెప్పుకోదగిన అంశం. ఇదెంతో వైరుధ్యభరితం. పరాకాష్ట. ఎందుకంటే ఢిల్లీలో రైతాంగ పోరాటం తారా స్థాయిలో వుండగా...ఆరెస్సెస్-బిజెపి వర్గాలు, కేంద్ర ప్రభుత్వానికి సన్నిహితులైన కార్పొరేట్ వర్గాలు ఎ.పి.ఎం.సి చట్టం రద్దును వ్యవసాయ మార్కెట్ల నియంత్రణ ఎత్తివేతకు గొప్ప ఉదాహరణ అన్నట్టు కథనాలు ప్రచారంలో పెడుతూ వచ్చాయి.

వ్యవసాయం కార్పొరేటీకరణ

వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయాలని ఈ ముసాయిదా సుస్పష్టంగా చెబుతోంది. వ్యవసాయాన్ని సంస్కరించడానికి అదొక్కటే మార్గమని చూపిస్తున్నది. ఉదాహరణకు ఈ ముసాయిదా ఎంతో గొప్పగా చెప్పబడిన మోడీ అత్యంత ప్రియ పథకమైన ఎఫ్.పి.వో పథకం కార్పొరేట్ చొరబాటుకు మార్గంగా ఊహిస్తున్నది. దీని ప్రకారం ఎఫ్.పి.వోలు క్లస్టర్ల ప్రాతిపదికగా బడా వ్యాపార సంస్థలతో కాంట్రాక్టు ఏర్పాట్లు చేసుకుని రంగంలోకి దిగడానికి సానుకూల వాతావరణం సృష్టించాల్సి వుంటుంది. ఎఫ్.పి.వో పథకాన్ని ముందుకు తీసుకుపోవడానికి వీలుగా సి.ఐ.ఐ, ఎఫ్.ఐ.సి.సి.ఐ వంటి కార్పొరేట్ గ్రూపులు చూపిస్తున్న మహా ఆరాటం ఇప్పుడు ఆవిష్కృతమవుతున్నది.

ఫ్యూచర్స్ బహిరంగ మార్కెట్ ద్వారా పెట్టుబడుల ప్రవేశాన్ని మరింత లోతుకు తీసుకుపోవాలన్న సూచనను కూడా ఇదే బడా వ్యాపార సంస్థల ఉచ్చుగా మాత్రమే చూడవలసి వుంటుంది. దీనివల్ల బహుళజాతి కంపెనీలు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు దేశీయ ఆహార పరిశ్రమలోకి ప్రవేశించి ఆధిక్యత సంపాదించి నియంత్రించేందుకు అవకాశం లభిస్తుంది. తద్వారా భారతీయుల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది.

ఈ ముసాయిదాకు ఇప్పటికే గట్టి ప్రతిఘటన మొదలైంది. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుపై ఈ ముసాయిదాను దగ్ధం చేస్తూ దేశ వ్యాపితంగా వేలాది మంది రైతులను డిసెంబరు 23న ప్రదర్శనలో సమీకరించింది. అదే విధంగా జనవరి 26న ట్రాక్టర్లు/వాహనాల ర్యాలీలలోకి తీసుకొచ్చింది. హర్యానాలోని తొహానాలోనూ పంజాబ్‌లోని మోగాలోనూ జరిగిన రెండు మహా కిసాన్ పంచాయత్‌లలోనే 75 వేల మంది రైతులు సమీకృతులైనారు. ఇటీవలనే ఢిల్లీలో జరిగిన ఎస్.కె.ఎం జాతీయ సమావేశాలు ఈ పోరాటాన్ని మరింత తీవ్రం చేయాలని ప్రతినబూనాయి.

భారత దేశ వ్యవసాయ రంగాన్ని దేశ విదేశీ కార్పొరేట్లకు బంగారు పళ్లెంలో పెట్టి అప్పగించాలని చూస్తున్న బిజెపి, ఆరెస్సెస్ ప్రభుత్వ ప్రయత్నాలను అన్ని తరగతుల ప్రజలూ బలంగా ప్రతిఘటించడం అవసరం.

('పీపుల్స్ డెమోక్రసీ' జనవరి 29 సంపాదకీయం)

కవిత్వం

శిలాక్షరాలు

మొలకను సాకినట్టు
మొక్కను పెంచినట్టు
చెట్టును సంరక్షించినట్టు
మెదడుకు మేత
వేస్తూనే వుండాలి
ప్రశ్నల పరంపర సంధిస్తూ...
అను నిత్యం భావ సంఘర్షణ
జరుపుతూనే వుండాలి.
నవ్య భావనలకు ఎల్లప్పుడూ...
నగిషీలు చెక్కుతూనే వుండాలి.
ప్రకృతి అణువణువునా...
అల్లుకున్న పరమాణువు
నిలకడ కోసం ప్రతి నిత్యం
గొడవ పడుతూనే వుంటుంది.
చలిస్తూ జ్వలిస్తూ...
వైవిధ్యపు లోకానికి పురుడు
పోస్తూనే వుంటుంది.
కలహిస్తూ కలసి సాగుతూ...
నిరంతరం ప్రగతి దారులు
పరుస్తూనే వుంటుంది.
బుద్ధిని శుద్ధి చేసుకుంటూ...
బూజు పట్టిన భావాలకు
ఉప్పు పాతర వేసుకుంటూ...
ముందుకు సాగడంలోనే...
మహోజ్వల మానవ చరిత
నవ్యమైన నవోదయపు
శిలాక్షరాలను లిఖిస్తూ...
మునుముందుకు
సాగుతునే వుంటుంది.

- వి.రాజగోపాల్,
విజయనగరం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : edit-pageps @gmail.com

రైస్‌మిల్లుల్లో ఏనుగుల బీభత్సం

- పెద మేరంగి కూడలిలో రైస్‌మిల్లుల్లో చొరబడి తలుపులు, కిటికీలు ధ్వంసం
- 30 ధాన్యం బస్తాలు చిందరవందర
- ఇదే రైస్ మిల్లులో ఐదోసారి ధ్వంసం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

జియ్యమ్మవలస మండలం పెదమేరంగి కూడలి సమీపాన గల శ్రీ సాయి గాయత్రి మినీ మోడరన్ రైస్ మిల్లులో గురువారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. మిల్లులోకి ప్రవేశించి కిటికీలు, తలుపులు ధ్వంసం చేసి మిల్లు ఆడించి తినడానికి ఉంచిన బియ్యాన్ని, ఆడించడానికి ఉంచిన 30బస్తాల ధాన్యాన్ని ఏనుగులు కాళ్లాన్నిన్ని తిని, మిగిలిన ధాన్యాన్ని చిందరవందర చేసి వెళ్లిపోయాయి. శుక్రవారం తెల్లవారి మిల్లు యజమాని అక్కడకు వెళ్లి పరిస్థితిని చూసి ఏమైందో తెలియక నిర్ఘాంతపోయాడు. అనంతరం తేరుకొని ఇది ఏనుగుల పనేనని గ్రహించి లబోదిబోమన్నాడు. అయితే ఏనుగుల వల్ల ఇలా జరగడం ఇది ఐదో సారి కావడం గమనార్హం. ఇలా జరగడం వల్ల ప్రతిసారీ కనీసం రూ.50వేల వరకు నష్టం సంభవిస్తూ వస్తుందని యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏనుగుల కదలికలపై పరిశీలన చేయాల్సిన అటవీ శాఖ సిబ్బంది పగలు మాత్రమే గమనించి రాత్రి వేళల్లో అసలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆ రైస్ మిల్లు పక్కనే జనావాస కాలనీ ఉందని, జరగరానిది ఏమైనా జరిగితే దీనికి బాధ్యులు ఎవరని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఏనుగులను తరలిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇకనైనా తరలిస్తుందని ఎదురుచూస్తున్నారు. ఇకనైనా అధికారులు తన మిల్లు వద్ద జరిగిన నష్టాన్ని పరిశీలించి నష్టపరిహారాన్ని ఇప్పించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో జిఎం తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శుక్రవారం తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్‌లో రూ.311 కోట్లతో చేపట్టిన ప్రధాన పునరాభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. తిరుచానూరు, రాజంపేట, కడప రైల్వేస్టేషన్లను తనిఖీ చేశారు. ఆయనతో పాటు గుంతకల్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు. నిర్ణీత గడువులోపు స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

న్యాయ విచారణ కమిషన్ తిరుపతికి రాక

తిరుపతి బ్యూరో: తిరుపతి వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల తొక్కిసలాట ఘటనపై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ కమిషన్ హై కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తిని శ్రీ పద్మావతి అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, జెసి శుభం బన్సల్ కలిసారు.

ఎసిబి వలలో హాస్టల్ వార్డెన్

- లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో ఎంప్లాయీస్ కాలనీలో గురువారం రాత్రి ఎసిబి రైడింగ్ తీవ్ర సంచలనం రేపింది. సోషల్ వెల్ఫేర్ బాలికల కాలేజీ హాస్టల్ వార్డెన్ నాగమణి రూ.30 వేల నగదు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడ్డారు. హాస్టల్లో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఝాన్సీ అనే ఉద్యోగి నుంచి వార్డెన్ లంచం డిమాండ్ చేయగా ఝాన్సీ ఏలూరు ఎసిబిని ఆశ్రయించింది. దీంతో వార్డెన్‌ను రెండ్ హాండెడ్‌గా పట్టుకున్నట్లు ఎసిబి డిఎస్‌పి సుబ్బరాజు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఈ కేసు దర్యాప్తులో ఏలూరు ఎసిబి సిఐ ఎం.బాలకృష్ణ, కె.శ్రీనివాస్, రాజమండ్రి సిఐ ఎన్‌వి.భాస్కరరావు పాల్గొన్నారు.

ఎల్‌ఓసి వద్ద ఎన్‌కౌంటర్

- ఇద్దరు ఉగ్రవాదుల మృతి

కాశ్మీర్ : జమ్ముకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) దాటి చొరబడటానికి ప్రయత్నించిన ఇద్దరిని శుక్రవారం భద్రతాదళాలు కాల్చివేశాయి. ఈ సంఘటన గురువారం పూంచ్ జిల్లాలోని ఖరీ కర్మారా ప్రాంతంలో జరిగిందని అధికారులు తెలిపారు. పూంచ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వద్ద గురువారం రాత్రి ఉగ్రవాద కదలికను గుర్తించారు. అప్రమత్తమైన దళాలు చొరబడిన ఉగ్రవాదులతో వేగంగా వ్యవహరించాయి. ఇది తీవ్రమైన, భారీ కాల్పులకు దారితీసిందని సైన్యం యొక్క జమ్మూకు చెందిన వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్ లో ఒక పోస్ట్‌లో తెలిపింది. ఈ ఆపరేషన్ రాత్రంతా కొనసాగిందని, దీనివల్ల ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని సైన్యం తెలిపింది.

ఢిల్లీలో 'వెరీ పూర్' కేటగిరీలో గాలి నాణ్యతలు

న్యూఢిల్లీ : ఢిల్లీలో గాలి నాణ్యతలు మరోసారి క్షీణించాయి. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఎక్యూఐ (గాలి నాణ్యతలు) 349 స్థాయిల్లో నమోదైందని, ఎక్యూఐని వెరీ పూర్ కేటగిరీలో వర్గీకరించినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ఎక్యూఐ 50గా నమోదైతే గుడ్, 101 నుంచి 200 మధ్య నమోదైతే మధ్యస్థమని, 201 నుంచి 300 మధ్య నమోదైతే పూర్, 301 నుంచి 400 మధ్య నమోదైతే వెరీ పూర్, 401- 500 మధ్య నమోదైతే తీవ్రస్థాయిలో గాలి నాణ్యతలు వర్గీకరించనున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

ఇంఫాల్ : మణిపూర్‌లోని కక్చింగ్ జిల్లా నుండి ఆయుధాలను, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు శుక్రవారం తెలిపారు. జిల్లాలోని చైరెల్ ఖునౌకొండ ప్రాంతం దిగువన గురువారం సెర్చ్ ఆపరేషన్ చేపట్టామన్నారు. రైఫిల్, 9 ఎంఎం పిస్టల్, ఐఇడి, రెండు గ్రెనేడ్లు, పొగబాంబు, టియర్‌గ్యాస్ గ్రెనేడ్, డిటోనేటర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దోపిడీకి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెప్పారు. అరెస్టయిన ఇద్దరు వాలంటీర్స్ వెల్ఫేర్ ఫండ్ సంస్థ సభ్యులని, ఇంఫాల్ పశ్చిమ జిల్లా సగోల్‌బంద్ తెరా ప్రాంతంలో గురువారం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.

జయలలిత ఆస్తులన్నీ తమిళనాడు సర్కారుకే..!

బెంగళూరు : మాజీ ముఖ్యమంత్రి జె.జయలలిత ఆస్తికి సంబంధించి బెంగళూరులోని ప్రత్యేక కోర్టు కీలక తీర్పునిచ్చింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో జయలలిత ఆస్తులన్నీ తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలంటూ... బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. జయలలితకు చెందిన ఆస్తులను తమిళనాడు ప్రభుత్వం పదేళ్ల క్రితమే స్వాధీనం చేసుకుంది. అప్పుడు ఆ ఆస్తుల విలువ రూ.913 కోట్లుగా ఉంది. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ. 4,000 కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా. ఆ ఆస్తులు మొత్తం తమకే చెందుతాయంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీప అనేక ప్రయత్నాలు చేశారు. ఇటీవల వాటిని తమకే అప్పగించాలంటూ కర్నాటక హైకోర్టును కూడా ఆశ్రయించగా.. విచారణ చేపట్టిన న్యాయస్థానం వారు వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. బెంగళూరులోని ప్రత్యేక కోర్టు తీర్పునిస్తూ ... జయలలిత ఆస్తులన్నీ తమిళనాడు ప్రభుత్వానికే చెందుతాయని ప్రకటించింది. జయలలితకు చెందిన 1,562 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 27 కిలోల బంగారు, వజ్రాభరణాలు, పది వేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తువులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించనుంది.

తొక్కిసలాటకు యోగి ప్రభుత్వానిదే బాధ్యత : అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో తొక్కిసలాట జరిగి 30 మంది మరణించడానికి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్ గురించి తర్వాత చర్చించవచ్చు. ముందు మహాకుంభమేళ ఘటన గురించి మాట్లాడాలి. కుంభమేళా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కోసం ఎంపీలు మాట్లాడాలి' అని ఆయన అన్నారు. కుంభమేళాలో ఎంతమంది చనిపోయారనేది యుపి ప్రభుత్వం దాచిపెట్టి.. పరిహారం చెల్లించడం లేదని ఆయన అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

బ్లాక్ బాక్స్‌ల స్వాధీనం

- 40 మృతదేహాల వెలికితీత
- వాషింగ్టన్ విమాన ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తు
- ప్రమాదానికి సిబ్బంది కొరతే కారణమా?

వాషింగ్టన్ : ఆకాశంలో హెలికాప్టర్ ఢీకొనడంతో పొటొమాక్ నదిలో పడిపోయిన ప్రయాణికుల విమానం తాలూకు బ్లాక్ బాక్స్ లభ్యమైనట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. . కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్లను స్వాధీనం చేసుకున్నట్లు జాతీయ రవాణా భద్రతా బోర్డు (ఎన్‌టిఎస్‌బి) ప్రకటించింది. వాటిలో డేటా పరిశీలన నిమిత్తం ఎన్‌టిఎస్‌టి ల్యాబ్‌లకు పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు నదిలో నుండి గురువారం సాయంత్రానికి 40 మృతదేహాలను వెలికి తీశారు. రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో కంట్రోల్ టవర్‌లో సిబ్బంది తక్కువగా వున్నారని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. సాధారణంగా ఇద్దరు కంట్రోలర్లు వుండాలని, ఒక్కరే వున్నారని, ఆయనే విమానం, హెలికాప్టర్ ట్రాఫిక్‌ను చూడాల్సి వచ్చిందని పత్రికా కథనం పేర్కొంది. ఫెడరల్ పౌర విమానయాన వర్గాలు అందించిన వివరాలను ఉటంకిస్తూ ఆ కథనం వెలువడింది. ఈ విషాదానికి అప్పటి అధ్యక్షుడు బైడెన్, వారి ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణమని అధ్యక్షుడు ట్రంప్ విమర్శించారు. మంచి ఉద్యోగులు, నిపుణులు పౌర విమానయాన సంస్థలో లేరని, ఇందుకు బైడెన్, ఒబామాలే కారణమని ఆయన ఆరోపించారు.

దిగివచ్చిన బ్రాండిక్స్ యాజమాన్యం

- చలిని లెక్క చేయకుండా రాత్రంతా కొనసాగిన ఆందోళన
- అదనపు పని గంటలు పెంచబోమని హామీ



ప్రజాశక్తి-అచ్యుతాపురం (విశాఖ)

బ్రాండిక్స్ మహిళా కార్మికులు నిరవధిక సమ్మెతో బ్రాండిక్స్ యాజమాన్యం దిగొచ్చింది. శుక్రవారం చర్చలు జరిపి పది రోజుల్లో డిమాండ్లను పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. సమస్యల సాధనకు పలు డిమాండ్లతో గురువారం బ్రాండిక్స్ ప్రధాన గేటు వద్ద ఏ, బి షిఫ్టికి చెందిన మహిళా కార్మికులు సమ్మె బాట చేపట్టారు. గురువారం రాత్రి అంతా చలిని లెక్కచేయకుండా బ్రాండిక్స్ ప్రధాన గేటు వద్ద ఐకమత్యంగా పోరాటాన్ని కొనసాగించారు. తమ డిమాండ్లు నెరవేరేంతవరకు వెనకకు తగ్గేది లేదని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పలు శాఖలకు చెందిన అధికారులు బ్రాండిక్స్ ప్రతినిధులు చర్చలు జరపడానికి మహిళా కార్మికులను కలిశారు. ఎస్ఇజెడ్ లేబర్ కమిషనర్ రమ్య, అనకాపల్లి ఆర్డీఓ ఆయేషా, పరవాడ డి.ఎస్.పి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తాహశీల్దార్, కార్మిక శాఖ అధికారులు బ్రాండిక్స్ ప్రతినిధులు మహిళలతో, సిఐటియు ప్రతినిధులతో చర్చలు జరిపారు. ప్రధానమైన డిమాండ్గా అగ్రిమెంట్ పని భారం పెంచబోమని హామీ ఇచ్చారు. ఆదివారం సెలవులు ఇస్తామని లైంగిక వేధింపులు, మానసిక వేధింపులు లేకుండా చూస్తామని తెలిపారు. టార్గెట్లు పేరుతో వేధింపులు చేయమని కార్మికుల అవసరాలకు సెలవులు ఇస్తామని, కార్మికుల జీతాలు పెంపుదలకు యాజమాన్యంతో చర్చించి పది రోజులలో పరిష్కారం చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. మహిళల ఫిర్యాదు కొరకు ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. గోల్డ్ కాయిన్ ప్రోత్సాహకం కొనసాగించడానికి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. చర్చలలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, అధ్యక్షులు ఆర్ శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, గనిశెట్టి సత్యనారాయణ, వివి.శ్రీనివాసరావు, కె సోమ నాయుడు, సిహెచ్ కిషోర్ తదితరులు మహిళలకు మద్దతుగా చర్చల్లో చురుకైన పాత్ర పోషించారు.

మణిపూర్కు అగ్రస్థానం

- కబడ్డీలో రాజస్థాన్, యుపి ఘన విజయం
- 38వ జాతీయ క్రీడలు

డెహ్రాడూన్: 38వ జాతీయ క్రీడల్లో పతకాల పట్టికలో మణిపూర్ జట్టు అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఇక కబడ్డీ పోటీల్లో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ జట్లు ఘన విజయం సాధించాయి. తొలి మ్యాచ్లో గ్రూప్-ఎలో రాజస్థాన్ జట్టు 48-35పాయింట్ల తేడాతో ఉత్తరాఖండ్ను చిత్తుచేయగా.. గ్రూప్-బిలో ఉత్తరప్రదేశ్ జట్టు 62-29పాయింట్ల తేడాతో కర్ణాటకను చిత్తుచేసింది. గ్రూప్-ఎ మరో మ్యాచ్లో డిఫెండింగ్ ఛాంపియన్ సర్వీసెస్ 41-36పాయింట్ల తేడాతో హర్యానాను, గ్రూప్-బిలో ఛత్తీస్గఢ్ జట్టు 62-50పాయింట్లతో మహారాష్ట్రను ఓడించాయి.

పతకాల పట్టిక

రాష్ట్రం	స్వ	ర	కా	మొ
1. మణిపూర్	9	7	3	19
2. సర్వీసెస్	9	6	3	18
3. కర్ణాటక	9	4	4	17
4. మహారాష్ట్ర	7	16	9	32
5. మధ్యప్రదేశ్	5	3	3	11
6. తమిళనాడు	4	5	5	14
7. ఢిల్లీ	3	4	2	9
8. హర్యానా	3	3	2	8
9. ఒడిషా	3	0	6	9
10. అరుణాచల్ప్రదేశ్	2	2	2	6
23. తెలంగాణ	0	0	1	1

లేబర్ కోడ్స్ రద్దుకు 5న కార్మిక ప్రదర్శన

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 5వ తేదీన భారీ నిరసన ప్రదర్శన చేపట్టాలని పిలుపునిచ్చాయని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్ తెలిపారు. ఆ పిలుపులో భాగంగా 5వ తేదీన జిల్లాలో పెద్ద ఎత్తున కార్మికులు నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చాలని ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్గా మార్పు చేసిందన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. సంఘం పెట్టుకొని హక్కు, సమ్మె చేసే హక్కు, యజమానులతో జీతభత్యాలు బేరం ఆడే హక్కు వంటివి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ లేబర్ కోడ్స్ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ చేసే మానిటైజేషన్ ఆఫ్ పైప్ లైన్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.9 వేలకు తక్కువ లేకుండా చెల్లించాలని తదితర డిమాండ్లతో దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలన్నీ ఈ ప్రదర్శనకు పిలుపునిచ్చాయని తెలిపారు. విశాఖలో ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరగనున్న నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. అన్ని పరిశ్రమల వద్ద, కార్మికులు పని ప్రదేశాలలోనూ నిరసనలు తెలపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పబ్లిక్ సెక్టర్ కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, మోటార్ ట్రాన్స్పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

ఆదుకున్న ఛండీమాల్

- శ్రీలంక 136/5

గాలే: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్ట్లో శ్రీలంక జట్టును సీనియర్ బ్యాటర్ ఛండీమాల్(63నాటౌట్) అర్ధసెంచరీతో ఆదుకున్నారు. రెండోరోజు మూడు వికెట్లు కోల్పోయిన శ్రీలంక జట్టు.. మూడోరోజైన శుక్రవారం మరో రెండు వికెట్లను మాత్రమే కోల్పోయింది. మూడోరోజు ఆట వెలుతురులేమి కారణంగా 20 ఓవర్లు మాత్రమే సాగింది. కమిందు మెండీస్(15), కెప్టెన్ ధనుంజయ(22) ఔట్ కాగా.. క్రీజ్లో చండీమాల్కి తోడు కుశాల్ మెండీస్(10) ఉన్నారు. ఆస్ట్రేలియా బౌలర్లు స్టార్క్, మాథ్యూకు రెండేసి, లియాన్కు ఒక వికెట్ దక్కాయి. ఆ జట్టు ఇంకా 518పరుగులు వెనుకబడి ఉంది. తొలి ఇన్నింగ్స్లో ఆస్ట్రేలియా జట్టు 6వికెట్ల నష్టానికి 654పరుగుల వద్ద ఇన్నింగ్స్ను డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే.

రసపట్టులో ఆంధ్ర-రాజస్థాన్ రంజీ మ్యాచ్

విశాఖపట్నం: ఆంధ్ర-రాజస్థాన్ జట్ల మధ్య జరుగుతున్న రంజీమ్యాచ్ రసపట్టుగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్లో రాజస్థాన్ జట్టు 258పరుగులు చేయగా.. రెండోరోజైన శుక్రవారం ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్లో 220పరుగులకే కుప్పకూలింది. అనంతరం రెండో ఇన్నింగ్స్లో రాజస్థాన్ను ఆంధ్ర బౌలర్లు కట్టడి చేశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి రాజస్థాన్ జట్టు 7వికెట్ల నష్టానికి 95పరుగులు చేసింది. ఆ జట్టు ఇప్పటికే 133పరుగుల ఆధిక్యతలో నిలువగా.. మూడోరోజు ఆట రసపట్టుగా సాగనుంది. ఆంధ్ర జట్టులో శ్రీకర్ భరత్(52), వంశీకృష్ణ(32) మాత్రమే బ్యాటింగ్లో రాణించారు. ఇక రాజస్థాన్ను కట్టడి చేయడంలో ఆంధ్ర బౌలర్లు పృథ్వీరాజ్(4/34), విజయ్(2/17) సఫలమయ్యారు.



పట్టు బిగిస్తున్న హైదరాబాద్

గ్రూప్-బి మరో రంజీమ్యాచ్లో విదర్భపై హైదరాబాద్ జట్టు పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్లో 326పరుగులు చేసి విదర్భపై తొలి ఇన్నింగ్స్లో 136పరుగుల భారీ ఆధిక్యతను సంపాదించింది. శనివారం రెండోరోజు ఆట ముగిసే సమయానికి విదర్భ జట్టు రెండో ఇన్నింగ్స్లో 2వికెట్ల నష్టానికి 56పరుగులు చేసింది. ఆ జట్టు ఇంకా 80పరుగులు వెనుకబడి ఉంది.

కోహ్లి ఆరు పరుగులకే ఔట్..

ఢిల్లీ తరఫున దేశవాళీలో పునరాగమనం చేసిన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ నిరాశపరిచాడు. రంజీ మ్యాచ్లో రైల్వేస్తో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్లో కేవలం 6 పరుగులు చేసి పెవిలియన్కు వెనుతిరిగాడు. స్వంగ్వాన్ బౌలింగ్లో క్లీన్బౌల్డ్ అయ్యాడు. దీంతో విరాట్ బ్యాటింగ్ చూడ్డానికి వచ్చిన ఫ్యాన్స్ను నిరాశపరిచాడు. ఢిల్లీ వెంటవెంటనే 4 వికెట్లు కోల్పోవడంతో చిక్కుల్లో పడింది. ఆ దశలో కెప్టెన్ ఆయుశ్ బడోని(99), సుమిత్(78) రాణించడంతో ఢిల్లీ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 7వికెట్ల నష్టానికి 334పరుగులు చేసింది. అంతకుముందు రైల్వేస్ జట్టు తొలి ఇన్నింగ్స్లో 241పరుగులకే కుప్పకూలింది.

హాకీ టోర్నమెంట్ నిర్వహణకు కమిటీలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకూ ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తూ కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కలెక్టరేట్లో టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా అంశాల వారీగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసామన్నారు.కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ, సిపిఒ, డిఎస్డిఒలు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, వివిధ ఉప కమిటీల సహకారంతో టోర్నమెంట్ నిర్వహణను పర్యవేక్షిస్తుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ చైర్మన్గా ఆర్డిఒ, ఎడిసి-కెఎంసి, జిల్లా ఉపాధి అధికారి, డిటిసి సభ్యులుగా లాజిస్టిక్ కమిటీ పని చేస్తుందన్నారు. డిటిసి నేతృత్వంలో ట్రాన్స్పోర్ట్, రిసెప్షన్ కమిటీ క్రీడాకారులకు స్వాగతం, రవాణా, బస సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. డిడి-గ్రౌండ్ వాటర్ నేతృత్వంలో రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించి వారికి అవసరమైన ఏర్పాట్ల కోసం మిగిలిన సబ్ కమిటీలకు సూచించాలన్నారు. సివిల్ సప్లయీస్ కార్పొరేషన్-డిఎం నేతృత్వంలో ఫుడ్ కమిటీ క్రీడాకారులకు ఆహార ఏర్పాట్లను, కాకినాడ ఆర్డిఒ నేతృత్వంలోని అకామిడేషన్ కమిటీ క్రీడాకారులకు బస ఏర్పాట్లను, ఎపిసి-సమగ్రశిక్ష నేతత్వంలో టెక్నికల్ కమిటీ పోటీల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలను, డిఎంహెచ్ఒ నేతృత్వంలోని మెడికల్ కమిటీ కీడాకారులకు ప్రథమ చికిత్స, అంబులెన్స్ సేవలను నిర్వహించాలని ఆదేశించారు. టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు సంసిద్ధత తెలిపిన స్పాన్సర్ సంస్థల అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డిఎస్డిఒ బి.శ్రీనివాస కుమార్, జెడ్పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, ఆర్డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఆర్ అండ్ బి ఎస్ఇ జె.కాంతు, డిఎంహెచ్ఒ నరసింహనాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్వార్టర్స్లో ఓడిన శ్రీకాంత్

థాయ్లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

బ్యాంకాక్: థాయ్లాండ్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో కిదాంబి శ్రీకాంత్, సుబ్రహ్మణియన్ పోరాటం క్వార్టర్ఫైనల్లో ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ఫైనల్లో కిదాంబి శ్రీకాంత్ 17-21, 16-21తో 6వ సీడ్ ఝెంగ్ వాంగ్(చైనా) చేతిలో, ప్రపంచ జూనియర్ నంబర్ వన్ ఆటగాడు సుబ్రహ్మణియన్ 21-19, 18-21, 13-21తో చైనాకే చెందిన ఛెంగ్-ఝూ చేతిలో పోరాడి ఓడాడు. ఇక పురుషుల డబుల్స్లో ప్రతీక్-కృష్ణమూర్తి జంట 19-21, 18-21తో 2వ సీడ్ మలేషియా జోడీ చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక మహిళల సింగిల్స్లో సంతోషీ రామ్రాజ్ 21-19, 14-21, 9-21తో ఇండోనేషియాకు చెందిన నితిక్రాజ్ చేతిలో పరాజయాన్ని చవిచూసింది.

విశాఖలో దారుణం.. తల్లిని హతమార్చిన తనయుడు

ప్రజాశక్తి -ములగాడ (విశాఖ)

అదేపనిగా ల్యాప్ట్యాప్లో ఆన్లైన్ గేమ్స్ ఆడుతున్నాడని మందలించిన తల్లిని కత్తితో కొడుకు దారుణంగా చంపిన ఘటన గురువారం రాత్రి విశాఖ జిల్లా మల్కాపురం కోస్టుగార్ట్లో చోటుచేసుకుంది. దీనిపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. మల్కాపురం ఇండియన్ కోస్ట్గార్డులో బల్వీందర్సింగ్ భార్య అల్కాసింగ్ (47), ఇద్దరు కొడుకులు అనిమల్సింగ్, ఆయుష్మాన్సింగ్తో నివాసం ఉంటున్నారు, హైదరాబాదులోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న అనీమల్సింగ్ ఇటీవల ఇంటికి వచ్చాడు. రోజుకు ఆరేడు గంటల పాటు ఆన్లైన్ గేమ్లు ఆడుతున్న కొడుకును మందలించిన తల్లి అనుష్క అల్కాసింగ్, అతని నుంచి ల్యాప్టాప్ను లాక్కొంది. దీంతో ఆగ్రహించిన కొడుకు తల్లిని కత్తితో మెడ, ఒంటిపై పొడిచి హతమార్చాడు, తల్లి ఆల్కాసింగ్ పెద్ద కేకలు వేయటంతో ఇరుగుపొరుగు చూసి కోస్ట్ గార్డ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కోస్ట్గార్డ్ అధికారుల నుంచి సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని దాడికి గురైన అనుష్కను ముందుగా ఐఎన్ఎస్ కళ్యాణి ఆసపత్రికి, అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్కు తరలించారు. మల్కాపురం సిఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్‌పై గ్యాంగ్‌రేప్ కేసులో నలుగురికి 20 ఏళ్ల జైలు

- తమిళనాడు కోర్టు తీర్పు

వెల్లూరు : వైద్యురాలిపై సామూహిక అత్యాచారం కేసులో తమిళనాడు మహిళా కోర్టు సంచలన తీర్పునిచ్చింది. నలుగురు దోషులకు కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.25 వేల జరిమానా విధించింది. 2022 మార్చి 16వ తేదీన తమిళనాడులోని వెల్లూరులో బీహార్‌కు చెందిన వైద్యురాలు, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన తన సహోద్యోగితో కలిసి కాట్పాడిలో సినిమాకి వెళ్లారు. సినిమా అయ్యాక షేర్ ఆటో ఎక్కారు. అప్పటికే ఆ ఆటోలో నలుగురు ఉన్నారు. ఓల్డ్ టౌన్‌లోని చెన్నై – బెంగళూరు హైవేలోని గ్రీన్ సర్కిల్ వద్దకు తీసుకెళ్లేందుకు అంగీకరించిన డ్రైవర్ శ్మశానవాటిక సమీపంలోని నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యురాలితోపాటు ఆమె మిత్రుడిని కొట్టి బెదిరించారు. ఆ తర్వాత ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆమె వద్ద రూ.40వేలతో పాటు బంగారాన్ని లూటీ చేశారు. లేడీ డాక్టర్ కొద్దిరోజులు భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అనంతరం ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తాగిన మత్తులో సామూహిక అత్యాచారం చేసినట్లు అంగీకరించారు. కొద్దిరోజులకు మిగతా నిందితులను సైతం అరెస్టు చేశారు. ఆటో డ్రైవర్ పార్థిబన్, రోజువారీ కూలీ మణి అలియాస్ మణికందన్ (25), అతని స్నేహితులు భరత్ (23), సంతోష్ (22)లను అరెస్టు చేశారు. ఐదో నిందితుడు మైనర్ కావడంతో జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచారు. కేసు విచారించిన వెల్లూరు సెషన్స్ (ఫాస్ట్ ట్రాక్ మహిళా కోర్టు) జడ్జి ఎస్ మహేశ్వరి భానురేఖ ముందు నిందితులను హాజరుపరచగా.. నలుగురు నిందితులను దోషులుగా తేలుస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. రూ.25వేల జరిమానా చెల్లించాలని ఆదేశించారు. అప్పట్లో ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తమిళనాడు అసెంబ్లీని కుదిపేసింది.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి

- మహా కుంభమేళా నుంచి వస్తుండగా ఘటన

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంభమేళా నుంచి వస్తున్న ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోరఖ్‌పూర్‌కు చెందిన కొందరు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో స్నానాలు చేసి.. వారి స్వగ్రామానికి బయలుదేరారు. వారణాసి ఘాజీపూర్ రోడ్డు నంద్‌గంజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల ఉస్మి కలా మలుపు వద్దకు రాగానే వీరి వాహనాన్ని ఓ ట్రక్కు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ వాహనంలో 20 మంది ఉన్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

జూన్‌లోపు మరో 3 పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాల్లో తల్లికి వందనం నిధులు జమచేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే రైతు భరోసా నిధులతో కలిపి అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చెల్లిస్తామన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేలు అందిస్తామన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసిన తరువాత నిరుద్యోగ భృతి, ఆడపిల్ల నిధి, ఉచిత బస్సు ప్రయాణంతోపాటు మిగిలిన హామీలను అమలు చేస్తామని చెప్పారు. అగ్రిగోల్డ్ కంపెనీ భూములను ఆ కంపెనీ బాధితులకు అందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులను జూన్‌లోపు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికీ 80 కార్పొరేషన్ల ఛైర్మన్లు, 48 వేల సాగునీటి సంఘాలను నియమించామని చెప్పారు. స్థానిక సంస్థల్లో బిసిలకు తగ్గిన 10 శాతం రిజర్వేషన్ కోటా పునరుద్ధరణపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మే 27, 28, 29 తేదీల్లో కడపలో మహానాడు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 29న భారీ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో ఇక శనివారం మాత్రమే గ్రీవెన్స్ ఉంటుందని, మిగిలిన రోజుల్లో ఉండదన్నారు. నియోజకవర్గ స్థాయిలోనూ ప్రతి ఎమ్మెల్యే శనివారం గ్రీవెన్స్ నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అక్కడ వచ్చిన సమస్యలను జిల్లా అధికారులు, పార్టీ కార్యాలయం, మంత్రులు, ఇన్‌ఛార్జి మంత్రులకు అందించి పరిష్కరించాలని చెప్పారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు డిఆర్‌సి సమావేశంలో వీటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వంలో తప్పు చేసిన వారిని శిక్షించేందుకు ప్రత్యేక ట్రిబున్యల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విలేకరులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు.రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఊహించని దానికంటే సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేంద్రం ద్వారా రూ.11,400 కోట్ల ప్యాకేజ్ తీసుకొచ్చారని తెలిపారు. నందమూరి బాలకృష్ణతో పాటు తెలుగు రాష్ట్రాల్లో పద్మభూషణ్ అవార్డులు పొందిన వారికి పొలిట్‌బ్యూరో అభినందనలు తెలిపిందన్నారు. పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ 1,0022,905 సభ్యత్వం చేశామని, తెలంగాణలో 1,70,367, అండమాన్‌లో 4,245 సభ్యత్వం చేశామని చెప్పారు.

సవాళ్లకు నీళ్లొదిలిన కేంద్రం

- ట్రంప్ టారిఫ్‌ల ఊసే లేదు
- లెక్కలేని రూపాయి పతనం..
- ఎఐపై విస్మరణ
- మరోవైపు పని గంటల పెంపు
- జిడిపి పెరుగుదలకు చర్యలు శూన్యం
- ఎకనామిక్ సర్వే వెల్లడి



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక స్థితికి అద్దం పట్టే అధికారిక వార్షిక నివేదిక ఎకనామిక్ సర్వేలో అనేక సవాళ్లను మోడీ సర్కార్ విస్మరించింది. అంతర్జాతీయంగా ట్రంప్ టారిఫ్‌ల పెంపు, ఎగుమతుల పతనం, వాణిజ్య లోటు సమస్యలకు పరిష్కారం చూపలేదు. మరోవైపు రికార్డ్ కనిష్టానికి పడిపోయిన రూపాయి విలువపై లెక్కలేని తనంగా వ్యవహరించింది. ఎకనామిక్ సర్వేలో ప్రధానంగా దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలను పొందుపర్చాలి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జరిగిన ప్రధాన మార్పులు, పరిణామాల్ని చెప్పి.. భవిష్యత్తు ప్రణాళికలు ఎలా ఉండాలో మార్గదర్శనం చేయాలి. ప్రధాన రంగాలైన వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి, మౌలిక సదుపాయాలు, ఎగుమతి దిగుమతులు, విదేశీ మారక నిల్వలు, నగదు చలామణి, ఉద్యోగాలు, ధరల పెరుగుదల వంటి అంశాలను కూడా వివరిస్తుంది. విదేశీ భౌగోళిక, ఆర్థిక పరిణామాల ప్రభావం, ప్రభుత్వ విధాన నిర్ణయాలను విశ్లేషించాలి. దీని ఆధారంగానే ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరుగుతుంటుంది. దీనికి భిన్నంగా దిశానిర్దేశం లేని ఎకనామిక్ సర్వేను బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో అనేక సవాళ్లు, పరిష్కారాలకు నీళ్లు వదిలేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో జిడిపి 6.4 శాతానికి పడిపోయి.. నాలుగేళ్ల కనిష్టానికి చేరొచ్చని అంచనా వేసిన ఆర్థిక సర్వే.. వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించలేదు.

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత భారత్‌పై సుంకాలను పెంచుతామని బహిరంగంగా ప్రకటించారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ స్థాయిలో 87కి చేరువలో పతనమయ్యింది. ఎగుమతులు పతనం అవుతున్నాయి. వాణిజ్య లోటు పెరుగుతోంది. అనేక రంగాలు మౌలిక వసతుల సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అసంఘటిత రంగం కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల, మందగిస్తున్న పరిశ్రమల వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించే మార్గాలను ఆర్థిక సర్వే గట్టున పెట్టేసింది. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రానున్న రోజుల్లో తీసుకోవాల్సిన చర్యల్ని విస్మరించింది. అమెరికా, చైనా లాంటి దేశాలు కృత్రిమ మేధ (ఎఐ)లో పోటీ పడుతూ.. ఈ రంగంలో దూసుకుపోతుండగా.. టెక్నాలజీలో అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులున్న భారత్ వెనుకబాటుపై వివరణ ఇవ్వలేదు. దేశం మెరుగైన వృద్ధి రేటును సాధించకుండా నిరుద్యోగం తగ్గిందని ఎకనామిక్ సర్వేలో ప్రకటన చేయడం నిపుణులను విస్మయానికి గురి చేస్తోంది.

రోజుకు 10 గంటల పని..!

ఎకనామిక సర్వేలో కార్మిక వ్యతిరేక విధానాలు కొట్టిచ్చినట్లు కనబడ్డాయి. ఇటీవల పని గంటలపై తీవ్ర చర్చ జరుగుతోంది. టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణ మూర్తి వారానికి 70 గంటలు పని చేయాలని తొలుత కొత్త పాట అందుకోగా.. దీనికి కొనసాగింపుగా... ఎల్అండ్‌టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఏకంగా 90 గంటల పని చేయాలని.. అంటే రోజుకు 12 గంటలు శ్రమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నయా బానిస విధానంపై తీవ్ర చర్చ జరిగుతున్న వేళ కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఓ కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. వారానికి 60 గంటల వరకూ పని విధానం పర్వాలేదంటూ కొత్త పాట అందుకుంది. అంటే వారంలో ఒక్క రోజు సెలవు పోయినా.. మిగితా దినాల్లో రోజుకు సగటున 10 గంటల పని చేయాలని ప్రతిపాదించినట్లయ్యింది. కార్మిక చట్టాల ప్రకారం.. వారానికి 48 గంటలు పని మించకూడదు. కాగా.. వారానికి 60 గంటలకు మించి పని చేస్తేనే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఎకనామిక్ సర్వే పేర్కొంది. రోజుకు 12 గంటలు పని చేయడం ద్వారా అనారోగ్యం పాలవుతారని తెలిపింది. వారానికి ఎక్కువ గంటలు పని చేయడం ఆరోగ్యానికి హానికరం అంటూనే 60 గంటల పని విధానాన్ని ప్రతిపాదించడం కార్పొరేట్ శక్తుల మెప్పు పొందేందుకేనని పలువురు విమర్శిస్తున్నారు.

ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేల రాజీనామా

న్యూఢిల్లీ : మరో నాలుగు రోజుల్లోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సమయంలో ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. వారిలో కొంతమంది తమ రాజీనామా లేఖలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కస్తూర్బానగర్ నియోజకవర్గం మదన్ లాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తనతో పాటు మరో ఆరుగురు ఎమ్మెల్యేలు ఆప్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.



ఎన్నికల కమిషన్ విచారణకు వెళ్లే ముందు మీడియాతో మాట్లాడుతున్న కేజ్రీవాల్

తమ రాజీనామా లేఖలను ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయెల్‌కు పంపినట్లు తెలిపారు. రాజీనామా చేసిన ఎమ్మెల్యేల్లో భావ్నా గౌడ్ (పాలం), నరేష్ యాదవ్ (మెహ్రౌలి), రోహిత్ మెహ్రౌలియా (త్రిలోక్‌పూరి), పవన్ శర్మ (ఆదర్శ నగర్), రాజేశ్ రిషి (జనక్‌పురి), బిఎస్ జూన్ (బిజ్వాసన్) ఉన్నారు. వీరికి టిక్కెట్లు ఇవ్వడానికి ఆప్ నిరాకరించడంతో ఇతర పార్టీలతో టచ్‌లో ఉన్నారని ఆప్ నాయకులు విమర్శించారు.

ఎన్నికల కమిషన్ ఎదుట కేజ్రీవాల్ హాజరు

ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల కమిషన్ ఎదుట శుక్రవారం హాజరయ్యారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి ఆయన వెంట ఉన్నారు. హర్యానా ప్రభుత్వం యమునా నదిలోకి విషపూరిత నీటిని విడుదల చేస్తోందంటూ చేసిన వ్యాఖ్యలపై ఆయనకు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలో నీటి సంక్షోభాన్ని నివారించేందుకు గళం విప్పానని, అందుకే తనకు ఇసి నోటీసులు పంపిందని కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంజాబ్‌లో రోడ్డు ప్రమాదం

- తొమ్మిది మంది మృతి

ఫిరోజ్‌పూర్ : ఒక ట్రక్కు – వ్యాన్ ఢీకొనడంతో తొమ్మిదిమంది మరణించగా, మరో తొమ్మిది మంది గాయపడిన ఘటన పంజాబ్‌లో శుక్రవారం జరిగింది. ఫిరోజ్‌పూర్ జిల్లా గురుహర్సహై సబ్ డివిజన్‌లోని ఒక గ్రామానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో దట్టంగా అలముకున్న పొగ మంచు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు వెల్లడైందని జిల్లా సీనియర్ ఎస్‌పి సౌమ్య మిశ్రా తెలిపారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. గాయపడిన తొమ్మిది మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రమాదం సమయంలో వ్యాన్‌లో 20 మందికి పైగా ఉన్నారని, వీరిలో ఎక్కువ మంది వెయిటర్లుగా పనిచేస్తున్నారని చెప్పారు. జలాలాబాద్‌లో ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు.

ఒక్కో మైగ్రెంట్‌కు 4675 డాలర్ల ఖర్చు!

- ఫస్ట్ క్లాస్ టికెట్ కన్నా అధికం !
- గ్వాటెమాలాకు తరలింపు ప్రక్రియపై డేటా వెల్లడి



గ్వాటెమాలా సిటీ : చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారిని బలవంతంగా వారి స్వదేశాలకు పంపించే ప్రక్రియ గత వారం రోజుల నుండి శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు లాటిన్ అమెరికా దేశాలకు ఆరు విమానాలను పంపించారు. వీటిలో అమెరికాకు రెండు కార్గో విమానాలను తమ దేశంలో దిగేందుకు కొలంబియా నిరాకరించింది. ట్రంప్‌తో ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో మైగ్రెంట్లను తీసుకొచ్చేందుకు తమ స్వంత విమానాలనే పంపించింది. మిగిలిన నాలుగు విమానాలు గ్వాటెమాలా లోనే దిగాయి. ఇందులో భాగంగా గ్వాటెమాలాకు వెళుతున్న మిలటరీ విమానంలో ఒక్కో మైగ్రెంట్‌కు 4675 డాలర్లు ఖర్చవుతోంది. టెక్సాస్‌లోని ఎల్‌పాసో నుండి అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన విమానంలో గ్వాటెమాలాకు వెళ్లాలంటే అయ్యే ఫస్ట్ క్లాస్ టిక్కెట్ కన్నా ఇది ఐదు రెట్లకు మించి అధికమని అమెరికా, గ్వాటెమాలా అధికారులు అందజేసిన డేటా పేర్కొంటోంది. ఫస్ట్ క్లాస్ టికెట్ ధర 853 డాలర్లుగా వుంది. పైగా అమెరికా ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కి చెందిన కమర్షియల్‌చార్టర్ విమానానికి అయ్యే ఖర్చు కన్నా కూడా ఇది చాలా ఎక్కువ. సి-17 సైనిక రవాణా విమానానికి గంటకు 28,500 డాలర్లు నిర్వహణా వ్యయం అవుతుందని పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా అధికారి ఒకరు వెల్లడించారు. గ్వాటెమాలాకు వెళ్లి రావడానికి పదిన్నర గంటలు పడుతుంది. విమానాశ్రయంలో ఆగిన సమయాన్ని, లేదా టేకాఫ్ ఆపరేషన్స్‌కు పట్టే సమయాన్ని ఇందులో కలపలేదని ఆ అధికారి తెలిపారు. 64మందితో సోమవారం సైనిక రవాణా విమానం ఒకటి ఇక్కడకు వచ్చిందని గ్వాటెమాలా అధికారి తెలిపారు.

బానిసల పిల్లల కోసం తెచ్చారు.. జన్మత: పౌరసత్వంపై ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్ : బానిసల పిల్లల కోసం ఉద్దేశించి జన్మత: పౌరసత్వం తీసుకువచ్చారని, కానీ ప్రపంచమంతా ఇక్కడకు వచ్చి పోగుపడేందుకు కాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన రోజే జన్మత: పౌరసత్వాన్ని వ్యతిరేకిస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ 22 రాష్ట్రాల్లో ఐదు కేసులు నమోదయ్యాయి. ఆ మరుసటి రోజే సియాటెల్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ ఉత్తర్వులను కొట్టివేసింది. దీనిపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ట్రంప్ చెప్పారు. "జన్మత:పౌరసత్వం చట్టాన్ని బానిసల పిల్లల కోసం ఆనాడు తెచ్చారని అన్నారు.. అంతేకానీ ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన జనం అమెరికాకు వచ్చి ఇక్కడ ఆక్రమించడానికి కాదని అన్నారు.

సిరియా తాత్కాలిక అధ్యక్షులుగా అహ్మద్ అల్ షరా



డమాస్కస్ : సిరియా తాత్కాలిక అధ్యక్షులుగా అహ్మద్ అల్ షరా ఎంపికయ్యారు. సిరియా రాజధాని డమాస్కస్‌లో తిరుగుబాటు గ్రూపుల మధ్య జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. తిరుగుబాటు గ్రూపు హయత్ తహ్రీర్ అల్ షామ్ అధ్యక్షుడిగా షరా పనిచేస్తున్నారు. ఈ గ్రూపు గతంలో అల్‌ఖైదాకు అనుబంధ గ్రూపుగా ఉండేది. ప్రస్తుతం తమకు అల్‌ఖైదాతో సంబంధాలు లేవని షరా చెబుతున్నారు. షరాపై అమెరికా గతంలో 10 మిలియన్ డాలర్ల బహుమతిని ప్రకటించింది. గత నెలలో అమెరికా ప్రతినిధి బృందం సిరియాలో పర్యటించిన తరువాత ఆ బహుమతిని రద్దు చేసింది. గత ఏడాదిలో తిరుబాటు దళాలు దాడి చేయడంతో అధ్యక్షుడు బషర్ అల్ అసద్ ప్రభుత్వం కూలిపోయింది. అసద్ ప్రస్తుతం రష్యా ఆశ్రయంలో ఉన్నారు.

త్వరలోనే తహవ్వూర్ రానా అప్పగింత

న్యూఢిల్లీ : ముంబయి ఉగ్రదాడి నిందితుడు తహవ్వూర్ రాణా అప్పగింత త్వరలో పూర్తవుతుందని భారత్ శుక్రవారం వెల్లడించింది. రానాను త్వరగా తీసుకొచ్చేందుకు అమెరికా అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. త్వరగా భారత్‌కు అప్పగించేందుకు అమెరికా అధికారులతో విధానపరమైన అంశాలపై కలిసి పనిచేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు. భారత్‌కు తనను అప్పగించడంపై పున:పరిశీలన జరపాలని కోరుతూ రాణా వేసిన రివ్యూ పిటీషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు జనవరి 21న తిరస్కరించిన సంగతి తెలిసిందే.

హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయిల్ దాడులు

- కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారని లెబనాన్ ఆగ్రహం
- నేడు ముగ్గురు బందీలు, 90మంది ఖైదీల విడుదల

గాజా, బీరుట్ : సిరియా-లెబనాన్ సరిహద్దు పొడవునా బెకా వ్యాలీలో హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని గురువారం రాత్రంతా దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ మిలటరీ శుక్రవారం ప్రకటించింది. ఈ లక్ష్యాల్లో భూగర్భంలో ఆయుధాల అభివృద్ధికి ఉపయోగించే కేంద్రం, లెబనాన్‌లోకి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసే స్థావరం వున్నాయని ఆర్మీ తెలిపింది. గురువారం హిజ్బుల్లా ప్రయోగించిన నిఘా డ్రోన్‌ను తాము అడ్డుకున్నామని, ఇది, ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఇజ్రాయిల్ పేర్కొంది. నవంబరు చివరిలో హిజ్బుల్లా, ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. తొలుత జనవరి 26వరకే ఈ ఒప్పందం అమల్లో వుంటుందని ప్రకటించినా తర్వాత ఫిబ్రవరి 18వరకు పొడిగించారు. అప్పటి వరకు ఈ ఒప్పందం అమలవుతుందని అమెరికా కూడా గత ఆదివారం ధ్రువీకరించింది. ఆలోగా ఇజ్రాయిల్ బలగాలు లెబనాన్ నుండి ఉపసంహరించాల్సిందేనని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్, ఈజిప్ట్ విదేశాంగ మంత్రి బాదర్‌కు స్పష్టం చేశారు. ఎలాంటి జాప్యాన్ని సహించేది లేదని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించినప్పటి నుండి లెబనాన్ గడ్డపై ఇజ్రాయిల్ పలు దాడులు జరిపింది. వందమందికి పైగా గాయపడ్డారు.

ముగ్గురు బందీల విడుదల : హమాస్

ముగ్గురు బందీలను గాజాలో శనివారం విడుదల చేయనున్నట్లు హమాస్ సాయుధ విభాగమైన ఖసమ్ బ్రిగేడ్స్ వెల్లడించింది. జైళ్లలో ఉన్న 90మంది పాలస్తీనియన్లను విడుదల చేయనున్నట్లు ఇజ్రాయిల్ ప్రకటించిందని పాలస్తీనా ఖైదీల మీడియా కార్యాలయం తెలిపింది. వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థ శిబిరంపై జరిగిన దాడిలో మరో ఇద్దరిని ఇజ్రాయిల్ బలగాలు కాల్చిచంపాయి. గాజా తీరంలో ఇజ్రాయిల్ గన్‌బోట్‌ల వల్ల ఒక జాలరి కూడా మరణించాడు. గురువారం విడుదలైన ఐదుగురు థాయి జాతీయులు పూర్తి ఆరోగ్యంతో వున్నారని ఇజ్రాయిల్ డాక్టర్లు వెల్లడించారు. హమాస్ బందించిన వారిలో మొత్తంగా 31మంది థాయి జాతీయులు వున్నారు. థాయి బందీలను విడుదల చేసేటప్పుడు డజన్ల సంఖ్యలో ఇజ్రాయిల్ డాక్టర్లు, నర్సులు, ఇజ్రాయిల్ ప్రతినిధులు ఇజ్రాయిల్, థాయిలాండ్ పతాకాలను ఊపుతూ, పాటలు పాడుతూ హర్షం వ్యక్తం చేశారు.

సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి ఎన్నిక



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి తిరిగి ఎన్నికయ్యారు. 60 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. వారిలో 14 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం ఎన్నికైంది. త్రిపుర రాజధాని అగర్తలాలో మూడు రోజులపాటు జరిగిన సిపిఎం త్రిపుర రాష్ట్ర 24వ మహాసభ శుక్రవారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్‌కరత్, మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, అశోక్ ధావలే, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై 45 మంది ప్రతినిధులు చర్చించారు. అనంతరం మహాసభ ఏకగ్రీవంగా నివేదికను ఆమోదించింది. నూతన రాష్ట్ర కమిటీని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి తిరిగి ఎన్నికయ్యారు. 60 మందితో రాష్ట్ర నూతన కమిటీ, 14 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం ఎన్నికైంది. పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని, బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది.

సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో నిందితుడికి ముఖ నిర్ధారణ పరీక్ష

ముంబయి : బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో నిందితుడు మహమ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌కు ముఖ నిర్ధారణ పరీక్ష నిర్వహించారు. ఈ విషయాన్ని ముంబయి పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఈ పరీక్షల్లో సానుకూల ఫలితం వచ్చిందని, సిసిటివి ఫుటేజ్‌లో కనిపించిన వ్యక్తి షెహజాద్ అని నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించడంలో ముఖ గుర్తింపు సాంకేతికత కీలక పాత్ర పోషించిందని ఒక అధికారి తెలిపారు. ఈ కేసులో షెహజాద్‌ను అక్రమంగా ఇరికించారనే ఆరోపణలు నిజం కాదని నిర్ధారణ అయిందని చెప్పారు. జనవరి 16 తెల్లవారుజామున ముంబయిలోని నివాసంలో సైఫ్‌పై దాడి జరిగింది. మూడు రోజుల తరువాత థానేలో షెహజాద్‌ను అరెస్టు చేశారు.

గోమాలో క్షీణించిన శాంతిభద్రతలు

- ఆహార దుకాణాలు, గిడ్డంగుల్లో లూటీలు
- చొచ్చుకొస్తున్న రెబల్స్
- సైన్యంలో చేరండి : యువతకు కాంగో అధ్యక్షుడి పిలుపు

గోమా (కాంగో) : కాంగో నగరమైన గోమాలో శాంతి భద్రతల పరిస్థితులు దిగజారాయి. ఆ నగరంపై పట్టు సాధించేందుకు రెబెల్స్ ముందుకు చొచ్చుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆహార దుకాణాలు, గోదాముల్లో విచ్చలవిడిగా లూటీలు, దాడులు జరిగాయని ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆహార కార్యక్రమం (యుఎన్‌డబ్ల్యుఎఫ్‌పి) పేర్కొంది. తీవ్రమైన సమయాలు తీవ్రమైన చర్యలకు పిలుపునిస్తాయని, దీనివల్ల హింస పునరావృతమవుతుందని ఆహార కార్యక్రమం కో-ఆర్డినేటర్ సింథియా వ్యాఖ్యానించారు. దేశంలోని తూర్పు ప్రాంతంలో మరింత భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న రెబెల్స్‌తో పోరాడేందుకు పెద్ద ఎత్తున సైనిక సమీకరణ జరగాలని అధ్యక్షుడు ఫెలిక్స్ త్సిషెకెది పిలుపునిచ్చారు. ఆ మరుసటి రోజే గోమాలో భద్రతా పరిస్థితులు దిగజారిన వార్తలు వెలువడ్డాయి. తూర్పు కాంగోలో అతిపెద్ద నగరమైన గోమాలో రెబెల్స్ ముందుకు చొచ్చుకు వస్తున్న పరిస్థితుల్లో అధ్యక్షుడు బుధవారం పొద్దుపోయిన తర్వాత ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. గురువారం గోమాలో చాలా ప్రాంతాల్లో విద్యుత్ లేదు. పైగా చాలా భాగాన్ని రెబెల్స్ ఆక్రమించుకోవడంతో పరిస్థితులు దారుణంగా మారాయి. చాలా చోట్ల తుపాకుల ధ్వనులు, పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. వీధుల్లో అనేక మృతదేహాలు పడివుండడం కనిపిస్తోంది. అవి ప్రభుత్వ సైనికులవేనని వార్తలు వెలువడుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో యువత చైతన్యవంతంగా వ్యవహరించాలని, సైన్యంలో పెద్ద సంఖ్యలో చేరాలని, వారే దేశాన్ని కాపాడే శక్తి అని అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

ఇరాన్‌లో ముగ్గురు భారతీయులు అదృశ్యం

న్యూఢిల్లీ : ఇరాన్‌లో ముగ్గురు భారతీయులు అదృశ్యమైన ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ ప్రభుత్వం వద్ద ఈ విషయాన్ని లేవనెత్తినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం వద్ద, టెహ్రాన్‌లోని ఇరాన్ ప్రభుత్వం వద్ద ప్రస్తావించినట్లు చెప్పారు. ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, అదృశ్యమైన భారతీయుల గుర్తింపు, భద్రత కోసం సహాయాన్ని అభ్యర్థించినట్లు తెలిపారు.

డాలరును మారిస్తే తీవ్ర పర్యవసానాలు

- బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ : అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రధాన వినిమయ కరెన్సీగా డాలర్ పాత్రను మార్చాలన్న ఆలోచనలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్రిక్స్ దేశాలనుద్దేశించి మరోసారి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. డాలరు రహిత వాణిజ్యానికి యత్నిస్తే, బ్రిక్స్ దేశాల ఎగుమతులపై వంద శాతం సుంకాలు విధిస్తామని మరోసారి బెదిరించారు. కొత్త బ్రిక్స్ కరెన్సీని సృష్టించబోమని లేదా డాలరు స్థానంలో మరే ఇతర కరెన్సీని బలపరచబోమని ఆ దేశాలు హామీ ఇవ్వాల్సి వుంటుందని అన్నారు. లేనిపక్షంలో వారిపై వంద శాతం టారిఫ్‌లు విధిస్తామని, అమెరికా ఆర్థిక వ్యవస్థలో విక్రయాలకు ఇక గుడ్‌బై చెప్పాల్సి వస్తుందని హూంకరించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

అనిశ్చితి ఉన్నా ఆర్థిక సుస్థిరత

(మొదటిపేజీ తరువాయి)

ఆసాంతం కొత్తదనం ఏమీ లేదు. అదే ప్రసంగం.. అవే వ్యాఖ్యలు. ప్రసంగమంతా ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. అదే సమయంలో దేశంలో నెలకొన్న కీలక అంశాలను కూడా విస్మరించారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర కోసం సుదీర్ఘ కాలంగా సాగిస్తున్న పంజాబ్ రైతుల పోరాటాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. మహా కుంభమేళాలో తొక్కిసలాట మరణాలను కూడా విస్మరించారు. రాష్ట్రపతి ప్రసంగం పేలవంగా ఉందని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి

అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు పార్లమెంట్ ఉభయ సభలు నివాళులు అర్పించాయి. ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనలోని మృతులకు ఉభయ సభల సభ్యులు నివాళులర్పించారు.

పేలవంగా రాష్ట్రపతి ప్రసంగం : సోనియాగాంధీ

రాష్ట్రపతి ప్రసంగం పేలవంగా ఉందని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. దీనిపై వివాదం చెలరేగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంపై స్పందించాలని సోనియా గాంధీని మీడియా ప్రతినిధులు అడిగారు. 'రాష్ట్రపతి చివరి వరకు చాలా అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయారు. పేలవంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంపై స్పందించారు. తన తల్లి వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. 'బోరింగ్.. నో కామెంట్స్.. అదే విషయాన్ని మళ్లీ మళ్లీ చెబుతున్నారా?' అంటూ సోనియాగాంధీ మాటల భావాన్ని ప్రస్తావించారు.

సోనియా వ్యాఖ్యలను తప్పుబట్టిన రాష్ట్రపతి భవన్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు సమావేశాలను ఉద్దేశించి చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలని బిజెపి డిమాండ్ చేసింది. ఆ తరువాత కొద్ది సేపటికే రాష్ట్రపతి భవన్ సైతం ఒక ప్రకటన విడుదల చేసింది. సోనియా గాంధీ వ్యాఖ్యలను తప్పుపట్టింది. అత్యున్నత పదవిలో ఉన్నవారి హోదాను కించపరిచేలా ఉన్నాయని పేర్కొంది. 'ప్రసంగం చివరికి వచ్చేసరికి రాష్ట్రపతి అలసిపోయారని, మాట్లాడలేకపోయారని కొందరు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. చాలా స్పష్టంగా దేశ అత్యున్నత కార్యాలయం హోదాను తగ్గించేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయి. వారి మాటల్లో ఎంతమాత్రం వాస్తవం లేదు. ప్రసంగం చివరి వరకూ రాష్ట్రపతి ఎక్కడా అలసిపోలేదు. నిజానికి అణగారిన తరగతులు, మహిళలు, రైతుల గురించి మాట్లాడేటప్పుడు ఎలాంటి అలసటను దగ్గరకు రానివ్వరాదని రాష్ట్రపతి బలంగా నమ్ముతారు' అని రాష్ట్రపతి భవన్ పేర్కొంది. బహుశా హిందీ వంటి భారతీయ భాషల్లో ప్రసంగాలు, నుడికారాల గురించి పరిచయం లేకపోవడం వల్ల కాంగ్రెస్ నాయకులు దానిని సరిగ్గా అర్థం చేసుకుని ఉండకపోవచ్చని అభిప్రాయపడింది.

రమ్య హత్య కేసు నిందితుడికి తప్పిన ఉరిశిక్ష

- 20 ఏళ్లు కఠిన కారాగార శిక్షగా హైకోర్టు మార్పు

ప్రజాశక్తి-అమరావతి

గుంటూరులో పట్టపగలు బిటెక్ విద్యార్థిని నల్లపు రమ్య హత్య కేసులో ఉరిశిక్ష పడిన కుంచాల శశికృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. రమ్య హత్య కేసులో తనను నిర్దోషిగా ప్రకటించాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. అయితే, ఉరిశిక్షను రద్దు చేసి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించింది. ఈ కాలంలో క్షమాభిక్షకు శశికృష్ణ అర్హుడు కాదంది. ఈ మేరకు జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి, జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డితో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు చెప్పింది. వృత్తి రీత్యా మెకానిక్ అయిన గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరుకు చెందిన శశికృష్ణ ప్రేమ పేరుతో బిటెక్ విద్యార్థిని నల్లపు రమ్య వెంటపడి వేధించేవాడు. ప్రేమ ప్రతిపాదనను రమ్య తిరస్కరించడంతో 2021 ఆగస్టు 15న శశికృష్ణ ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు. స్పెషల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 2002 ఏప్రిల్ 29న శశికృష్ణకు ఉరిశిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. శశికృష్ణకు ఎలాంటి నేర చరిత్ర లేదని, అతని తల్లిదండ్రులు నిరక్షరాస్యులే కాకుండా వృద్ధులనే విషయాలను పరిగణనలోకి తీసుకుని ఉరిశిక్షకు బదులుగా 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తున్నామని తీర్పులో పేర్కొంది.

90 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు చెల్లదు

- హైకోర్టు కీలక తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

కాంట్రాక్టు గడువు పూర్తయ్యిందంటూ సుమారు 90 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు గుంటూరు, కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల సూపరింటెండెంట్లు ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును హైకోర్టు రద్దు చేసింది. ఏకపక్షంగా తొలగింపు చెల్లదని తేల్చింది. ఎపి కార్పొరేషన్ ఆఫ్ అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్)లో ఏ హోదాలో పనిచేస్తున్నారో అదే హోదాలో వారిని కొనసాగించాలంది. తిరిగి విధుల్లోకి చేర్చుకున్నప్పటి నుంచి జీతం, ఇపిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ వంటివి చెల్లించాలంది. తొలగించిన తేదీ నుంచి తిరిగి చేరే మధ్యకాలంలో పిటిషనర్లు జీతభత్యాలను కోరడానికి వీల్లేదంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె మన్మథరావు తీర్పు చెప్పారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎలక్ట్రిషియన్లు, బార్బర్లు, లిఫ్ట్ ఆపరేటర్లు, కార్పెంటర్లు వంటి విధులను నిర్వహించే వారిని తొలగిస్తూ ఆ ఆస్పత్రులు సూపరింటెండెంట్లు 2021లో ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేసిన కేసులో తీర్పు చెప్పారు.

దొంగ నోట్ల కోసం కక్కుర్తి

- రూ.15 లక్షలు హుష్‌కాకి..

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

ఇచ్చిన డబ్బుకు రెట్టింపు దొంగనోట్లు ఇస్తామని చెప్పడంతో వాటిపై ఆశపడిన వారు రూ.15 లక్షలు పోగొట్టుకున్న సంఘటన గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలో శుక్రవారం వెలుగుచూసింది. మంగళగిరి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన దొంగనోట్ల ముఠాకు చెందిన ఖాదర్ వలీ, నాగుర్ వలిలకు చిత్తూరు జిల్లా తిరుచానూరుకు చెందిన పగడాల జ్యోతి, వెంకటాచలం విశ్వనాథ్‌తో పరిచయమయ్యారు. ఈ క్రమంలో నకిలీ నోట్ల గురించి చెప్పారు. ఎవరైనా రూ.15 లక్షలు ఇస్తే బదులుగా రూ.30 లక్షల దొంగనోట్లు ఇస్తామని ఆశ చూపారు. వాటి కోసం ఆశపడ్డ జ్యోతి, విశ్వనాథం అందుకు అంగీకరించారు. గురువారం రాత్రి 10.30 గంటలకు మంగళగిరి మండలం కాజా టోల్‌ప్లాజా వద్దకు డబ్బుతో వస్తే నకిలీ డబ్బులు ఇస్తామని చెప్పారు. టోల్‌ప్లాజా వద్ద జ్యోతి, విశ్వనాథం తెచ్చిన అసలు నగదును బ్యాగును తీసుకుని బదులుగా నకిలీనోట్లు ఉన్న సూట్ కేసు ఇచ్చారు. అంతలోనే పోలీసులు వస్తున్నారని చెప్పి హడావిడి చేసి వారిని అక్కడి నుంచి పంపించేశారు. కొద్ది సేపటి తరువాత డబ్బులు చూసి జ్యోతి, విశ్వనాథం షాకయ్యారు. సూట్‌కేసులో ఉన్నవన్నీ తెల్ల కాగితాలని తెలుసుకుని మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డబ్బుతో పరారైన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందంతో గాలిస్తున్నట్లు ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు.

పొగాకు గిట్టుబాటు కోసం రోడ్డెక్కిన రైతులు

- కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా
- దిగొచ్చిన అలయన్స్ యాజమాన్యం
- పొగాకు రైతుకు న్యాయం చేస్తామని హామీ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



ఎపి రైతు సంఘం ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న జి.రామకృష్ణ

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామం సమీపంలోని పొగాకు అలయన్స్ కంపెనీ వద్ద రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేంతవరకు కొనుగోలు నిలిపివేయాలని ఆందోళనకు దిగారు. వెంటనే అక్కడికి కంపెనీ యాజమాన్య ప్రతినిధులు వచ్చి రైతు సంఘం నాయకులతో చర్చలు జరిపారు. రైతులకు క్వింటాలుకు రూ.15 వేల నుండి రూ18 వేల వరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ కోరారు. అంతకంటే తక్కువకు కొంటే నిలిపివేస్తామని హెచ్చరించారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రైతులకు రాకపోవడం బాధాకరమన్నారు. రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధర ఇస్తేనే కొనుగోలు చేయాలని, లేకపోతే నిలిపివేయాలని పట్టుబట్టారు. దీంతో అక్కడే ఉన్న యాజమాన్య ప్రతినిధులు రైతు సంఘం డిమాండ్లకు అంగీకరిస్తూ తప్పనిసరిగా గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పొగాకు రైతులు ఆందోళన విరమించారు.

అంతకు ముందు ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్ మధుసూదన్ అధ్యక్షత జరిగిన ధర్నాలో జి రామకృష్ణ మాట్లాడారు. ఓర్వకల్లు మండలంలో ఈ ఏడాది వేలాది ఎకరాలలో పొగాకు సాగైందన్నారు. పంట చేతికొచ్చాక రైతులకు పొగాకు కంపెనీల యాజమాన్యం వివిధ రకాల పేర్లతో నల్లగా ఉందని, తేమ ఎక్కువగా ఉందని చెబుతూ అటువంటి వాటిని 'రీ' బెయిల్ చేసి లేదా నామమాత్రమైన రేటు కల్పిస్తున్నారని అన్నారు. రూ 7 వేల నుండి రూ.10 వేల వరకు, బాగా ఉన్న పొగాకు కు రూ.10 వేల నుండి రూ.15500 మాత్రమే ధర కల్పిస్తున్నారన్నారు. గతేడాది పొగాకు కంపెనీలు పొగాకు సాగుచేస్తే లక్షలాది రూపాయలు ఆదాయం వస్తుందని నమ్మబలికి క్వింటాలుకు రూ.16 నుండి రూ.18 వేలు ఇస్తామని అగ్రిమెంట్ చేసుకునారన్నారు. రైతులు , కౌలు రైతులు ఎకరాకు రూ.80 వేల నుండి రూ.లక్ష వరకు ఖర్చుపెట్టి పొగాకు సాగు చేశారన్నారు. దిగుబడి ఎకరాకు ఎనిమిది నుండి 10 క్వింటాళ్లు వస్తోందన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న, సిఐటియు మండల అధ్యక్షుడు షాజహాన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మల్లేష్‌లు మాట్లాడారు. రైతు గిడ్డయ్య, దస్తగిరి, దానమయ్య, సిద్దయ్య, సంజీవ, బషీర్ ,మాసుంబాష, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు 600 మందితో సైబర్ కమాండోస్ విభాగం

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సైబర్ నేరాల నియంత్రణ కోసం 600 మందితో సైబర్ కమాండోస్ విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఇందులో విధులు నిర్వహించేందుకు ఎంపిక చేసిన సిబ్బందికి ఐఐటిలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. మంగళగిరిలోని డిజిపి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి జిల్లాకూ ఒక సైబర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సోషల్ మీడియా కేసులు, సైబర్ క్రైమ్ నియంత్రణ కోసం కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. తనపై నమ్మకం ఉంచి డిజిపిగా బాధ్యతలు అప్పజెప్పిన సిఎం చంద్రబాబుకు ధన్యావాధాలు తెలిపారు. విజన్-2047 కోసం పోలీస్‌శాఖ సహకరిస్తుందన్నారు. సిసిటివి కెమెరాలను పెంచడంతోపాటు నేరపూరిత ప్రదేశాల్లో నేరస్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపడతామని, నార్కోటిక్స్ విభాగాన్ని బలోపేతం చేస్తామని వెల్లడించారు. పోలీస్ వెల్ఫేర్‌తో పాటు పోలీస్‌శాఖలో ప్రమోషన్స్ త్వరితగతిన వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు.'కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్'పై దృష్టి పెట్టాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సిఎం చంద్రబాబును హరీష్‌కుమార్ గుప్తా మర్యాద పూర్వకంగా కలిశారు.



బాధ్యతలు చేపడుతున్న హరీష్‌కుమార్ గుప్తా

హెడ్ కానిస్టేబుల్ నాగరాజును మర్చిపోలేను : ద్వారకా తిరుమలరావు

తనకు ట్రైనింగ్‌లో ప్రోత్సాహాన్ని అందించిన హెడ్ కానిస్టేబుల్ నాగరాజును మరచిపోలేనని, తనకు అన్ని విషయాల్లో సహకరించిన తన సతీమణికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డిజిపిగా పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని ఎపిఎస్‌పి 6వ బెటాలియన్ పరేడ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 35 ఏళ్లపాటు యూనిఫామ్ వేసుకుని ఇప్పుడు వదిలిపెట్టడం చాలా బాధగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, ఎపిఎస్‌పి 6వ బెటాలియన్ ఐజి పి రాజకుమారి, పలువురు ఎస్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును టిడిపి, జనసేన వ్యతిరేకించాలి

- ఆవాజ్ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) సిద్ధం చేస్తుండడం శోచనీయమని ఆవాజ్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిస్తీ ఒక ప్రకటన విడుదల చేశారు. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సందర్భంలో టిడిపి, జనసేన పార్టీలు స్పష్టంగా వ్యతిరేకించాలని, ఊగిసలాట ధోరణిని విడనాడాలన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నియమించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్షాల అభ్యర్థనలను చెత్త బుట్టలో వేసి ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల సవరణలను ఆమోదిస్తూ ప్రజాస్వామ్యానికి కొత్త వక్రభాష్యం చెప్పిన జెపిసి ఛైర్మన్ వ్యవహార శైలిని దేశ వ్యాప్తంగా అందరూ నిశితంగా గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఈ బిల్లును వైసిపి వ్యతిరేకించిందన్నారు.



శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు

అనంతలో ప్రయివేటు విద్యాసంస్థల బంద్

- 'నారాయణ' యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- ప్రభుత్వం స్పందించకపోతే 'చలో విజయవాడ'
- విద్యార్థి జెఎసి నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ప్రయివేటు విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఫీజుల పేరుతో చేస్తున్న దోపిడీ అరికట్టాలని, కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, మృతి చెందిన నారాయణ కళాశాల విద్యార్థి చరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని, నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బైక్ ర్యాలీలు, నిరసనలు తెలిపారు. అనంతపురం నగరంలో విద్యార్థి సంఘాల జెఎసి నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వారం రోజుల క్రితం నారాయణ విద్యా సంస్థలో ఓ విద్యార్థి కళాశాల భవనం పైనుంచి దూకి మరణిస్తే ఇంత వరకు విద్యా సంస్థల యాజమాన్యాలపై కేసులు నమోదు చేయలేదన్నారు. ఈ విషయంపై జిల్లా పోలీసు యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. మంత్రి నారాయణ కళాశాల కాబట్టే ఇంత వరకు విద్యా సంస్థల యాజమాన్యాలపై కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న ఆర్ఐఒ వెంకటరమణనాయక్ కనీసం కళాశాల వైపు కన్నెత్తి చూడకుండా, విచారణ జరపకుండా తమ కార్యాలయానికి పరిమితమయ్యారని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జిల్లా ఆర్ఐఒ వెంకటరమణ నాయక్‌ను సస్పెండ్ చేయాలని, మంత్రి నారాయణను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, విద్యార్థి మృతికి కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే త్వరలో చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్‌బి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ విద్యార్థి సమైక్య, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అరకు చలి ఉత్సవ్ ప్రారంభం

- గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు వేదిక
- అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- అరకులోయ (అల్లూరి జిల్లా)



అరకు చలి ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

అరకులోయలో మూడు రోజులపాటు జరగనున్న చలి ఉత్సవ్‌ను అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా అరకు రైల్వే స్టేషన్ నుంచి డిగ్రీ కళాశాల మైదానం వరకు 5కె రన్ నిర్వహించారు.

శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ఉత్సవాలనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అరకు చలి ఉత్సవ్ వేదికగా నిలుస్తుందన్నారు. ఈ ఉత్సవ్‌కు ఎనిమిది రాష్ట్రాల నుంచి ప్రజలు వచ్చారని తెలిపారు. ఈ ఉత్సవ్‌లో మధ్యప్రదేశ్ నుంచి మాడగడలో పారగ్లైడింగ్, హాట్ హెయిర్ బెలూన్, హెలికాప్టర్ రైడ్ ఆకర్షించనున్నట్లు చెప్పారు. ఉత్సవం సందర్భంగా అరకు అందాలను వీక్షించడానికి గగనంలో విహరించడానికి సామాన్యులు కూడా ఇది మంచి తరుణమన్నారు.

ఏటా అరకు ఫెస్టివల్ : టూరిజం ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్

అరకు చలి ఉత్సవ్ సందర్భంగా పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. ఏటా అరకులో చలి ఉత్సవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో ఫెస్టివల్ నిర్వహించడానికి కేలండర్ రూపొందించామని చెప్పారు. పర్యాటక అభివృద్ధికి అరకు అనువైన ప్రదేశమన్నారు. అభివృద్ధి చేస్తే మరింత మంది టూరిస్టులు ఎక్కువ సమయం గడుపుతారని తెలిపారు.

విశాఖపట్నం నుంచి అరకుకు పర్యాటకుల సౌకర్యార్థం హెలికాప్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అడ్వెంచర్ టూరిజం పెట్టే ఆలోచన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పిఒలు వి.అభిషేక్, కట్ట సింహాచలం, అపూర్వ భరత్, అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, పాడేరు ఎఎస్‌పి ధీరజ్, చింతపల్లి ఎఎస్‌పి నవ్‌జ్యోతి మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉభయ గోదావరి, కృష్ణా-గుంటూరు నియోజకవర్గ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాత్రికి రాత్రి అన్నీ జరిగిపోతాయని తాము చెప్పడం లేదన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు.

పార్టీలో ఒక పదవి మూడు సార్లే : లోకేష్

పార్టీలో ఒక పదవికి ఎవరైనా మూడు సార్లే నిర్వహించే విధానాన్ని ప్రవేశపెడతామని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నాయకులు, పార్టీ శ్రేణుల ఎదుగుదల కోసం ఈ ప్రతిపాదన తెచ్చామన్నారు. ఈ అంశంపై విస్తృత చర్చ తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అధినేతకు మినహా మిగిలిన అందరికీ వర్తిస్తుందన్నారు. మార్చిలో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు.

గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామన్నారు. పార్టీ కార్యాలయంలో పోలీసులు ఎక్కువ సంఖ్యలో ఉండటంపై లోకేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బందోబస్తు పోలీసుల సంఖ్యను తగ్గించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశం అనంతరం పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

వాట్సాప్‌లో డేటా భద్రతకు తీసుకున్న చర్యలేమిటి : సిపిఎం

ప్రజాశక్తి- నెల్లూరు

వాట్సాప్‌లో డేటా భద్రతకు ఏ చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ పాలనకు శ్రీకారం చుట్టిందని, ఇది కార్పొరేట్ శక్తులకు అనుకూలమైందని అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 160 సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తామని ప్రకటించిందన్నారు. దీనిద్వారా ప్రజల వ్యక్తిగత సమాచారం బయట వ్యక్తులకు చేరే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ సేవలు ప్రస్తుతం గ్రామ/వార్డు సచివాలయాల్లో అమలు చేస్తున్నారని, దాన్ని కొనసాగిస్తే సరిపోతుందన్నారు. పౌరసేవల వినియోగానికి వాట్సాప్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం (డీల్) వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. పౌరుల వ్యక్తిగత డేటా అత్యంత విలువైన సంపదని, దాన్ని కార్పొరేట్ కంపెనీ 'మెటా' పరం చేయడం సరైంది కాదని అన్నారు. ముఖ్యమంత్రే స్వయంగా డేటా భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు. దీన్నిబట్టి ఇప్పటివరకు అలాంటి ఏర్పాటు లేదని స్పష్టమవుతోందన్నారు. డీల్ వివరాలు, డేటా భద్రతకు సంబంధించిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.



చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న హిందీ ప్రచార సభ ప్రతినిధులు

హిందీ అభివృద్ధికి చర్యలు : చంద్రబాబు

ప్రజాశక్తి -అమరావతిబ్యూరో

రాష్ట్రంలో హిందీ భాషాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ డైరీలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందీ ప్రచార సభ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందచేశారు. గత ప్రభుత్వం ఎల్‌పి.సెట్ నిర్వహించి హిందీ పండిత శిక్షణ కళాశాలల ప్రవేశాలు ఆపివేసిందనీ, 2021 నుండి ఎల్‌పిసెట్ నిర్వహించలేదని తద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు హిందీ టీచర్ ట్రైనింగ్ కోర్సు చదివే అవకాశమే లేకుండా పోయిందని తెలిపారు. గతంలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడే కళాశాలలకు హిందీ ప్రచారసభ హైదరాబాద్ ద్వారానే ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రవేశాలను చేపట్టేవారమని గుర్తుచేశారు. అదే విధానంలో హిందీ ప్రచారసభకు పండిత శిక్షణ ప్రవేశాలు నిర్వహించే విధంగా ప్రత్యేక అనుమతి ఇవ్వాలని, రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుండే హిందీ భాషను ప్రవేశ పెట్టాలని, రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్, కెజిబివిలలో ఒక్క పిజిటి హిందీ పోస్టు కూడా లేదన్నారు. చాలా ఇంటర్మీడియట్ కళాశాలల్లో జెఎల్ హిందీ పోస్టులు లేవన్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ హిందీ ప్రచార సభకు పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. హిందీ పట్ల నిర్లక్ష్యం చూపమని, అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హిందీ ప్రచార సభ కోశాధికారి గిరిధర్‌రావు, తెలంగాణ హిందీ ప్రచారసభ హైదరాబాద్ సెక్రటరీ ఎ.కె.రాజు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత నారా చంద్రబాబునాయుడును ఘనంగా సత్కరించి జ్ఞాపికను కూడా అందజేశారు.

విద్యార్థినిపై హత్యాయత్నం

- శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఘటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో బిసి హాస్టల్ విద్యార్థినిపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, సహచర విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం కొండగూడెంకు చెందిన కొరికాన లక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో బిఎస్‌సి ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. ప్రస్తుతం పుట్టగొడుగుల పెంపకంపై పాతశ్రీకాకుళంలోని భారత్ డ్రీమ్ ఫీల్డ్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో కళాశాలకు ఆనుకుని ఉన్న వసతి గృహానికి వెళ్లే రోడ్డులో ఆమె స్పృహ తప్పి పడి ఉండటాన్ని హాస్టల్ సిబ్బంది గుర్తించారు. ఆమెను హుటాహుటిన శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హాస్టల్ వార్డెన్ పూర్ణ అందించిన సమాచారంతో శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సిఐ పైడపు నాయుడు, ఎస్ఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు. ఆమెకు కంటి, గెడ్డం, చేతులపైన బలమైన గాయాలు ఉన్నట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో పుస్తకాలు, చెప్పులు, బ్యాగ్ వడి ఉండడంతోపాటు విద్యార్థిని శరీరంపై గాయాలు ఉండడంతో పోలీసులు భిన్నకోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థినిపై లైంగిక దాడి జరగలేదని వైద్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

సమగ్ర దర్యాప్తుకు మంత్రులు ఆదేశం

డిగ్రీ విద్యార్థినిపై దాడి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు పోలీసులను ఆదేశించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌పి కెవి.మహేశ్వరరెడ్డి, డిఎస్‌పి వివేకానందతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రిమ్స్ మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ షకీలతో మాట్లాడి బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

మహిళా కళాశాల ఆవరణలో హాస్టల్ విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, పి.చందు డిమాండ్ చేశారు. వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎఎస్‌ఒలుగా డిజిటల్ అసిస్టెంట్లు

- జిఒ 20 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లను ఖాళీగా ఉన్న మండలాల్లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసరు (ఎఎస్ఒ)గా ప్రభుత్వం నియమించనుంది. ఇందుకు సంబంధించిన జిఓ ఆర్‌టి నెంబరు 20ను ప్లానింగ్ డిపార్టుమెంట్ శుక్రవారం విడుదల చేసింది. స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలు చేసే కార్యక్రమంలో భాగంగా విద్యార్హతతో పాటు అర్హత ఉన్న 277 మంది డిజిటల్ అసిస్టెంట్లకు ఎఎస్ఒగా ప్రమోషన్ దక్కనుంది. ఇందుకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలంటూ ప్రభుత్వం పేర్కొంది.

రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్ఐ ఆత్మహత్య

- పోలీస్‌స్టేషన్‌లో ఘటన

ప్రజాశక్తి - తణుకు రూరల్

రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్ఐ మృతి చెందిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె గంగవరానికి చెందిన ఎజిఎస్ మూర్తి (38) తణుకు రూరల్ ఎస్ఐగా పని చేస్తున్న సమయంలో గేదెల అపహరణ కేసులో ఆరోపణలు రావడంతో గతేడాది నవంబర్‌లో ఉన్నతాధికారులు ఆయనను విఆర్‌కు పంపారు. ఈ నేపథ్యంలో పెనుగొండ సిఎం బందోబస్తు విధులకు హాజరయ్యేందుకు ఎస్ఐ మూర్తి భీమవరంలో రివాల్వర్ తీసుకుని గురువారం రాత్రి తణుకు సమీపంలోని పైడిపర్రులో ఉన్న ఇంటికొచ్చారు. శుక్రవారం ఉదయం 7.30లకు తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐ వాష్‌రూమ్‌కు వెళ్లొస్తా అని చెప్పి వెళ్లారు. అక్కడ తనతో తెచ్చుకున్న సర్వీస్ రివాల్వర్‌తో పాయింట్ బ్లాంక్‌లో షూట్ చేసుకున్నారు. శబ్దం రావడంతో స్టేషన్లోని పోలీస్ సిబ్బంది అక్కడికెళ్లగా ఎస్ఐ రక్తపుమడుగులో పడి ఉన్నారు. పోలీసులు ఆయనను 108 వాహనంలో తణుకు ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య విజయ, కుమారుడు చందన్, కుమార్తె దీక్షిత ఉన్నారు. నెల రోజుల క్రితం కుమార్తె మొదటి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. చందన్ యుకెజి చదువుతున్నాడు. మూర్తి తండ్రి సత్యనారాయణ కె గంగవరంలో వ్యవసాయం చేస్తుంటారు. తణుకు ప్రాంతీయ ఆస్పత్రి మార్చురీ వద్దకు వచ్చిన మూర్తి అన్నయ్య, చెల్లెలు, బావ, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆత్మహత్యకు శాఖాపరమైన చర్యలా, వేరే కారణాల అనేది తెలియాల్సి ఉంది.



మీ కోసం

కాకరకాయ త్వరగా వేగాలంటే, కోసిన ముక్కల్లో స్పూన్ పెరుగు, ఉప్పు వేసి పదినిమిషాలు నానబెట్టుకోవాలి.

జీవన సౌరభం

తెలియనిది అడిగితే బయటపడే అజ్ఞానం కొద్దిసేపే. అడగకపోతే జీవితాంతం అజ్ఞానమే.

మెప్పు కోరిన చిలుక



ముద్దు ముద్దు చిలుక ఒకటి
ముచ్చటైన చిలుక ఒకటి
తన అందం చూసి మురిసి
పలికెతోటి చిలుకతోటి

'గుంపులోన నేనుంటే
మీతో తిరుగుతు ఉంటే
నన్నెవరూ గుర్తించరు
కలిసుండుట పొరపాటే'

తక్షణమే చెట్టు వీడి
బొంతకాకి గుంపు కూడి
ప్రత్యేకత నిలిచిందని
మురిసిందది ఆడిపాడి

కాకులన్ని పొగడసాగె
రాణివలే చూడసాగె
ముద్దు చిలుక సంతోషం
ముప్పేటగ పెరగసాగె

ఒకనాడా కాకిమూక
వెడలెను తిరణాల దాక
చిలుక కూడ అతిశయాన
ఎగిరి వెళ్ళె వాటి వెనుక

కాకిగుంపులో చిలుకను
అందరు వింతగ
చూచిరి
పంజరాన బంధించగ
ప్రయత్నాలు సాగించిరి

కాకినెవరు పట్టుకోరు
పంజరాన పెట్టబోరు
వీటితోటి మసలుచున్న
నన్నే పసికట్టు వారు

కాకులకిది పట్టలేదు
చిలుకను రక్షించలేదు
తోటి కాకిపైన శ్రద్ధ
చిలుకపైన చూపలేదు

ఒక కాకికి దెబ్బ తగల
చెప్పలేని కాకిగోల
తాను కోరి చేరిననూ
తనపై చులకనా? ఏల?

కాకులు చెత్తను తిన్నా
గొంతు బాగు లేకున్నా
వదిలి వెళ్ళలేదు సదా
వాటితోటి కలిసున్నా

మెప్పు మాట దేవుడెరుగు
ముప్పు ముంచుకొచ్చి పరుగు
చిలుకలతో నేనుంటే
ప్రమాదము ఎంతో తరుగు


చిలుక తప్పు తెలుసుకొనెను
తనవారిని చేరుకొనెను
సందడి చేసే చిలుకల
సవ్వడి హాయిని గొలిపెను

స్వార్థ బుద్ధి చూపరాదు
తనవారిని వీడరాదు
తాత్కాలిక ఆనందం
ఉచ్చులోన చిక్కరాదు

రూపు చూసి మెచ్చాలని
పొగడ్తలను పొందాలని
ఆశ మాని తెలుసుకొనెను
గుణము మంచిదవ్వాలని ...

– గుడిపూడి రాధికారాణి,
94949 42583.

నేను గీసిన బొమ్మ





పి.తజ్మీన్ ఖానమ్,
మూడవ తరగతి, యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా.

F	M	B	U	R	W	P	L	E	V	J	T
S	I	Z	H	Q	U	I	Z	N	C	R	H
Y	P	E	L	A	C	X	O	T	E	N	G
D	A	T	P	N	S	L	G	P	H	L	U
V	S	I	E	Y	K	F	A	Z	M	C	A
G	S	P	W	A	I	P	E	S	O	R	T
N	E	T	S	J	C	T	U	D	S	K	E
H	D	X	L	E	Q	H	B	M	E	D	Q
O	V	T	A	H	R	I	E	S	A	F	Y
X	K	J	P	M	C	R	N	R	Z	R	A
L	E	S	S	O	N	D	G	L	I	F	K
U	Q	D	T	W	Q	M	A	S	B	X	G



TEACHER	CLASS	EXAM
TAUGHT	LESSON	PENCIL
THIRD	PASSED	PAPER
GRADE	MARK	QUIZ

గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ గజిబిజిగా ఉన్న ఆంగ్ల అక్షరాల్లో కింద ఇచ్చిన పదాలు ఉన్నాయి. ఎక్కడ ఉన్నాయో గుర్తించండి. అడ్డం, నిలువు, క్రాస్‌గా ట్రై చేయండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మధుమేహమా.. మహిళలూ జాగ్రత్త!



మధుమేహం (డయాబెటిక్) ఆడా మగా, పిల్లలు, పెద్దవారు అనే తేడాలేకుండా అందరికీ వస్తోంది. ఇది రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం ఎంతైనా మంచిది. వచ్చిన వారు తగ్గించుకోవటానికి అందుబాటులో ఉన్న మార్గాలను అన్వేషించాలి. ఏదైమైనా పురుషులతో పోలిస్తే మహిళలు ఈ వ్యాధి బారిన ఎక్కువగా పడుతున్నారు. నియంత్రణ విషయంలోనూ పురుషులతో పోల్చితే మహిళలే ఎక్కువగా కష్టపడాల్సివస్తుంది. నిరంతర పర్యవేక్షణ కూడా చేయాల్సివస్తోంది. ఎందుకంటే మహిళల్లో షుగర్ అనేది ఓ జీవనశైలి వ్యాధి మాత్రమే కాదు. దీని కారణంగా ఇతర ప్రమాదకరమైన వ్యాధులు కూడా వస్తుంటాయి. గుండె సంబంధిత ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. పురుషులతో పోలిస్తే షుగర్ కలిగిన మహిళలు నాలుగు రెట్లు గుండె జబ్బులకు లోనయ్యే అవకాశం ఉంది. ఇవే కాకుండా కిడ్నీ వ్యాధులు, ఇతర మానసిక సమస్యలు కూడా మధుమేహం ఉన్న మహిళల్లో అధికంగా ఉంటాయనేది పలు అధ్యాయనాల్లో తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు ఈ వ్యాధి పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవటం ఉత్తమం.

కారణాలేమంటే...

రక్తంలో షుగర్ కంట్రోల్ లేకపోవటం వల్ల మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్‌కు శరీరం స్పందించే తత్వం తగ్గిపోతుంది. స్త్రీలలో సెక్స్ పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది. ఇన్సులిన్ సెన్సివిటీ కూడా మహిళల్లోనే అధికంగా ఉంటుంది. శరీరంలో శక్తి సమతుల్యత, గ్లూకోజ్ మెటబోలిజం స్త్రీ, పురుషుల్లో విభిన్నంగా ఉంటుంది. అందువల్లనే చాలామంది మహిళలు రక్తంలో వచ్చే ఇబ్బందులే కాకుండా కొన్ని ప్రత్యేకమైన ఆరోగ్య సమస్యలను కూడా ఎదుర్కొంటారు. సాధారణంగా ఇలాంటి వారికి టైప్ 2 డయాబెటిస్ అధికంగా వస్తుంది. 40 ఏళ్లు పైబడిన వారు, అధిక బరువున్నవారు, కుటుంబంలో తల్లిదండ్రులు, లేదా తోబుట్టువులకు షుగర్ ఉన్న వారు, గర్భధారణ సమయంలో, అధికంగా కొలెస్ట్రాల్, పీసీఓఎస్‌తో బాధపడుతున్న వారు, శారీరకంగా చురుకైన జీవనశైలి లేని వారు ఈ వ్యాధి భారినపడుతుంటారు.

ఇన్ఫెక్షన్ల ముప్పు

100 మందిలో 50 మంది మహిళలు తమ జీవితకాలంలో ఎప్పుడో ఒకసారి వెజైనా, యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవాల్సివస్తోంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవటం, మూత్రాశయంలో మూత్రం పూర్తిగా ఖాళీ కాకపోవటం వల్ల అక్కడ బ్యాక్టీరియా అభివృద్ధి చెందే ప్రమాదం ఉంది. వెజైనా దగ్గర ఈస్ట్ ఇన్ఫెక్షన్ బారిన పడే ప్రమాదం ఉంది.

పీసీఓడీ, పీసీఓఎస్‌తోనూ సమస్యలే...

మహిళల్లో చాలామంది పీసీఓడీ, పీసీఓఎస్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 40 శాతం మందికి మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. బీపీ, గుండెజబ్బులు, బ్రెయిన్ హెమరేజ్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులకు పీసీఓడీతో సంబంధం ఉంది. ప్రపంచంలోనూ, మనదేశంలోనూ ఈ సమస్యలు తీవ్రంగానే ఉన్నాయి. ప్రతి నలుగురిలో ఒక అమ్మాయి ఈ సమస్యతో బాధపడుతున్నట్లుగా గణాంకాలు ఉన్నాయి. తొలినాళ్లలోనే దీనిని గుర్తించటం, తినే ఆహారంలో పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవటం, యోగా, స్విమ్మింగ్ వంటివి వ్యాయామాలు చేయటం, ఒత్తిడిని తగ్గించుకోవటం, బరువు పెరగకుండా చూసుకోవటం ద్వారా ఇలాంటి సమస్యలను నివారించుకోవచ్చు.

రాకుండా ఉండాలంటే...

- రక్తంలో చక్కెరస్థాయిలను అదుపులో ఉంచుకోవాలి.
- తగినంత నీటిని తాగాలి
- కాటన్ లో దుస్తులు ధరించాలి
- మూత్రాన్ని ఆపుకోకుండా జాగ్రత్తపడాలి

గర్భధారణ సమయంలో...

రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు గర్భధారణ కూడా కష్టమే. ఒకవేళ వచ్చినా తొలి నెలల్లోనే గర్భస్రావం కావటం, పుట్టే పిల్లల్లో లోపాలు, ప్రి–మెచ్యూర్ డెలీవరీ, శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి సమయంలో డాక్టర్ పర్యవేక్షణలో జాగ్రత్తలు పాటించటం ముఖ్యం. సాధారణంగానే మెనోపాజ్‌లో వేడి ఆవిర్లు, మూడ్‌స్వింగ్స్, నిద్రలేమి, ఒత్తిడి, ఆందోళన వంటి ఎన్నో సమస్యలు మహిళలను వేధిస్తుంటాయి. మధుమేహం కారణంగా నెలసరి సమస్యలు, కంటిచూపు తగ్గిపోవటం, కిడ్నీ సమస్యలు వంటివి కూడా మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి.

ఇబ్బందులు ఇవీ...

- మూత్ర సంబంధిత ఇబ్బందులు
- రుతుక్రమం దెబ్బతినటం
- పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్)

మధుమేహం లక్షణాలు

ప్రతి ముగ్గురిలో ఒకరికి మధుమేహం ఉన్నా తెలియటం లేదు. మొదట్లో పెద్దగా లక్షణాలు కనిపించకపోవటమే దీనికి కారణం. సమస్య పెరిగే కొద్దీ కొన్ని హెచ్చరికలు పొడచూపుతుంటాయి.

- అతిగా దాహం వేయటం
- నోరు ఎండిపోవటం
- విపరీతంగా ఆకలి వేయటం
- మూత్రం ఎక్కువగా రావటం
- అసాధారణ బరువు పెరగటం లేదా తగ్గటం
- రక్తంలో గ్లూకోజు పెరిగితే తలనొప్పి, చూపు మసకబారటం, నిస్సత్తువ
- తీవ్రమైతే గాయాలు, పుండ్లు త్వరగా మానకపోవటం
- తరచూ మూత్రకోశ ఇన్ఫెక్షన్లు
- గజ్జల్లో దురద పెట్టడం
- జననాంగం పొడిబారిపోవటం
- లైంగిక కోరికలు తగ్గిపోవటం

ఇవి పాటించటం మేలు

- వ్యాయామం చేయటం ద్వారా బరువును అదుపులో ఉంచుకోవాలి.
- తాజా పండ్లు, కాయగూరలు ఆహారంలో భాగం చేసుకోవాలి
- విటమిన్లు, ఖనిజాలు వంటి పోషకాలుండే మొక్కల ఆధారిత ఆహారం మేలు
- ఆహారం ఒకేసారి కాకుండా తక్కువమొత్తంలో ఎక్కువసార్లు తీసుకోవాలి
- చక్కెరలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే పదార్థాలు కాకుండా సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఓట్‌మీల్, తృణధాన్యాలు తినాలి
- మంచినీటిని అవసరమైంతస్థాయిలో తీసుకోవాలి.:
- శీతల పానీయాలను మానేయాలి
- పీచు ఎక్కువగా ఉండే పండ్లు తీసుకోవాలి



– డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి,
చైర్మన్ విజిఆర్ డయాబెటిక్స్ ఆసుపత్రి, విజయవాడ.

చాలా అవకాశాలు వదులుకున్నా...: సిద్ధార్థ్



'నా దగ్గరికి చాలా రకాల స్క్రిప్టులు వచ్చేవి. అమ్మాయిలను కొట్టడం, ఐటెం సాంగ్స్ చేయటం, నడుము గిల్లడం, నేను చెప్పినట్లుగా అమ్మాయిలు నడుచుకోవటం, ఎక్కడికి వెళ్లాలి? ఏమి చేయాలన్నది నేనే ఆదేశాలివ్వటం....ఇలాంటి కంటెంటెంట్‌తో కొన్ని కథలు వచ్చాయి. వాటిని నేను రిజెక్ట్ చేశాను. బహుశా అవి ఒప్పుకుని ఉంటే ఈ రోజు నేను పెద్ద స్టార్ అయ్యిండే వాడినేమో!. కానీ నేను నా మనసుకు నచ్చినవే చేసుకుంటూ పోయా. చాలామంది నా దగ్గరకు వచ్చి మీరు ఆడవాళ్లకు చాలా గౌరవం ఇస్తారని చెప్తూ ఉంటారు. మహిళలకే కాదు, పేరెంట్స్, పిల్లలకు ఇలా అందరికీ గౌరవ ప్రాధాన్యతలిస్తారని అంటుంటారు. అంతేకాదు వారి పిల్లలు పదిహేనేళ్లుగా నా సినిమాలు చూస్తున్నారని చెబుతుంటారు. ఇంతకంటే సంతోషకరమైంది ఏముంటుంది?. ఈ అభిమానానికి కోట్లల్లో కూడా వెలగట్టలేం. చాలామంది హీరోలు యాక్షన్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. మగవాళ్ల బాధనను బయటకు చూపించకూడదన్నట్లుగా ఉంటున్నారు. కానీ నేను అలా కాదు. స్క్రీన్స్‌పై ఏడవటాన్ని కూడా సంతోషంగా చేస్తాను' అని కథానాయకుడు సిద్ధార్థ్ అన్నారు. తెలుగు, తమిళ భాషల సినిమాల్లో నటిస్తున్న కథానాయకుడు సిద్ధార్థ్. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ వేడుకకు హాజరైన ఆయన పై విధంగా మాట్లాడారు.

నిర్మాత వేదరాజు టింబర్ మృతి

టాలీవుడ్ నిర్మాత వేదరాజు టింబర్ (54) మరణించారు. ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న ఆయన కొన్ని నెలల క్రితం చికిత్స కోసం హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో చేరారు. ఆరోగ్య పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మరణించారు. కొంత కాలంగా సినిమాలకు బ్రేక్ ఇచ్చిన ఆయన ప్రస్తుతం కనస్ట్రక్షన్ రంగంలో బిజీగా ఉన్నారు. మళ్లీ చిత్ర రంగంలో రీఎంట్రీ ఇద్దాం అనే ఆలోచనలతో పలు కథలను కూడా రెడీ చేసుకున్నారు. వేదరాజు టింబర్ నెక్ట్స్ ప్రొడక్షన్ పేరుతో టీమ్‌ను కూడా సిద్ధం చేసుకున్నారు. హీరో అల్లరి నరేష్‌తో 'మడత కాజా' చిత్రంతో పాటు 'సంఘర్షణ' అనే మరోసినిమాను వేదరాజు నిర్మించారు. వేదరాజుకు భార్య, కూతురు ఉన్నారు. ఆయన మృతి పట్ల సన్నిహితులతో పాటు పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

త్వరలో 'విడి-12' టైటిల్



విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న చిత్ర టైటిల్‌పై నిర్మాత నాగవంశీ స్పందించారు. విజయ్ కెరీర్లో 12వ సినిమాగా ఇది రాబోతోంది. తాజాగా టైటిల్‌పై సోషల్‌మీడియాలో నాగవంశీ పోస్టు చేశారు. 'టైటిల్‌ని అతి త్వరలోనే రివీల్ చేస్తున్నట్టు'గా కన్ఫర్మ్ చేశారు. ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తున్నారు. మార్చిలో విడుదలవ్వాల్సిన ఈ చిత్రం ఏప్రిల్‌కి వాయిదా వేసినట్లు చిత్రబృందం ఇటీవల ప్రకటించింది.



హీరో, హీరోయిన్ లేకుండా సినిమా తీశాం : ఆర్‌పి పట్నాయక్

'హీరో హీరోయిన్ లేకుండా ఒక సినిమా తీయాలి అంటే ఎలా అని ఆలోచనతో ఈ కథ మొదలైంది. కథ హీరో అయితే ఎలా ఉండబోతుంది అని ఈ కథ రాశాం. ఈ చిత్రానికి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. ఈ సినిమాను మొత్తం దగ్గరుండి చూసుకున్నది మా అన్నయ్య గౌతమ్ పట్నాయక్. ఈ చిత్రంలోని కీలక పాత్ర విషయానికి వస్తే నాకు వంశీ మాత్రమే ఖచ్చితంగా ఈ కథకు, పాత్రకు ఫర్ఫెక్ట్ అని అనిపించింది. వేరే ఎవరిని నేను ఆ పాత్రకు ఊహించుకోలేక పోయాను. జెమిని సురేష్ క్యారెక్టర్ ప్రత్యేకమైంది' అని దర్శకుడు ఆర్‌పి పట్నాయక్ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన కొత్త సినిమా 'కాఫీ విత్ ఏ కిల్లర్'.

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సతీష్ నిర్మించిన ఈ చిత్రంలో టెంపర్ వంశీ, శ్రీనివాసరెడ్డి, సత్యం రాజేష్, రవిబాబు, అంబటి శ్రీను, శ్రీరాప, జెమిని సురేష్ తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు. నేరుగా ఈ సినిమా ఓటీటీలోనే విడుదలయ్యింది.

మొనాలిసాకు మొదటి అవకాశం



ఇటీవల సోషల్ మీడియాలో ప్రముఖంగా వినిపించిన పేరు మోనాలిసా. మహాకుంభమేళాలో పూసలమ్మిన ఈమె ఓవర్ నైట్‌స్టార్‌గా మారిపోయింది. ఎక్కడ చూసినా ఆమె ఫొటోలు, వార్తలే కనిపించాయి. ఈ తరుణంలోనే మోనాలిసాకు సినిమా ఆఫర్లు అంటూ పలు వార్తలు కూడా హల్‌చల్ చేశాయి. ఈ నేపథ్యంలో తన తర్వాతి మూవీలో అవకాశం ఇస్తానని బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా ఇటీవల ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన మధ్యప్రదేశ్, ఇండోర్‌లోని ఖర్గోన్ జిల్లా మహేశ్వర్‌లోని మోనాలిసా ఇంటికి వెళ్లారు. 'ది డైరీ ఆఫ్ మణిపూర్' చిత్రంలో నటించేందుకు ఆమె నుంచి అంగీకార పత్రంలో సంతకం తీసుకున్నారు. సినిమా షూటింగ్‌కి ముందు ముంబైలో యాక్టింగ్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని డైరెక్టర్ సనోజ్ మిశ్రా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

ఫైనల్లో యువ భారత్

- సెమీస్‌లో ఇంగ్లండ్‌పై గెలుపు
- 2న దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరు
- ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్



కౌలాలంపూర్: ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లో భారత జట్టు ప్రవేశించింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో ఇంగ్లండ్ మహిళలపై తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 114 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా.. మరో ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే ఛేదించింది. ఓపెనర్లు కమలిని-త్రిష జోడి తొలి వికెట్‌కు శుభారంభం అందించారు. వీరిద్దరూ 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఫోబ్ బ్రెట్ బౌలింగ్ త్రిష అవుట్ అయ్యింది. 29 బంతుల్లో 35 పరుగులు చేసింది. ఆ తర్వాత కమలిని-సానిక చల్కే జోడీ టీమిండియా విజయాన్ని ఖరారు చేశారు. దీంతో భారత్ ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే విజయం సాధించింది. కమలిని 50 బంతుల్లో 56 పరుగులతో రాణించింది. సానికా 12 బంతుల్లో ఒక ఫోర్ సహాయంతో 11 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. అంతకుముందు ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. డేవినా పెర్రిన్, కెప్టెన్ అబి నార్గ్రోవ్ తప్ప ఇతర బ్యాటర్స్ రాణించలేకపోయారు. పెర్రిన్ 40 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 45 పరుగులు చేయగా, నార్గ్రోవ్ 25 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 30 పరుగులు చేసింది. పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మ బంతితో ఆకట్టుకున్నారు. ఇద్దరు చెరో మూడు వికెట్ల పడగొట్టారు. ఆయుషి శుక్లాకు రెండు వికెట్లు దక్కాయి. దీంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సిసోడియా(3/21)కు దక్కింది.

ఆస్ట్రేలియాకు దక్షిణాఫ్రికా ఝలక్..

రెండో సెమీస్‌లో పటిష్ట ఆస్ట్రేలియాకు దక్షిణాఫ్రికా ఝలక్ ఇచ్చింది. ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 105పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా జట్టు 18.1ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 106పరుగులు చేసి గెలిచింది. దక్షిణాఫ్రికా బౌలర్ వాన్ వెర్క్(4/17) సంచలన బౌలింగ్‌తో ఆసీస్‌ను కట్టడి చేసింది. ఫిబ్రవరి 2న ఆదివారం దక్షిణాఫ్రికాతో టీమిండియా తలపడనుంది.

హర్షిత్, బిష్ణోయ్ దెబ్బకు ఇంగ్లండ్ ఢమాల్

- దూబే, పాండ్యా అర్ధసెంచరీలు
- నాల్గో టి20లో 15పరుగుల తేడాతో టీమిండియా గెలుపు



శివమ్ దూబే(53; 34బంతుల్లో 7ఫోర్లు, 2 సిక్సర్లు)

పూణే: ఇంగ్లండ్‌తో జరిగిన నిర్ణయా త్మక నాల్గో టి20లో టీమిండియా 15 పరుగుల తేడాతో గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను చేజిక్కించుకుంది. తొలుత టీమిండియా బ్యాటర్లు నిరాశపరిచినా.. దూబే, పాండ్యా అర్ధసెంచరీలతో రాణించడంతో భారతజట్టు 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 181పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్లు ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించినా.. ఆ తర్వాత హర్షిత్ రాణా, బిష్ణోయ్‌ల దెబ్బకు 166పరుగులకే కుప్పకూలింది. దీంతో ఐదు టి20ల సిరీస్‌ను భారత్ 3-1తో చేజిక్కించుకొంది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. 12 పరుగుల వద్ద వరుసగా మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. సంజూ శాంసన్(1), తిలక్ వర్మ(0), సూర్యకుమార్(0) దారుణంగా విఫలమయ్యారు. ఆ దశలో అభిషేక్ శర్మ(29), రింకు సింగ్(30) కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ 4వ వికెట్‌కు 45పరుగులు జోడించారు. ఆ తర్వాత వీరిద్దరూ ఔటైనా.. హార్దిక్ పాండ్యా (53; 30బంతుల్లో, 4ఫోర్లు, 4సిక్సర్లు), శివమ్ దూబే (53; 34 బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. దీంతో టీమిండియా 19 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో టీమిండియా కేవలం 3 పరుగులు మాత్రమే చేసి మూడు వికెట్లు కోల్పోయింది. చివరి ఓవర్‌ను జేమీ ఓవర్టన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో సాకిబ్ మహమూద్‌కు మూడు, జేమీ ఓవర్టన్‌కు రెండు, బ్రైడన్ కార్స్, ఆదిల్ రషీద్‌కు తలో వికెట్ పడగొట్టారు.

ఓపెనర్లు మెరిపించినా...

లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లండ్ జట్టు ప్రారంభంలో దూకుడుగా ఆడింది. ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్ (23), డకెట్ (39) వరుస బౌండరీలు బాదుతూ భారత బౌలర్ల గుండెల్లో గుబులు పుట్టించారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని రవి బిష్ణోయ్ విడగొట్టాడు. జట్టు స్కోరు 62 పరుగుల వద్ద భారీషాట్‌కు ప్రయత్నించిన డకెట్ సూర్యకుమార్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే మరో ఓపెనర్ సాల్ట్ కూడా అక్షర్ పటేల్ చేతిలో బౌల్డయ్యాడు. తొలి డౌన్‌లో వచ్చిన బట్లర్ (2)ను వరుణ్ చక్రవర్తి పెవిలియన్‌కు చేర్చాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన వారిలో ఓవర్టన్ (19) తప్ప మిగతావారంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్ల పని హర్షిత్(3/33), వరుణ్ చక్రవర్తి(2/28) పని పట్టారు. దీంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 19.4ఓవర్లలో 166పరుగుల వద్ద ముగిసింది. ఈ సిరీస్ గెలుపుతో ఇంగ్లండ్‌పై భారత్ వరుసగా ఐదో టి20 సిరీస్‌ను చేజిక్కించుకొని రికార్డు నెలకొల్పింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శివమ్ దూబేకు దక్కింది. ఐదో, చివరి టి20 ముంబయి వేదికగా ఆదివారం జరగనుంది.

సచిన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు: బిసిసిఐ



న్యూఢిల్లీ: టీమిండియా దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌కు బిసిసిఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. ముంబయిలో శనివారం జరిగే బిసిసిఐ వార్షిక సమావేశంలో సచిన్‌ను ఈ అవార్డుతో ఘనంగా సత్కరించనున్నట్లు వెల్లడించింది. 51ఏళ్ల సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఏకైక ఆటగాడిగా ఇప్పటికీ కొనసాగుతున్నాడు. అలాగే సెంచరీల్లోనూ వంద సెంచరీలు కొట్టిన ఏకైక ఆటగాడు కూడా టెండూల్కర్ మాత్రమే. వన్డేల్లో 44.83 సగటుతో 18,426 పరుగులు చేయగా.. ఇందులో 49 సెంచరీలు, 96 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇక టెస్ట్‌ల్లో 53.78 సగటుతో 15,921 పరుగులు చేశాడు. ఇందులో 51 సెంచరీలు, 68 అర్ధ సెంచరీలు ఉన్నాయి. మొత్తం 664 మ్యాచుల్లో 48.52 సగటుతో 34,357 పరుగులు చేశాడు. వీటిలో 100 సెంచరీలు, 164 అర్ధ సెంచరీలు ఉన్నాయి. క్రికెట్ జగత్తులో 200 టెస్టులు, 463 వన్డేలు ఆడిన ఏకైక ప్లేయర్ సచిన్ మాత్రమే. ఏకైక టి20 ఆడాడు. 2023లో ప్రతిష్టాత్మక సికె నాయుడు అవార్డు దిగ్గజ వికెట్ కీపర్ ఫరోక్ ఇంజనీర్, మాజీ కోచ్ రవిశాస్త్రికి లభించాయి. 1994లో భారత జట్టు తొలి కెప్టెన్ కర్నల్ సికె నాయుడు గౌరవార్థం ఈ అవార్డును బిసిసిఐ క్రికెటర్లకు అందజేస్తూ వస్తోంది. సికె నాయుడు 1916 నుంచి 1963 వరకు సుదీర్ఘంగా 47ఏళ్ల పాటు ఫస్ట్‌క్లాస్‌లో కొనసాగారు. ఇది ఒక ప్రపంచ రికార్డు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68




భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 27వ మహాసభ

మహాసభల సంరంభం

నలభై ఏడేళ్ల తరువాత ఉద్యమాల ఖిల్లా సింహపురి గడ్డపై సిపిఎం 27వ రాష్ట్ర మహా సభ జరుగుతున్న నేపథ్యంలో చరిత్ర పుటల నుంచి గత 26 మహాసభల గురించి సంక్షిప్తంగా ....

భారత కమ్యూనిస్టు పార్టీ ప్రథమ మహాసభ

1936 January 26 — తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ


కా॥ పి. సుందరయ్య (రాష్ట్ర కార్యదర్శి)

ప్రథమ మహాసభ రహస్యంగా జరిగింది. ఆనాటికి పార్టీలో 40 మంది సభ్యులున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య కార్యదర్శిగా ఏడుగురితో ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది. మద్దుకూరి చంద్రశేఖరరావు, పోలేపెద్ది నరసింహమూర్తి,చలసాని వాసుదేవరావు, తనికెళ్ళ వెంకటచలపతి, కొసరాజు శేషయ్య, అల్లూరి సత్యనారాయణ కమిటీలో ఉన్నారు. 10 మంది ప్రతినిధులతో సభ జరిగింది. 1936 సుందరయ్య అరెస్ట్ అయినందున పోలేపెద్ది నరసింహమూర్తిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. మహాసభకు కేంద్రం నుండి ఎస్.వి ఘాటే హాజరయ్యారు. సుందరయ్య పార్టీ పాలసీ మార్పును తెలిపారు. 'దత్తు-బ్రాడ్లీ థీసీస్' చర్చకు వచ్చింది. కాంగ్రెస్ వంటెద్దు ధోరణి, సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘటన వంటి వాటిపై స్పష్టమైన వైఖరిని మహాసభ తీసుకుంది..

భారత కమ్యూనిస్టు పార్టీ ద్వితీయ మహాసభ

జూన్ 1938 — నవశక్తి కార్యాలయం, విజయవాడ


కా॥ పి. సుందరయ్య (రాష్ట్ర కార్యదర్శి)

ద్వితీయ మహాసభకు 60 మంది ప్రతినిధులు హాజరయ్యారు. పార్టీ సభ్యులు ఆనాటికి 200 మంది. ఏడుగురు సభ్యులతో రాష్ట్ర కమిటీ ఎన్నుకోబడింది. పుచ్చలపల్లి సుందరయ్య కార్యదర్శిగానూ, చంద్ర రాజేశ్వరరావు, మద్దుకూరి చంద్రశేఖరరావు, చలసాని వాసుదేవరావు,అల్లూరి సత్యనారాయణ, పోలేపెద్ది నరసింహమూర్తి, పులుపుల శివయ్య కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. మహాసభకు కేంద్రకమిటీ తరపున పి.సి జోషి హాజరయ్యారు. ప్రజారంగాల్లో పనిచేయడం, జాతీయ ఐక్య సంఘటన నిర్మాణంపై ప్రధానంగా చర్చ జరిగింది. దీని ఆధారంగా పార్టీ సభ్యులు పని చేయడంతో తర్వాత మహాసభ నాటికి సభ్యత్వంలోనూ, పని విధానంలోనూ అభివృద్ధి కనిపించింది..

భారత కమ్యూనిస్టు పార్టీ తృతీయ మహాసభ

1943 జులై 8-15 — విజయవాడ


కా॥ చంద్ర రాజేశ్వరరావు (రాష్ట్ర కార్యదర్శి)

మహాసభలో చంద్ర రాజేశ్వరరావు కార్యదర్శిగా ఏడుగురితో నూతన కమిటీ ఏర్పడింది. పుచ్చలపల్లి సుందరయ్య, మద్దుకూరి చంద్రశేఖరరావు, మాకినేని బసవపున్నయ్య, చలసాని వాసుదేవరావు కమిటీ సభ్యులుగానూ, కడియాల గోపాలరావు, ఎస్.వి.కె ప్రసాద్ కాండిడేట్ సభ్యులుగానూ ఎన్నుకోబడ్డారు.

పార్టీ సభ్యత్వం

1940 నాటికి 700 సభ్యత్వం ఉండగా, 1942 నాటికి 1176, 1943 నాటికి 3256 కు పెరిగింది. పూర్తి కాలం కార్యకర్తలు 650 మంది ఉన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ నాల్గవ మహాసభ

1947 జనవరి 20-28 — బుద్ధవరం, కృష్ణాజిల్లా


కా॥ చంద్ర రాజేశ్వరరావు (రాష్ట్ర కార్యదర్శి)

నాల్గవ మహాసభ అనంతరం రెండు రోజులకు ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే పార్టీపై నిర్బంధం ప్రయోగించబడింది.పార్టీ నాయకులను అరెస్ట్ చేశారు. ప్రజాశక్తిని ప్రభుత్వం నిషేధించింది. మహాసభకు కేంద్రం నుండి కామ్రేడ్ అధికారి హాజరై రాజకీయ తీర్మానాన్ని వివరించారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ఈ కాలంలో తెలంగాణా పోరాటం జరగడంతో పార్టీపై దారుణమైన దమనకాండ కొనసాగింది..

భారత కమ్యూనిస్టు పార్టీ ఐదవ మహాసభ

1953 జూన్ 8-14 — తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా


కా॥ ఎం. చంద్రశేఖరరావు (రాష్ట్ర కార్యదర్శి)

1948 నుండి 1951 వరకు పార్టీ నాయకత్వం రహస్య జీవితం గడిపింది. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది.నిర్బంధం వల్ల అనేక మంది పార్టీ సభ్యులు బయటకు వెళ్ళిపోయారు. పార్టీని పునర్నిర్మించుకోవడం ఈ మహాసభ ప్రత్యేకత.

ఐదవ మహాసభకు సుమారు 225 మంది ప్రతినిధులు హాజరయ్యారు. పార్టీ సభ్యత్వం 4,499 కి చేరింది. సౌహార్ధ్ర ప్రతినిధులుగా 40 మంది వచ్చారు. వారిలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం, భీమిరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు. మహాసభ 33 మందితో రాష్ట్ర కమిటీని, 9 మందితో కార్యదర్శివర్గాన్ని ఎన్నుకుంది.

కామ్రేడ్ మద్దుకూరి చంద్రశేఖరరావు కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ, కె.ఎల్ నరసింహం,ఉద్దరాజు రామం కార్యదర్శివర్గ సభ్యులు.

భారత కమ్యూనిస్టు పార్టీ ఆరవ మహాసభ

1956 ఫిబ్రవరి 17-23 — రేవేంద్రపాడు, గుంటూరు జిల్లా

పార్టీ సభ్యత్వం 12,000


కా॥ చంద్ర రాజేశ్వరరావు (రాష్ట్ర కార్యదర్శి)

మహాసభలకు 256 మంది హాజరైనారు. విశాలాంధ్ర ఏర్పడనున్న చారిత్రక సమయంలో ఈ మహాసభ జరిగింది. ఈ కాలంలో ఏర్పాటు చేసిన 200 సదస్సులలో దాదాపు లక్ష మందికి పైగా పాల్గొన్నారు. మహాసభలో పార్టీలోని సైద్ధాంతిక విభేదాలపై తీవ్ర చర్చ జరిగింది. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. తొమ్మిది మందితో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, మద్దుకూరి చంద్రశేఖరరావు, మాకినేని బసవపున్నయ్య, తమ్మారెడ్డి సత్యనారాయణ,వై.వి.కృష్ణారావు, తరిమెల నాగిరెడ్డి, కె.ఎల్.నర్సింహం, సంకు అప్పారావులున్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ ఏడవ మహాసభ

1956 జులై 2-7 — హైదరాబాద్


కా॥ చంద్ర రాజేశ్వరరావు (రాష్ట్ర కార్యదర్శి)

మహాసభ 41 మందితో నూతన రాష్ట్ర సమితిని, 13 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని ఎన్నుకుంది.

కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు కార్యదర్శిగా, పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, మద్దుకూరి చంద్రశేఖరరావు, మోటూరు హనుమంతరావు, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, ముఖ్దుం మొహియుద్దీన్, తమ్మారెడ్డి సత్యనారాయణ, వై.వి.కృష్ణారావు, తరిమెల నాగిరెడ్డి, కె.ఎల్ నరసింహం కార్యదర్శివర్గ సభ్యులు. విశాలాంధ్రకు ఎన్నికలు జరపాలని కోరుతూ మహాసభ తీర్మానాన్ని ఆమోదించింది. ఎగువసభ(శాసనమండలి) అవసరం లేదనీ, విశాలాంధ్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రజారాజ్య స్థాపన అవసరమనీ, దీనికి అందరూ కృషి చేయాలనీ మహాసభ భావించింది.

భారత కమ్యూనిస్టు పార్టీ ఎనిమిదవ మహాసభ

1958 DEC- 30, 1959 Jan- 1,2 — ఖమ్మం


కా॥ చంద్ర రాజేశ్వరరావు (రాష్ట్ర కార్యదర్శి)

212 మంది ప్రతినిధులు మహాసభకు హాజరైనారు. పార్టీ ప్రధాన కార్యదర్శి అజయ్ ఘోష్ మహాసభను ప్రారంభించారు. ఏడుగురు కార్యదర్శులతో కూడిన 21 మంది సభ్యుల కార్యవర్గాన్ని మహాసభ ఎన్నుకుంది. చంద్ర రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, మోటూరు హనుమంతరావు, బద్దం ఎల్లారెడ్డి, వై.వి.కృష్ణారావు, తమ్మారెడ్డి సత్యనారాయణ రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డారు. 1955 ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ బాగా దెబ్బతిన్నది. తదుపరి మూడేళ్లలో తిరిగి కోలుకుంది. రాష్ట్రంలో 170 తాలుకాలలో 40,000 మంది సభ్యులున్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ తొమ్మిదవ మహాసభ


1960 DEC- 12-14, 1961 Jun- 8-11 — అనంతపురం


కా॥ నీలం రాజశేఖర రెడ్డి (రాష్ట్ర కార్యదర్శి)

రాజకీయ సిద్ధాంత విభేదాలవల్ల రెండు భాగాలుగా మహాసభ జరిగింది. అనంతపురం మహాసభకు 350 మంది ప్రతినిధులు హాజరైనారు. మాస్కోలో జరిగిన 81 కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల సభలో చేసిన తీర్మానం ఈ మహాసభలో ప్రధాన ఎజెండా. తీవ్రమైన వాదోపవాదాల అనంతరం ప్రకటనను మహాసభ ఆమోదించింది. ఈ రాజకీయ సిద్ధాంత విభేదాలు, నిర్మాణ సమస్యలు విభేదాలకు దారితీశాయి. రాష్ట్ర కమిటీ, కార్యదర్శి ఎన్నికలను అడ్డం కొట్టారు. రాజమండ్రి మహాసభలో కామ్రేడ్ అజయ్ ఘోష్ పతాకావిష్కరణ చేసి మహాసభను ప్రారంభించి రాజకీయ నివేదికనిచ్చారు. మితవాద భావాల వైపు మొగ్గును నిరోధించి, వామపక్ష భావాల వైపు మొగ్గును సాధించేందుకు ప్రజాతంత్ర శక్తులన్నింటితో కలిసి సమైక్యంగా కమ్యూనిస్టు పార్టీ కృషి చేయాలని, సామ్రాజ్యవాదుల ఆర్థిక సహాయంపై భారత ప్రభుత్వం ఆధారపడుతున్నదని, ఈధోరణిని తిప్పికొట్టాలని అజయ్ ఘోష్ మాట్లాడారు. మహాసభ 101 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకుంది. కామ్రేడ్ నీలం రాజశేఖరరెడ్డి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పదవ మహాసభ

1964 అక్టోబర్ 7-11 — విజయవాడ


కా॥ మోటూరు హనుమంతరావు (రాష్ట్ర కార్యదర్శి)

రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ప్రాధాన్యత ఉన్న మహాసభ ఇది. మార్క్సిస్టు పార్టీ ఏర్పడిన తర్వాత జరిగిన మొదటి మహాసభ. రివిజనిజానికి వ్యతిరేకంగా ప్రతిఘటించి, పార్టీని పునర్నిర్మించుకున్న చారిత్రాత్మక మహాసభ ఇది. విప్లవ పార్టీగా వర్గపోరాట మార్గంలో ముందుకు వెళ్లాలని మహాసభ నిర్దేశించుకుంది. 17జిల్లాల నుండి 374 మంది ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య రాష్ట్ర కార్యదర్శిగా 24 మందితో రాష్ట్ర కమిటి ఏర్పడింది. అనంతరం సుందరయ్య అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవగా రాష్ట్ర కార్యదర్శిగా మోటూరు హనుమంతరావు ఎన్నికైనారు. ఉద్దరాజు రామం, దేవులపల్లి వెంకటేశ్వరావు, పర్స సత్యనారాయణ, చంద్ర పుల్లారెడ్డి, తదితరులు కమిటీలో ఉన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 11వ మహాసభ


1968 డిసెంబర్ 6-10 — ఖమ్మం


కా॥ మోటూరు హనుమంతరావు (రాష్ట్ర కార్యదర్శి)

ఒంటెత్తు వాదానికి వ్యతిరేకంగా పార్టీని కాపాడుకునేందుకు జరిగిన మహాసభ ఇది. నిర్బంధాన్ని ఎదుర్కొని ముందుకు కదులుతున్న సమయంలో నగ్జలైట్ విచ్ఛిన్నం పార్టీని తీవ్రంగా దెబ్బతీసింది. మార్క్సిస్టు, లెనినిస్టు అవగాహనను ముందుకు తీసుకెళతామని మహాసభ నిర్ణయం తీసుకుంది.

సోషలిస్టు ఉద్యమం, జాతీయ విముక్తి ఉద్యమాలు, ప్రజాశక్తులు పురోగమిస్తున్న కాలం. అలాగే సోషలిస్టు శిబిరంలో రివిజనిస్టు ధోరణులు ప్రబలాయి. మరోవైపు సామ్రాజ్యవాదం దురాక్రమణ పద్ధతులు సాగిస్తున్నది. దేశంలో తొలిసారిగా 9 రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. విచ్ఛిన్నం వల్ల పార్టీ సభ్యత్వం తగ్గింది.1964లో 28 వేలు వుంటే,1967నాటికి 16,000 కు, 1968నాటికి 8500కు పడిపోయింది. రాష్ట్ర కమిటీ 17మందితో ఏర్పడింది.

రాష్ట్ర కార్యదర్శిగా మోటూరు హనుమంతరావు, కార్యదర్శివర్గసభ్యులుగా నండూరి ప్రసాదరావు, ఎల్ బి గంగాధరరావు, ఉద్దరాజు రామం, గుంటూరు బాపనయ్య ఎన్నికైనారు. దుందుడుకువాదం నుండి పార్టీని కాపాడుకుని, దాడులను ఎదుర్కొని, ఉద్యమకారులను రక్షించుకొని, ప్రజాసంఘాలను బలోపేతం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది.



1981 డిసెంబర్ 26 నుండి 1982 జనవరి 2వరకు సిపిఎం 11వ అఖిల భారత మహాసభ విజయవాడలో జరిగింది. ఆ సందర్భంగా కృష్ణానదిలో జరిగిన భహిరంగ సభకు పోటెత్తిన జనం

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 12వ మహాసభ


1971 డిసెంబర్ 2-5 — హనుమకొండ, వరంగల్ జిల్లా


కా॥ మోటూరు హనుమంతరావు (రాష్ట్ర కార్యదర్శి)

1968 చీలిక అనంతరం అతివాదులు సిద్ధాంతదాడులు జరపడం, మరోవైపు రివిజనిస్టులు దుయ్యబడుతున్న నేపథ్యంలో జరిగిన మహాసభ ఇది. అంతర్జాతీయంగా చూస్తే పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉండగా, సోషలిస్టు దేశాల మధ్య వచ్చిన కలతలు గందరగోళంగా ఉన్న సమయం. దేశంలోనూ, రాష్ట్రంలోనూ నిర్బంధం కొనసాగుతున్నది. పార్టీ సభ్యత్వం 6,623. మహాసభకు 260 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 27మందిలో రాష్ట్ర కమిటీ ఏర్పడింది. మోటూరు హనుమంతరావు కార్యదర్శిగా, సెక్రటేరియట్ నండూరి ప్రసాదరావు, ఎల్. బి.గంగాధరరావు,ఉద్దరాజు రామం భీమిరెడ్డి నర్సింహారెడ్డి, పర్స సత్యనారాయణ, మానికొండ సుబ్బారావు ఎన్నికయ్యారు. కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య, సుందరయ్య మహాసభలో పాల్గొన్నారు. కేంద్ర పరిశీలకులుగా హరేకృష్ణ కోనార్, ఎంఆర్ వెంకట్రామన్ హాజరయ్యారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 13వ మహాసభ


1978 మార్చి 23-26 — నెల్లూరు


కా॥ మోటూరు హనుమంతరావు (రాష్ట్ర కార్యదర్శి)

సోషలిస్టు రాజ్యాలు నిలదొక్కుకుని, విస్తరించే దశలో ఉన్నాయి. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ నేతృత్వంలో ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తూ నియంతృత్వ పోకడలతో ఎమర్జెన్సీ విధించింది. దేశవ్యాప్తంగా మన పార్టీ కార్యకర్తలు 1,100 మంది హత్యగావించబడ్డారు. 39 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడింది. రాష్ట్ర కార్యదర్శిగా మోటూరు హనుమంతరావు ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గంలో పుచ్చలపల్లి సుందరయ్య, నండూరి ప్రసాదరావు, ఎల్.బి.గంగాధరరావు, ఉద్దరాజు రామం, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, పర్స సత్యనారాయణ, కొరటాల సత్యనారాయణ, ఎం.ఓంకార్ ఉన్నారు. ఈ మహాసభలో కామ్రేడ్ గుంటూరు బాపనయ్య హఠాన్మరణం విచారకర వాతావరణం కల్పించింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 14వ మహాసభ

1981 డిసెంబర్ 17-20 — విజయవాడ


కా॥ పి. సుందరయ్య (రాష్ట్ర కార్యదర్శి)

పార్టీ సభ్యత్వం 9,590 నుండి 14,468కి పెరిగింది. మహాసభకు 292 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 51 మందితో రాష్ట్ర కమిటీ,9 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం ఏర్పాటయ్యాయి. కార్యదర్శిగా పుచ్చలపల్లి సుందరయ్య ఎన్నికైనారు. మోటూరు హనుమంతరావు, ఎల్.బి.గంగాధరరావు, నండూరి ప్రసాదరావు, ఉద్దరాజు రామం, కొరటాల సత్యనారాయణ, భీమిరెడ్డి నర్సింహారెడ్డి కార్యదర్శివర్గంగా ఉన్నారు.

సోషలిజాన్ని కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నం జరుగుతున్న కాలమది. దేశంలో ప్రజలు ఆర్థిక భారాలతో తీవ్ర కడగండ్లకు గురౌతున్న సమయం. పార్టీపై నిర్బంధం ఈ కాలంలో తీవ్రంగా ఉంది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 15వ మహాసభ

1985 అక్టోబర్ 20-22 — గుంటూరు


కా॥ లావు బాలగంగాధరరావు (రాష్ట్ర కార్యదర్శి)

దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత,రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర వహించిన పుచ్చలపల్లి సుందరయ్య మరణించిన అనంతరం జరిగిన మహాసభ ఇది. పార్టీ సభ్యత్వం 18,668కి పెరిగింది. 1977 నుండి పార్టీ సభ్యత్వం క్రమంగా పెరుగుతున్నా 1983లో రాజకీయ అననుకూలతల వల్ల కాస్త తగ్గింది. ఈ మహాసభ కాలంలోనే ఓంకార్ పార్టీకి ద్రోహం చేసి, బహిష్కరించబడ్డారు.

నిర్మాణ సమస్యలపై సాల్కియా ప్లీనం నిర్ణయాలను మన రాష్ట్రంలో అమలు జరిపిన తీరుపై సమీక్ష జరిగింది. మహాసభకు 355 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కామ్రేడ్ లావు బాలగంగాధరరావు కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. కార్యదర్శివర్గ సభ్యులుగా మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావు, ఉద్దరాజు రామం, భీమిరెడ్డి నరసింహారెడ్డి, కొరటాల సత్యనారాయణ, మల్లు వెంకటనర్సింహారెడ్డి, బోడేపూడి వెంకటేశ్వరరావు, అట్లూరిశ్రీమన్నారాయణ, ఏ.పి.విఠల్ మొత్తం 11 మందితో ఏర్పడింది. రాష్ట్ర కమిటీ 53 మంది.

ప్రజాసమస్యలపై ఐక్య కార్యాచరణకు ప్రయత్నించాలనీ, ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించే పార్టీగా తీర్చిదిద్దాలనీ మహాసభ పిలుపు నిచ్చింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 16వ మహాసభ

1988 నవంబర్ 4-7 — విజయవాడ



కా॥ లావు బాలగంగాధరరావు (రాష్ట్ర కార్యదర్శి)

పార్టీ సభ్యత్వం 18,868 నుండి 23,462 కి పెరిగింది. మహాసభకు 397 మంది హాజరయ్యారు. కామ్రేడ్ లావు బాలగంగాధరరావు కార్యదర్శిగా ఎన్నికైనారు. మోటూరు హనుమంతరావు, ఎల్.బి.జి, నండూరి ప్రసాదరావు, మల్లు వెంకట నర్సింహారెడ్డి, కొరటాల సత్యనారాయణ, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, పర్స సత్యనారాయణ, బోడేపూడి వెంకటేశ్వరరావు, అట్లూరి శ్రీమన్నారాయణ, బి.వి.రాఘవులు, అల్లూరి సత్యనారాయణ, పుతుంబాక వెంకటపతిలతో కార్యదర్శివర్గం,58 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికయ్యాయి.

ప్రపంచశాంతి, అణ్వాయుధాల నిరాయుధీకరణ అత్యంత ప్రాధాన్యత గల అంశంగావున్నది. దేశంలో రాజీవ్ గాంధీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలు వెలుగుజూశాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తెలుగుదేశం నిలబడింది. వామపక్ష ప్రజాతంత్ర నిర్మాణం, విశాల ప్రజాఉద్యమ నిర్మాణానికి పూనుకోవాలని మహాసభ పిలుపునిచ్చింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 17వ మహాసభ

1991 అక్టోబర్ 31 — అక్టోబర్ 31 - నవంబర్ 3, విశాఖపట్నం


కా॥ కొరటాల సత్యనారాయణ (రాష్ట్ర కార్యదర్శి)

పార్టీ సభ్యత్వం 23,560 నుండి 27,140 కి పెరిగింది. మహాసభకు 394 మంది ప్రతినిధులు హాజరైనారు. 12 మందితో కార్యదర్శివర్గం, 66 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడ్డాయి. మధ్యంతర సమీక్ష సందర్భంగా చేర్పులు, మార్పుల అనంతరం కార్యదర్శివర్గం 17, రాష్ట్రకమిటీ 70కి చేరాయి.

కార్యదర్శిగా కొరటాల సత్యనారాయణ ఎన్నికైనారు. కొరటాల సత్యనారాయణ, ఎల్.బి.గంగాధరరావు, మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావు, యం.వి నర్సింహారెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, పర్స సత్యనారాయణ, పుతుంబాక వెంకటపతి, బోడేపూడి వెంకటేశ్వరరావు, అల్లూరి సత్యనారాయణ, బి.వి.రాఘవులు, పి.మధు కార్యదర్శివర్గంగా ఎన్నికైనారు.

సోవియట్ యూనియన్ కూలిపోవడం, తూర్పు యూరప్ పరిణామాలతో సోషలిస్టు శిబిరానికి తీవ్ర విఘాతం కలిగింది. చైనాలో తియాన్మెన్ స్క్వేర్ ఘటనలు జరిగాయి. దీంతో కమ్యూనిస్టు శక్తులపై తీవ్రమైన సైద్ధాంతిక దాడి ప్రారంభమైంది. దేశంలో కాంగ్రెస్ ఓడిపోయింది. నేషనల్ ఫ్రంట్ అధికారంలోకి వచ్చింది.

మన పార్టీ ప్రతిష్ట పెరిగి రాజకీయాలను ప్రభావితం చేయగలిగే స్థితికి వచ్చాం. మార్క్సిజంపై సైద్ధాంతిక దాడి దృష్ట్యా అకుంఠిత దీక్షతో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని మహాసభ నిర్ణయించింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 18వ మహాసభ

అక్టోబర్ 1995 — అక్టోబర్ 27-30, హైదరాబాద్


కా॥ కొరటాల సత్యనారాయణ (రాష్ట్ర కార్యదర్శి)

పార్టీ సభ్యత్వం 27,140 నుండి 35,328కి పెరిగింది. మహాసభకు 419 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కార్యదర్శిగా కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ ఎన్నికైనారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఎల్.బి. గంగాధరరావు, నండూరి ప్రసాదరావు, మోటూరు హనుమంతరావు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, అల్లూరి సత్యనారాయణ, మల్లు వెంకట నర్సింహారెడ్డి, బోడేపూడి వెంకటేశ్వరరావు, జక్కా వెంకయ్య, పాటూరి రామయ్య, పి.మధు, తమ్మినేని వీరభద్రం,తెలకపల్లి రవి, బి.వి.రాఘవులు, వి.కృష్ణయ్య.. మొత్తం 15మంది ఎన్నికైనారు. ఉద్యమ విస్తరణ, ప్రజాసంక్షేమం, సైద్ధాంతిక కృషితో పాటు, నిర్మాణ బలహీనతలను అధిగమించడానికి తీవ్ర ప్రయత్నం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. ఈకాలంలో సోవియట్, తూర్పు యూరప్ దేశాల్లో సోషలిస్టు వ్యవస్థ కూలిపోవడం, దేశంలో మతోన్మాద శక్తులు పెచ్చరిల్లి బాబ్రీ మసీదును కూల్చివేయడం, లౌకికతత్వానికి ప్రమాదం ఏర్పడడం వంటి ఘటనలు ఈకాలంలో చోటుచేసుకున్నాయి.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 19వ మహాసభ

నవంబర్ 1997 — నవంబర్ 30 - డిసెంబర్ 3, నల్గొండ


కా॥ బి.వి. రాఘవులు (రాష్ట్ర కార్యదర్శి)

పార్టీ సభ్యత్వం 35,575 నుండి 36,519 కి పెరిగింది. మహాసభకు 532 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 15 మందితో కార్యదర్శివర్గం, 78 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడ్డాయి. బి.వి.రాఘవులు కార్యదర్శిగా ఎన్నికైనారు. కార్యదర్శివర్గంగా కొరటాల సత్యనారాయణ, మోటూరి హనుమంతరావు, ఎం.వి నర్సింహారెడ్డి, అల్లూరి సత్యనారాయణ, పాటూరి రామయ్య, పి.మధు, తెలకపల్లి రవి, టి.వీరభద్రం, వి.కృష్ణయ్య, జక్కా వెంకయ్య, వి.శ్రీనివాసరావు, కె.వెంకటయ్య, వై.వెంకటేశ్వరరావు, వై.రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

ప్రజాసంఘాలను కొత్త ఒరవడిలో నడపాలనీ, వర్గపోరాటాల నిర్వహణలో బలహీనతలను అధిగమించే ప్రయత్నం చేయాలనీ మహాసభ పిలుపునిచ్చింది. విస్తరణ లక్ష్యంగా ప్రజాపోరాటాలు ఉధృతం చేయాలనీ, దిద్దుబాటు ఉద్యమం అమలు చేయాలనీ నిర్ణయించింది.

ఈకాలంలో సోషలిస్టు శిబిరానికి ఎదురుదెబ్బ తగలడంతో, తాత్కాలికంగా సామ్రాజ్యవాదానిదే పై చేయిగా ఉంది. దేశంలో పీ.వీ నర్సింహారావు సరళీకరణ ఆర్థిక విధానాల ప్రభావంతో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల్లో ఓడింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 20వ మహాసభ

జనవరి 2002 — జనవరి 10-12, అనంతపురం


కా॥ బి.వి. రాఘవులు (రాష్ట్ర కార్యదర్శి)

15 మందితో కార్యదర్శివర్గం, 81 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడ్డాయి. బి.వి.రాఘవులు కార్యదర్శిగా ఎన్నికైనారు. కార్యదర్శివర్గంగా కొరటాల సత్యనారాయణ, ఎం.వి నర్సింహారెడ్డి, పాటూరి రామయ్య, టి.వీరభద్రం, అల్లూరి సత్యనారాయణ, జక్కా వెంకయ్య, పి.మధు, కె.వెంకటయ్య, వి.శ్రీనివాసరావు, వై.రాధాకృష్ణమూర్తి, వి.కృష్ణయ్య, వై.వెంకటేశ్వరరావు, ఎం.ఏ.గఫూర్, సీ.హెచ్ నర్సింగరావు ఉన్నారు.

పార్టీ సీనియర్ నాయకులు మోటూరి హనుమంతరావు, నండూరి ప్రసాదరావులు ఈ కాలంలో మరణించారు. పార్టీ స్వతంత్రను కాపాడుకోవాలనీ, కమ్యూనిస్టు ప్రమాణాలను పునరుద్ధరించాలనీ, ప్రజలతో మమేకం కావాలనీ మహాసభ నిర్ణయించింది.

ఈకాలం డబ్ల్యూటీసి, పెంటగాన్‌పై ఉగ్రవాదుల దాడులు జరిగాయి. ప్రపంచాధిపత్యం కోసం అమెరికా ప్రయత్నాలను ముమ్మరం చేసింది. మరోవైపు ప్రపంచీకరణకు వ్యతిరేకంగా నిరసనలు పెరిగాయి. దేశంలో లౌకికతత్వానికి, సమైక్యతకూ ప్రమాదం ఏర్పడింది. కార్గిల్ యుద్ధం జరిగింది.

రాష్ట్రంలో షరతులతో కూడిన ప్రపంచబ్యాంకు ఒప్పందాలు, సంస్కరణలను తెలుగుదేశం ప్రభుత్వం వేగవంతం చేసింది. నాలుగునెలలపాటు చారిత్రాత్మక విద్యుత్ పోరాటం జరిగింది. ఛలో హైదరాబాద్ ప్రదర్శన సందర్భంగా జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 21వ మహాసభ

జనవరి 2005 — జనవరి 25-28, వరంగల్


కా॥ బి.వి. రాఘవులు (రాష్ట్ర కార్యదర్శి)


పార్టీ సభ్యత్వం 40,830 నుండి 49,527కు పెరిగింది. మహాసభకు 698మంది ప్రతినిధులు హాజరైనారు. 15మందితో కార్యదర్శివర్గం, 80మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడ్డాయి. కార్యదర్శిగా బి.వి.రాఘవులు ఎన్నికైనారు. కార్యదర్శివర్గంలో కొరటాల సత్యనారాయణ, పాటూరి రామయ్య, పి.మధు, వి.శ్రీనివాసరావు, తమ్మినేని వీరభద్రం, వి.కృష్ణయ్య, వై.వెంకటేశ్వరరావు, జక్కావెంకయ్య, ఎం.ఎ. గఫూర్, సీ.హెచ్ నర్సింగరావు, ఎస్.వీరయ్య, సారంపల్లి మల్లారెడ్డి, సీ.హెచ్. సీతారాములు, జి.నాగయ్య ఉన్నారు.

ఈ కాలంలో ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా ప్రపంచ పెత్తనం చెలాయిస్తోంది. దేశంలో మతతత్వ పార్టీ నేతృత్వంలోని ఎన్ డి ఎ పరాజయం పాలైంది. వామపక్షాలు చరిత్రలో ఎన్నడూ లేనంత ఎక్కువ లోక్‌సభ సీట్లను గెల్చుకున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి బయట నుండి మద్దతునిచ్చాం. ప్రజలకు ఉపయోగపడే పథకాలను తేవడంలోనూ, హానికర చట్టాలను రాకుండా చేయడంలోనూ ప్రభుత్వంపై ఒత్తిడి తేగలిగాం. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారం కోల్పోయింది.

ప్రజాసమస్యలపై ఉద్యమాలను ముమ్మరం చేయాలనీ, ప్రజాపునాదిని పెంచుకోవాలనీ, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టాలని, మహాసభ పిలుపునిచ్చింది. అన్ని మండల కేంద్రాల్లో పార్టీని విస్తరింపచేయాలని నిర్ణయించింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 22వ మహాసభ

2008 ఫిబ్రవరి 8-10 — ప్రగతినగర్, రంగారెడ్డి జిల్లా


కా॥ బి.వి. రాఘవులు (రాష్ట్ర కార్యదర్శి)

పార్టీ సభ్యత్వం 49,527 నుండి 63,244కు పెరిగింది. మహాసభకు 721మంది ప్రతినిధులు హాజరైనారు. 14మందితో కార్యదర్శివర్గం, 80మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడ్డాయి. కార్యదర్శిగా బి.వి.రాఘవులు ఎన్నికైనారు. కార్యదర్శివర్గంలో పాటూరి రామయ్య, పి.మధు, వి.శ్రీనివాసరావు, తమ్మినేని వీరభద్రం, వి.కృష్ణయ్య, వై.వెంకటేశ్వరరావు, జక్కావెంకయ్య, ఎం.ఎ.గఫూర్, సీ.హెచ్. నర్సింగరావు, ఎస్.వీరయ్య, సారంపల్లి మల్లారెడ్డి, సీ.హెచ్. సీతారాములు, జి.నాగయ్య ఉన్నారు.

ఈ కాలంలో ఆర్థిక దిగ్బంధనం, సైనిక జోక్యం వంటి పద్ధతులలో ఆయాదేశాలను లొంగదీసుకోవాలని అమెరికా ప్రయత్నాలు సాగించింది. మూడో ప్రపంచ దేశాలపై ఆర్థిక భారాలను వేస్తోంది. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి క్రమంగా పెరుగుతోంది.

పార్టీ పెద్ద ఎత్తున భూపోరాట ఉద్యమాలు చేసింది. రాజకీయాలను ప్రజల ఎజెండాగా మార్చాలనీ, ఉద్యమాలు, పోరాటాలను ఉధృతం చేయాలనీ, కేంద్రీకరణ -విస్తరణ నిర్మాణ కర్తవ్యంగా మహాసభ తీసుకుంది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 23వ మహాసభ

2012 ఫిబ్రవరి 2-4 — ఖమ్మం


కా॥ బి.వి. రాఘవులు (రాష్ట్ర కార్యదర్శి)

ఈ మహాసభకు 700 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. 81 మందితో రాష్ట్ర కమిటీ, 15 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఏర్పాటయ్యింది. రాష్ట్ర కార్యదర్శిగా బి.వి.రాఘవులు ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా పాటూరు రామయ్య, టి.వీరభద్రం, పి. మధు, ఎస్. పుణ్యవతి, ఎం.ఏ. గఫూర్, వి.కృష్ణయ్య, వై.వెంకటేశ్వరరావు, సి.హెచ్.నర్సింగరావు, ఎస్.వీరయ్య, ఎస్.మల్లారెడ్డి, సి.హెచ్. సీతారాములు, జి.నాగయ్య, డా॥ మిడియం బాబూరావు, సి.రాములు ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇది చివరి మహాసభ.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభ

ఫిబ్రవరి 2015 — ఫిబ్రవరి 8,9 - విజయవాడ


కా॥ పెనుమల్లి మధు (రాష్ట్ర కార్యదర్శి)

మహాసభకు మొత్తం 510 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 59 మందితో రాష్ట్ర కమిటీ, 13 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఏర్పాటయ్యింది. రాష్ట్ర కార్యదర్శిగా పెనుమల్లి మధు ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా పాటూరు రామయ్య, ఎస్. పుణ్యవతి, ఎం.ఏ. గఫూర్, వి.కృష్ణయ్య, వై.వెంకటేశ్వరరావు, సి.హెచ్.నర్సింగరావు, డా॥ మిడియం బాబూరావు, ఎం.వి.ఎస్.శర్మ, వి.ఉమామహేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, దడాల సుబ్బారావు, సి.హెచ్. బాబూరావు ఎన్నికయ్యారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 25వ మహాసభ

ఫిబ్రవరి 2018 — ఫిబ్రవరి 10, 11, 12 - భీమవరం



కా॥ పెనుమల్లి మధు (రాష్ట్ర కార్యదర్శి)

పార్టీ సభ్యత్వం 21,500 కి పెరిగింది. మహాసభకు 450 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కార్యదర్శిగా కామ్రేడ్ పెనుమల్లి మధు ఎన్నికయ్యారు. మొత్తం 60 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. కార్యదర్శి వర్గ సభ్యులుగా వి.శ్రీనివాసరావు, ఎం.ఎ. గఫూర్, వై.వెంకటేశ్వరరావు, వి.కృష్ణయ్య, సిహెచ్.నర్సింగరావు, మిడియం బాబూరావు, ఎం.వి.ఎస్.శర్మ, దడాల సుబ్బారావు, ఎం.కృష్ణమూర్తి, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, డి.రమాదేవి, మంతెన సీతారాం, కె.ప్రభాకరరెడ్డి మొత్తం 15 మంది ఎన్నికయ్యారు.

ఆర్ఎస్ఎస్ మతోన్మాద ప్రమాదాన్ని అడ్డుకొనేందుకు కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో క్షేత్రస్థాయి కృషి జరపాలని మహాసభ పిలుపునిచ్చింది. విజ్ఞాన కేంద్రాలను నెలకొల్పి ప్రజా వికాశం కలిగించాలని, సైన్సు, హేతువాదాలను ప్రోత్సహించాలని, ప్రజా సమస్యలపైన పోరాటాలు నడపాలని మహాసభ పిలుపునిచ్చింది. ఈ కాలంలో నయా ఉదారవాద విధానాలు ప్రజలను, సామాజిక తరగతులను ముక్కలు చేసి, వ్యక్తులను ఒంటరిపాటు చేస్తున్నాయని, రాష్ట్రానికి ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రమాదం పొంచి ఉందని మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 26వ మహాసభ

డిసెంబర్ 2021 — డిసెంబర్ 27, 28, 29 - తాడేపల్లి - గుంటూరు


కా. వి శ్రీనివాసరావు (రాష్ట్ర కార్యదర్శి)

పార్టీ సభ్యత్వం 21,800 నుంచి 23,140 కి పెరిగింది. మహాసభకు 454 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 50 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కామ్రేడ్ వి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఎం.ఎ.గఫూర్, వై.వెంకటేశ్వరరావు, కె.ప్రభాకరరెడ్డి, డి.రామాదేవి, కె.లోకనాథం, మూలం రమేష్, వి.వెంకటేశ్వర్లు, పి.జమలయ్య, కె.సుబ్బరావమ్మ, సిహెచ్.నర్సింగరావు, సిహెచ్.బాబూరావు, మంతెన సీతారాం, బి.తులసీదాస్, కిల్లో సురేంద్ర మొత్తం 13 మంది ఎన్నికయ్యారు.

మోడీని గద్దె దించాలని, మతతత్వపు, కార్పొరేట్‌లూటీకి వ్యతిరేకంగా ప్రతిఘటనోద్యమం నిర్మించాలని మహాసభ పిలుపునిచ్చింది. ఆంధ్ర రాష్ట్రానికి (తెలుగు రాష్ట్రాలకు) మతతత్వపు ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది.

సేకరణ : దండమూడి భానుప్రసాద్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68